

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 06 పేజీలు: 10+4 వెల: 6.50



డబ్ల్యుపిఎల్ చాంపియన్స్‌గా ఆర్సీబి 2లో

'భారత్ టాక్సీ' సర్వీసులు మొదలు 5లో


# అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు

సిఎం చంద్రబాబు ఆదేశం

ఆధునిక నైపుణ్యాల్లో కార్మికులకు శిక్షణ

సంజీవనితో అనుసంధానించి వైద్యపరీక్షలు

కార్మికశాఖపై సమీక్షలో సిఎం



గురువారం కార్మికశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** అసంఘటిత రంగంలో ఉన్న భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరు ద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికా రులను ఆదేశించారు. ప్రసూతికి రూ.20 వేలు, వివా హానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అం త్యక్రియలకు రూ.20 వేల మేర ఆర్థిక సాయం అం దించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కార్మికశాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలను, జీవన ప్రమాణాలను పెంచే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్అండ్ టీ, ఎన్సీసీ, మిట్టల్ సహా

>>2

సాగునీటి సంఘాలకు జీఎస్టీ మినహాయింపు 2లో

## లడ్డూ కల్తీపాపం నుంచి వైకాపా తప్పించుకోలేదు

దోషులపై కఠిన చర్యలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి :** కరుడుగట్టిన నేరస్థుడు అసత్యాన్ని నమ్మిం చేందుకు చేసే ప్రయత్నమే లడ్డూ కల్తీ విషయంలో జగన్ చేస్తున్నారు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. జరిగిన అపవిత్రాన్ని సరిచేసేందుకు దేవుడు కల్పించిన మహా సంకల్పంగా తిరుమల లడ్డూ వ్యవహారాన్ని తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ వ్యవహారాన్ని కూటమి నేతలంతా సమావేశమై ఏం చర్యలు తీసుకోవాలి, ఎలా ముందుకు వెళ్లాలని చర్చించారు. అనంతరం కూటమి

>>2

## వచ్చే ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కల సేకరణ

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9వ తేదీ నుండి 28 వరకూ జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. జనాభా లెక్కల సేకరణ2027పై గురువారం ఎపి సచివాలయంలో రాష్ట్ర స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం(ఎస్ఎల్సిసి)ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రకియ సజావుగా జరిగేందుకు ఇప్పటి నుండే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియపై క్షేత్ర స్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని వాటిని తుచ తప్పక పాటించి జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని అన్నారు. జనాభా లెక్కల సేకరణ2027పై ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక ఐఇసి మెటీరియల్ ను ప్రచురించి అన్ని జిల్లాలకు పంపాలని అన్నారు. అంతేగాక ఎన్నికల సమయంలో వలె నిర్దిష్ట కాలపరిమితిలో చేయాల్సిన పనులపై ప్రత్యేకంగా బుక్లెట్‌ను ప్రచురించి జిల్లాలకు పంపాలని సిఎస్ విజయానంద్ సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జనాభా లెక్కల రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.ఎస్.రావత్ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ2027పై ప్రజల్లో తగిన అవగాహన కల్పించి వారికి సంబంధించిన పూర్తి సమాచారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె.నివాస్ జనాభా లెక్కల సేకరణ2027పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ గత జనాభా లెక్కల సేకరణ 2011లో జరిగిందని తదుపరి జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది ఫిబ్రవరి 9నుండి 28 వరకూ జరగనుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయి కోఆర్డినేషన్ కమిటీకి సంబంధించిన శాఖల చేయాల్సిన ఏర్పాట్లపై సెన్సస్ డైరెక్టర్ నివాస్ వివరించారు.

ఇంకా ఈసమావేశంలో స్వర్ణ గ్రామ, వార్డుల సంచాలకులు శివప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# 2032 నాటికి 17 అణు విద్యుత్ రియాక్టర్ల నిర్మాణం



ఎంపి మేడా రఘునాథ్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

**రాజంపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** దేశంలో 13,100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 17 అణువిద్యుత్ రియాక్టర్ల నిర్మాణం 2032 నాటికి పూర్తవు తాయని భావిస్తున్నట్లు కేంద్ర అణు ఇంధన శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. రాజ్యసభలో వైసిపి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి గురువారం దేశంలో అణు రియాక్టర్ల నిర్మాణం, దీనివలన పర్యావరణ సమస్యలు, ప్రభావం పై ప్రశ్నించారు. అందుకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రావత్‌భట రాజస్థాన్, గోరఖ్‌పూర్ హర్యానా, కూడంకుళం తమిళనాడు, కైగా కర్ణాటక, చుట్కా మధ్యప్రదేశ్, మహి బన్స్వారా రాజస్థాన్ లలో వివిధ దశలలో పనులు జరుగుతున్నాయన్నారు. దేశంలో ప్రస్తుతం స్థాపిత అణు విద్యుత్ సామర్థ్యం 8,780 మెగావాట్లు అన్నారు. 203132 నాటికి 22,480 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తమిళనాడులోని కల్పక్కంలో 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ ప్రాజెక్టును ప్రారంభిస్తోందన్నారు. ప్రీప్రాజెక్ట్ కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. రియాక్టర్ల భద్రత పనితీరును సమీక్షించడం, వాటి భద్రత, పనితీరును అత్యాధునిక స్థాయికి పెంచడానికి అవసరమైన అప్‌గ్రేడ్ చర్యల అమలు నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. అణు విద్యుత్ ప్లాంట్లకు సంబంధించి, ఆమోదించిన నిబంధనల ప్రకారం సమగ్ర పర్యావరణ ప్రభావ అంచనా, అధ్యయనం నిర్వహించబడుతుందన్నారు. ప్రాజెక్ట్ కోసం పర్యావరణ అనుమతి పొంద డానికి సూచించిన ప్రక్రియను అనుసరిస్తారన్నారు.

## హైకోర్టులో అంబటి పిటిషన్

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టును మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం ఆశ్రయించారు. తనపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయాలని(Quash) కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అంబటి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం.. ఈ పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరించింది. రాజకీయ కక్షసాధింపులో భాగంగా తనపై ఏడేళ్ల లోపు శిక్షపడే సెక్షన్లతో కేసులు నమోదు చేశారని రాంబాబు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసుల్లో ట్రయల్ కోర్టు తనకు రిమాండ్ విధించడాన్ని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తనపై ఉన్న కేసులను కొట్టివేసి, ఊరట కల్పించాలని కోరారు.

## బిసి జనగణన, వర్గీకరణపై వివరణ ఇవ్వండి

సర్కార్‌కు హైకోర్టు నోటీసులు

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో బిసి జనగణన, బిసి వర్గీకరణపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్, పురపాలకశాఖల ముఖ్య కార్యదర్శులు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను ఆదేశించింది. బిసి జనగణన చేశాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలంటూ ఎపిబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన

>>2

## ఆక్రమించిన క్వార్టర్లు ఖాళీ చేయించండి: హైకోర్టు

**విజయవాడ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆక్రమణలో ఉన్న భూముల, క్వార్టర్లను ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. నిబద్ధత కలిగిన అధికారిని రెండు వారాల్లో నియమించాలని, ఆక్రమణల తొలగింపు

>>2

# వారి తప్పుల్ని సవరిస్తున్నా

కాంగ్రెస్‌కు ఆలోచనలు లేవు, ప్రణాళిక లేదు..

విపక్షాలపై నిప్పులు చెరిగిన ప్రధాని మోడీ

వాణిజ్య ఒప్పందాలపై వివరణ

ఖర్గేపై సెటైర్లు.. ప్రతిపక్షాలు వాకౌట్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** విపక్షాలతో పాటు గతంలో ప్రధానులుగా పనిచేసిన వాళ్ల తప్పిదాల్ని సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ రాజ్యసభలో వెల్లడించారు. బుధవారం లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నందుకు నిరసనగా గురువారం ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకునేందుకు విపక్షాలు ప్రయత్నించాయి. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సమాధానంగా, భారతదేశం నేడు అనేక దేశాలకు విశ్వసనీయ భాగస్వామి అని, ప్రపంచ సంక్షేమం కోసం దేశం తన పాత్రను పోషిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. దేశం కోసం కాంగ్రెస్‌కు ఎటువంటి దార్శనికత, ప్రణాళిక లేదా ఆలోచనలు లేవని ప్రధాని విమర్శించారు. ఓవైపు తాను ప్రసంగం చేస్తున్నా నిలబడి నినాదాలు చేస్తున్న విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గేను ఉద్దేశించి "మీ వయస్సు ప్రకారం మీరు కూర్చుని నినాదాలు చేయవచ్చని ప్రధాని మోడీ చురకలు అంటించారు. నినాదాలు చేసిన తర్వాత ప్రతిపక్షాలు రాజ్యసభ నుండి వాకౌట్ చేశాయి, ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ. అనంతరం అభివృద్ధి చెందిన దేశాలకు వృధ్యాప్యం వస్తుంటే, మన దేశానికి మాత్రం యవ్వనం వస్తోందన్నారు. ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన ప్రతిభావంతులైన సమూహాలలో మనదీ ఒకటన్నారు. ప్రపంచ సంఘర్షణల సమయంలో భారతదేశం ఒక ఆశాకిరణంగా నిలుస్తోందన్నారు. భారతదేశం అధిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం ᳚ ప్రత్యేక కలయికను కలిగి ఉందని ప్రధాని మోడీ గుర్తుచేశారు. ప్రపంచం మొత్తం ప్రపంచ దక్షిణాది గురించి మాట్లాడుతుందని, భారత్ ప్రపంచ దక్షిణాదికి స్వరంగా మారిందన్నారు. గతంలో భారత్‌తో ఒప్పందాలు చేసుకోవడానికి ఏ దేశం సిద్ధంగా లేదని, కానీ ఇవాళ యూరప్, అమెరికా ఒప్పందాలు చేసుకున్నాయని గుర్తుచేశారు. తనమాటల్ని నమ్మకపోతే గతంలో ఎర్రకోట వద్ద ప్రధానులు చేసిన ప్రసంగాలను పరిశీలించాలన్నారు. వారికి ఎటు వంటి ఆలోచన, దార్శనికత, ప్రణాళిక లేదనేదనేది అర్థమ వుతోందనంటూ ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. వారి చెత్తను శుభ్రం చేయడమే తన పని అని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. మోడీ తేరీ కబ్రా ఖుదేయి (మోదీ కోసం సమాధి తవ్వండి)" అని పదే పదే చేస్తున్న ప్రయత్నాలు చివరికి విఫలమవుతాయని ప్రకటించారు. 25 సం వత్సరాలుగా వారు ఈ 'కబ్రాఖుదేయి'

>>2

## నిందితులను రోడ్డుపై ప్రదర్శనగా తీసుకెళ్తారా?

పోలీసు చర్యలపై హైకోర్టు ఆగ్రహం

**విజయవాడ,ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** నిందితుడిని మీకు మీరుగా ముందస్తుగానే నేరస్తుడిగా నిర్ధారిస్తారా ?వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు రోడ్డుపై ప్రదర్శనీ నిర్వహించడం, సరైన విధానం అనుకుంటున్నారా అంటూ ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టడంపైన ఏపీ పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అభియోగాల దశలో నిందితులను పోలీసులు రోడ్డుపై నడిపించడం, పత్రికలు, టివిల వద్ద ప్రవేశపెట్టడం ఏమిటని ప్రశ్నించింది. నేరం నిరూపణ అయ్యేంత వరకు నిందితులు

>>2



గురువారం చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమంలో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

## రాయలసీమ ఎత్తిపోతలకు 'చంద్ర గ్రహణం'!

పనులు నిలుపుదలపై భగ్గుమన్న వైకాపా నేతలు

తెలంగాణ సిఎంతో చంద్రబాబు చీకటి ఒప్పందం: సజ్జల

**జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** కృష్ణాజలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షిస్తూ..తడారిన గొంతులు తడిపేందుకు..తెలుగు గంగ, గాలేరు నగరి, శ్రీశైలం కుడి గట్టు కాల్వ కింద లక్షలాది ఎకరాల్లో పంటలను రక్షించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వ హాయంలో చేపట్టిన రాయల సీమ ఎత్తిపోతలకు చంద్ర గ్రహణం పట్టుకుందని వైకాపా నేతలు ఆరోపించారు. గురువారం చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమంలో భాగంగా పోతులపాడు సమీపంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో వైకాపా శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సభకు వైకాపా రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితర వైకాపా ముఖ్యనేతలు హాజరైయ్యారు. రాయల సీమ ఎత్తిపోతల పథకం పనులను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడంపై వైకాపా నేతలు భగ్గుమన్నారు. ఈ సందర్భంగా

>>2

# ఎఐ ఆధారిత పోలీస్ ప్రాజెక్టు

చిత్తూరు, గుంటూరు, అన్నమయ్య జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు

ఆరు నెలల్లో ఏఐ టూల్స్ అన్ని జిల్లాల్లో అందుబాటులోకి: డిజిపి హరీష్ గుప్తా

**విజయవాడ,ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో సరికొత్త శకానికి నాంది పలుకుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో సాం కేతికతను మరో మెట్టు ఎక్కించారు. నేర విచారణను వేగవంతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఎఐ14ఎపి పోలీస్ట్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు ఏపీ డీజీపీ కార్యాలయం విడుదల చేసిన సమాచార పత్రంలో వెల్లడి చేసింది..ఏపీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించారు. తొలి దశలో భాగంగా చిత్తూరు, గుంటూరు, అన్నమయ్య జిల్లాల్లో దీనిని అమలులోకి వస్తుంది. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, సంప్రదాయ పోలీసింగ్ విధానంలో విప్లవాత్మక

>>2




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్రాజెక్టును ప్రారంభించిన డిజిపి హరీష్ కుమార్ గుప్తా

# ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థిని అనుమానాస్పద మృతి

విచారణకు ఆదేశించిన మంత్రి సత్యకుమార్

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అనస్తీషియా విభాగంలో పీజీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని దీపిక మృతి చెందినట్లు సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిం

>>2



గురువారం చలోపోతిరెడ్డిపాడు కార్యక్రమానికి హాజరైన వైకాపా నేతలు

# రాయలసీమ ఎత్తిపోతలకు 'చంద్ర గ్రహణం'!

>> వైకాపా నేతలు మాట్లాడుతూ జగన్ హయంలో ఈ పనులను రూ.3,707ల వ్యయంతో కాంట్రాక్టు అప్పగించి వేగవంతం చేయించారన్నారు. సీమ ఎత్తిపోతల పథకం పూర్తైయితే జగన్‌కు ఎక్కడ మంచి పేరొస్తుందననే అక్కసుతో..ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందంటూ మహబూబ నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్‌తో ఎన్ జిటీలో అప్పట్లో రిటపిటీషన్ దాఖలు చేయించారని ఆరోపించారు. దీనిపై విచారించిన ఎన్జీటి, పర్యావరణ అనుమతి తీసుకుని పనులు చేపట్టాలని 2020 అక్టోబర్ 29న ఆదేశించిందన్నారు. సిఎం చంద్రబాబు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో చీకటి ఒప్పందం కుదుర్చుకుని లిఫ్టు పనులను నిలుపుదల చేశారని ఆరోపించారు. సీమ ఎత్తిపోతల పనులను నిలిపి వేయించా.. కావాలంటే తనికీ చేసుకోవచ్చంటూ తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. తెలంగాణ సిఎం రాజకీయ ప్రయోజనాల కోసం రాయలసీమ ఎత్తిపోతల పనులను చంద్రబాబు ఆపేసి..కృష్ణా జలాలపై రాష్ట్రలను మళ్లీ తాకట్టు పెట్టారని వారు మండిపడ్డారు. ఈ చీకటి ఒప్పందం కుదరడం వల్లే పర్యావరణ అనుమతిపై కేంద్ర అటవీ,పర్యావరణ శాఖ నిర్వహించిన సమావేశాల్లో ఈఏసి సభ్య కార్యదర్శి అడిగిన వివరాలను బాబు సర్కార్ కావాలనే ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు వ్యాఖ్యానించడం విడ్డూరంగా వుందన్నారు. గ్రేటర్ రాయలసీమ కోసం ఎత్తిపోతల పథకం సాధించే వరకు వైయస్ఆర్‌సిపి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌ఖాన్, మాజీ ఎంపిలు పోచా బ్రహ్మానందరెడ్డి, గోరంట్ల మాదవ్, బుట్టారేణుక, అనంత వెంకట రామిరెడ్డి, మాజీ శాసన సభ్యులు డిఎల్ రవీంద్రారెడ్డి, కాటసాని రామిరెడ్డి, కంగటి శ్రీదేవి, కేతిరెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అమర నాథరెడ్డి, బద్వేల్ ఎంఎల్ఎ డాక్టర్ పద్మ, ఎంఎల్సి ఇసాక్ బాష,రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థరెడ్డి, జల్సా రవిచంద్రారెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ ధార సుధీర్, వైకాపా నాయకులు గంగుల ప్రబాకరరెడ్డి, శిల్పా రవి చంద్రారెడ్డి, బుడ్డాశేషిరెడ్డి, జూపాడుబంగ్లా మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు

>> వేర్వేరు సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా ఏపీలోని కార్మికులు దేశ విదేశాల్లోని ఉపాధి అవకాశాలను దక్కించుకుని అధికఆదాయాన్ని ఆర్జించేలా చూడాలని సూచించారు. జిల్లాల వారీగా, రంగాల వారీగా కార్మికుల డేటా బేస్ ను రూపొం దించాలని వారిలో నైపుణ్యాల స్థాయిని అంచనా వేయాలని ముఖ్యమంత్రి కార్మిక శాఖకు నిర్దేశించారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటా బేస్ ను అనుసంధానించటంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఆదాయాలు గణనీయంగా పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. సిమ్యులేషన్ ల్యాబ్స్ సహా ఆధునిక శిక్షణ నైపుణ్యాల ద్వారా ఉత్పాదకత పెంచే అంశంపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. వివిధ రంగాలకు అవసరమైన ఆధునిక పనిముట్లను కూడా కార్మికులకు అందిం చేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఏపీలో ఉన్న కార్మికుల్లో సాంకేతిక పరమైన నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 20లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో స్కిల్డ్ లేబర్ ను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న వివిధ భారీ పరిశ్రమ లకు అవసరమైన నైపుణ్యాలు కూడా మన యువతకు అవసరమని ఆయన అన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను మైక్రో ఎంట్రప్రెన్యూర్లగానూ ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తో పాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్సలు ఆపై ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలని స్పష్టం చేశారు. గతంలో కార్మికుల సంక్షేమం కోసం కన్‌స్ట్రక్షన్ వర్కర్ వెల్ఫేర్ ఫండ్‌ను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కార్మికుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆ శాఖ కార్యదర్శి ఎం.వి. శేషగిరి బాబు ఇతర ఉన్నతా ధికారులు హాజరయ్యారు.

# విద్యార్థిని అనుమానాస్పద మృతి

>> చారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు ఆ విద్యార్థిని విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఆకలిగా ఉందంటూ తోటి విద్యార్థినితో ఆమె ఆహారం తెప్పించుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఒంట్లో కాస్త ఇబ్బందిగా ఉందని చెప్పడంతో మరో వైద్య విద్యార్థిని ఇంజక్షన్ చేశారు.రాత్రి రమారమీ 12గంటల సమయంలో ఆపరేషన్ గదిలో బల్లపై పడిపోయిన స్థితిలో ఆమె ఉన్నారు. ఆమె వైద్యులు పరీక్షలు నిర్వహించారు.అయితే అనంతరం ఆమె మృతిచెందినట్లు గుర్తించారు. దీపిక అనుమానాస్పద మృతిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించారు. కడుపులో ఇబ్బందిగా ఉందని, ఇంజక్షన్ చేయాలని జూనియర్ పీజీని దీపిక కోరింది. వైద్య విద్యార్థిని దీపిక మృతిపై కమిటీ వేశాం. వేధింపులు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. జూనియర్ పీజీ స్టేట్‌మెంట్ రికార్డు చేశాం. కలెక్టర్ ను నివేదిక అడిగారు. విచారణ తర్వాత సమర్పిస్తాం. దీపిక మృతిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం తర్వాత దీపికపై మృతిపై స్పష్టత వస్తుందని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. ఈ ఘటనపై వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రితో మంత్రి మాట్లాడారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. దీపిక మృతికి గల కారణాలు తెలుసుకోవాలని సీపీ రాజశేఖర్ బాబును మంత్రి ఆదేశించారు.

## వైకాపా తప్పించుకోలేదు

>> నేతలు మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు దేవుడంటే కూడా లెక్కచేయలేదని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘోరమైన నేరం చేసి మాహా పాపానికి ఒడికట్టి ఎదురుదాడి చేస్తున్నారన్న సీఎం, విషయాన్ని ఇంతటితో వదలమని స్పష్టం చేశారు. బ్రిటీష్ వాళ్లు సైతం వేంకటేశ్వరస్వామి జోలికి రాలేదని అన్నారు. వైఎస్సార్సీపీ వాళ్లు దేవుడితోనే పెట్టుకున్నారని మండిపడ్డారు. 2022లోనే కల్తీ నిర్ధారణ అయినా ఎందుకు నివేదికను తొక్కిపెట్టారని నిలదీశారు. వెంకన్న స్వామి లడ్డూ మాదిరిగా తయారు చేయాలని చూస్తే ఎక్కడా సాధ్యం కాలేదని, అంతటి పవిత్రత ఉన్న తిరుమల లడ్డూ తినాలంటేనే భయపడే పరిస్థితి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. తాను ముఖ్యమంత్రి కాగానే తిరుమల మొదలు పెట్టినట్లు తెలిపారు. పొరపాటు జరుగుతోందని నమూనాలను పరీక్షలకు పంపినట్లు స్పష్టం చేశారు. ఎన్‌డీడీబీ నివేదికలోని అంశాన్నే తాను ప్రస్తావించినట్లు వెల్లడించారు.ఇంతవరకు చరిత్రలో వెంకన్నస్వామి జోలికి ఎవరూ రాలేదన్న సీఎం, బ్రిటీష్ వాళ్లు కూడా వెంకన్నస్వామి జోలికి రాలేదని ఇంకా అభివృద్ధి చేశారని తెలిపారు. తప్పు చేసి దాని నుంచి ప్రజలను దృష్టి మరల్చేందుకు మాపైనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని సీబీఐ మాకు ఒక నివేదిక పంపిందని, దోషులను అన్నివిధాలుగా శిక్షిస్తామన్నారు. ఏకసభ్య కమిషన్ వేసి అన్ని పరిశీలిస్తామని, అవసరమైతే కోర్టులో కూడా అదనపు సమాచారం చేరుస్తామని స్పష్టం చేశారు. దౌర్జన్యం, రౌడీయిజం చేస్తే మీ ఆటలు సాగవని హెచ్చరించారు. అన్ని ఆధారాలు ప్రజల ముందు ఉంచుతామని చంద్రబాబు అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ తప్పును ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు.

## సాగునీటి సంఘాలకు జీఎస్టీ మినహాయింపు

**విజయవాడ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతీ ఎకరాకు సాగు నీరు అందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సాగు నీటి సంఘాలు చేసే పనులకు జీఎస్టీ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న ఏపీని సమర్థ పాలన, నిర్దిష్ట ప్రణాళికలతో రైతు సానుకూల రాష్ట్రంగా మార్చామని స్పష్టం చేశారు. గురువారం అమరావతిలోని నేలపాడు వద్ద ఉన్న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన నీరుప్రగతి, జల హారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ముందుగా సమావేశ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ 'మన జీవన విధానంలో నీరు చాలా ముఖ్యం. రాయలసీమలో ఊట కాల్వలు ఉండేవి. వాటిలో నీరు సమృద్ధిగా ఉండటంతో పంటలు పండేవి. కాలక్రమంలో నీటిపై నిరక్ష ్యంతో సమస్యలు వచ్చాయి. సీమ ఎడారిగా మారుతుందని చాలామంది అనేవారు. సీమను రతనాల సీమ చేయాలని ఎన్టీఆర్ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారంచుట్టారు. హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులు రావడానికి నాడు తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణమన్నారు.ఒక్క ఏడాదిలోనే 10 లక్షల ఇంకుడు గుంతలు తవ్వాం. మైక్రో ఇరిగేషన్ కింద 90 శాతం సబ్సిడీ ఇచ్చి పండ్ల తోటలకు శ్రీకారం చుట్టాం. రాయలసీమను రతనాల సీమగా చేసే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వానిది.

**క్షేత్రస్థాయిలో సాగునీటి సంఘాల పనితీరు బాగుంది**

"ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చేలా తాగు నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాలి. సమర్థ నీటి వినియోగంలో రైతుల భాగస్వామ్యం కీలకం. ఈ ఉద్దేశంతోనే 1997లో దేశంలోనే మొదటిసారిగా సాగు నీటి సంఘాలు ఏర్పాటు చేశాం. ఈ వ్యవస్థ ద్వారా 14 లక్షల నీటి సంరక్షణ కట్టడాలు నిర్మించాం. ఎంతో ప్రాధాన్యత కలిగిన సాగునీటి సంఘాలు గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత పాలకులు సాగునీటి సంఘాలు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వంలో వారి బిల్లులన్నీ క్లియర్ చేశాం. 2024 డిసెంబర్లో 6,047 నీటి వినియోగదారుల సంఘాలకు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 58 ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాం. నీటి సంఘాల అధ్యక్షులు పనులు సమర్థవంతంగా చేస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు 60 వేల మంది ఉన్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులంతా ఓ సైన్యం తలుచుకుంటే రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగలరు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.344 కోట్లతో 7,197 ఆపరేషన్ అండ్ మేనేజ్మెంట్ పనులు రైతు సంఘాల ద్వారా చేపట్టాం. సాగు నీటి నిర్వహణ పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించే పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. కాలువల నిర్వహణ, నీటి పన్నుల వసూలు, వివాదాల పరిష్కారంలో నీటి వినియోగదారుల సంఘాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇస్తాం. సమర్థ నీటి నిర్వహణతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది నారు మళ్లకు మే 15 నాటికే నీరు అందిస్తాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. నీటి వినియోగదారుల సంఘాల సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కె.అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఎమ్మిగనూరులో నేడు సిఎం చంద్రబాబు పర్యటన

**విజయవాడ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు. కలుగట్లలో జరిగే మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా నిర్వహించే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం క్యాంప్ ఆఫీస్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు కలుగట్ల చేరుకుంటారు. గ్రామసభలో పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడతారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో పర్యటించి మధ్యాహ్నం 2 గంటలకు రైతులతో ముఖాముఖి చర్చిస్తారు. చివరిగా కలుగట్లలో జరిగే పార్టీ క్యాడర్ మీటింగ్‌కు హాజరవుతారు. సాయంత్రం 5.30 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రాష్ట్రంలో మొత్తం 279 గ్రామాల్లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం 1,16,870 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 91,038 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ ప్రింట్ కూడా పూర్తయ్యింది. కర్నూలు జిల్లాలోని 13 గ్రామాల్లో 8,347 మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించనుంది. అయితే, కలుగట్ల గ్రామంలో 1,178 మంది రైతులకు శుక్రవారం కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.



## కేన్సర్‌తో పోరాడుతూ వాహిని మృతి

### సినిమాలతోపాటు పలు సీరియల్స్‌లోనూ నటించిన వాహిని

**విజయనగరం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** సినీ నటి వాహిని కన్నుమూశారు. కొంతకాలంగా కేన్సర్ మహమ్మారితో పోరాడుతున్న ఆమె తన స్వస్థలం విజయనగరంలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని సినీ నటి కరాటే కళ్యాణి వెల్లడించారు. వాహిని మృతి పట్ల సహ నటీనటులు, సినీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 48యేళ్ళ వాహిని విజయనగరంలో జన్మించారు. తెలుగుతోపాటు పలు తమిళ చిత్రాల్లో కూడా ఆమె నటించారు. సహాయ నటిగా మంచి గుర్తింపుపొందారు. సినిమాలతో పాటు బుల్లి తెరపై ఆమె సందడి చేశారు. అనేక ప్రేక్షకాదరణ పొందిన సీరియల్స్ లో ఆమె నటించారు. సీరియల్స్‌లో ఎంతో క్రేజ్ తెచ్చుకున్నారు.

### వారం - వర్జ్యం

06-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
పంచమి రా.1.22
హస్త రా.12.27
వర్జ్యం : ఉ.9.08-10.52
దు.ఉ.8.56-9.42, 2) మ.12.45-1.31
శుభసమయం:ఉ.7.30-8.30,సా.6.15-6.45
రాహుకాలం - ఉ.10.30-12.00

## బిసి జనగణన, వర్గీకరణపై వివరణ ఇవ్వండి

>> శంకరరావు వేసిన పిల్‌పై విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.బిసి జనగణన, బిసి వర్గీకరణకు సంబంధించిన అంశాలపై స్పష్టత లేకుండా ప్రభుత్వం స్థానిక సంస్థలు ఎన్నికల ఎలా జరుపుతారని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోర్టు ఎదుట తమ వా దన విన్పించారు.ఈ అంశంపై ప్రభుత్వం స్పష్ట తను ఇవ్వాలని కోరారు,ఈ అంశాన్ని ఉటంకిస్తూ బిసి జనగణన, బిసి వర్గీకరణ లేకుండా ఎన్నికలు నిర్వహిస్తారని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వాన్ని వివరణ కోరింది.

## ఎఐ ఆధారిత పోలీస్ ప్రాజెక్టు

>>మార్పులు తీసుకురావడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అధునాతన ఎఐ టెక్నాలజీతో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి, డిజిటల్ పోలీసింగ్‌లో కొత్త ప్రమాణాలను నెలకొల్పనున్నట్లు వివరించారు. ఎఐ14ఎపి పోలీస్ట్ అనేది ఒక సమగ్రమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిష్కారమని, దీని ద్వారా విచారణ సమయం తగ్గడమే కాకుండా, దర్యాప్తు నాణ్యత పెరిగి శిక్షల రేటు మెరుగుపడుతుందని, పౌరుల సంతృప్తి స్థాయి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది జూన్ 2025లో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏఐ14 ఆంధ్ర పోలీస్ హ్యాకథాన్ ఈ ప్రాజెక్టుకు పునాది వేసింది. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ఆవిష్కర్తలు, టెక్ నిపుణులు పాల్గొన్న ఈ హ్యాకథాన్‌లో వచ్చిన ఆలోచనల ఆధారంగానే ఈ ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్ట్ అభివృద్ధి, నాలెడ్జ్ బదిలీ కోసం అమెరికాకు చెందిన జెనరేటివ్ 4సైట్ ఎఐ సీఈఓ సూర్య కొత్త ను నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా నియమించారు. టెక్నాలజీ భాగస్వామిగా స్పారిట్టీ సంస్థతో పోలీసు శాఖ అవగాహన ఒప్పందం (ఎంవోయు) కుదుర్చుకుంది. హ్యాకథాన్‌లో గెలుపొందిన బృందాల సహకారంతో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ఈ ఏఐ టూల్స్‌ను వినియోగానికి సిద్ధం చేసారు.ఈ ప్రాజెక్టులో భాగంగా 8 ప్రత్యేకమైన ఏఐ టూల్స్‌ను పోలీసింగ్ వ్యవస్థలో ఏకీకృతం చేశారు. వీటిలో ప్రతి ఒక్కటీ శాంతిభద్రతల నిర్వహణ, పౌర సేవల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఎఐ ఫౌండేషన అన్ని ఎఐటూల్స్‌ను ఒకే గొడుగు కిందకు తెచ్చే సాంకేతిక వేదికగా ఉంటుంది.

## నిందితులను రోడ్డుపై ప్రదర్శనగా తీసుకెళ్తారా?

>> నేరస్తులు కారన్న విషయం తెలియదా? అని నిలదీసింది. పోలీసులు చట్టాన్ని అమలు చేస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టింది. సామాన్యుల పట్ల అమానవీయంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించింది. నిందితులతో పరేడ్ చేయించడంపై రాష్ట్ర ప్రభుత్వం, డిజిపి, గుంటూరు, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల ఎస్‌పిలకు నోటీసులిచ్చింది. నిందితులతో పోలీసులు పరేడ్ నిర్వహించడాన్ని తప్పుపడుతూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్మెంటల్ రైట్స్ కృష్ణా జిల్లా అధ్యక్షులు పరసా సురేష్ కుమార్ వేసిన పిల్‌పై తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

# వారి తప్పుల్ని సవరిస్తున్నా

>>నినాదంతో తనను ప్రతిరోజూ అవమానించారని, అయినప్పటికీ తాను స్థిరంగా ఉన్నానని, ఆర్టికల్ 370 రద్దు, ఈశాన్యంలో ఉగ్రవాదాన్ని అంతం చేయడం, పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ దాడులు, నక్సల్స్‌పై బలమైన చర్యలు, పాకిస్తాన్‌తో కాలం చెల్లిన నదుల భాగస్వామ్య నిబంధనలను రద్దు చేయడం వంటి ప్రధాన నిర్ణయాల ద్వారా నడిపించబడ్డానని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంపై ప్రసంగించే ప్రతిపక్షాల హక్కును ఆయన తిరస్కరించారు, అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న ఆదివాసీ మహిళను అవమానించారని ఆరోపించారు, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రస్తావిస్తూ. భూపేన్ హజారికకు "భారతరత్న" పట్ల అసంతృప్తిని అసోంకు అవమానంగా, సిక్కుల పట్ల ద్వేషాన్ని పెంచుతుందని పేర్కొంటూ, ఈశాన్య ప్రాంతాలను కాంగ్రెస్ అవమానించిందని ప్రధాని మోడీ ఆరోపించారు. ప్రతిపక్షాలు కపటత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని, తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నారని ఆరోపిస్తూ "మొహబ్బత్ కీ దుకాన్" (ప్రేమ దుకాణాలు) అనే నినాదాన్ని ఎత్తి చూపుతూ ప్రధాని మోడీ ఆరోపించారు. ప్రస్తుతం భారత్ సంస్కరణల దిశగా పయనిస్తోందని, మన దేశంతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ప్రపంచం ఆసక్తిగా ఉందని తెలిపారు. అమెరికా వాణిజ్య ఒప్పందం తర్వాత, ప్రపంచం స్థిరత్వంతో పాటు మన వేగాన్ని కూడా గుర్తిస్తుందన్నారు. ఈ ఒప్పందం యువతకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ప్రపంచ మార్కెట్ వారి కోసం తెరిచామన్నారు. భారతదేశం అనేక దేశాలతో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేస్తోందని, అది యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందం అయినా లేదా ఇటీవల అమెరికాతో జరిగిన ఒప్పందం అయినా, మొత్తం ప్రపం చం ఈ వాణిజ్య ఒప్పందాలను బహిరంగంగా ప్రశంసిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారం అన్నారు.

**సిక్కుల పట్ల కాంగ్రెస్ అగ్రనేతకు ఎందుకంత ద్వేషం**

సిక్కుల పట్ల కాంగ్రెస్ అగ్రనేతకు (రాహుల్ గాంధీకి) ఎంత ద్వేషం ఉందో ఆయన మాటల్లోనే కనిపించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఎంతోమంది వీడారని, కానీ ఆ పార్టీ ముఖ్య నేత మాత్రం రవ్‌నీత్ బిట్టును పార్లమెంట్ ఆవరణలో అవమానించారని మండిపడ్డారు.సిక్కుల పట్ల ఆయనకు ఉన్న ద్వేషం ఈ మాటల్లో కనిపించిందని వ్యాఖ్యానించారు. ఇదేనా మీరు తెరిచిన మొహబ్బత్ కీ దుకాణం అని ప్రశ్నించారు. ఇదే చోట ఓ ఎంపీని కాంగ్రెస్ అగ్రనేత ద్రోహి అనడం దారుణమని అన్నారు. అతనికి గర్వం తలకెక్కిందని అన్నారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానానికి సవరణలను ప్రతిపాదించగా, తిరస్కరించారు. ఈ సవరణలను ప్రతిపాదించిన చాలా మంది సభ్యులు ఓటింగ్ సమయంలో సభలో లేరు. ప్రధాన ధన్యవాద తీర్మానాన్ని ఓటింగ్‌కు ఉంచి, మూజువాణి ఓటు ద్వారా ఆమోదించడంతో చర్చను అధికారికంగా ముగించారు.

## నేడు జోగి రమేశ్‌కు జగన్ పరామర్శ

**విజయవాడ.ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ఇంటికి మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ పోలీసులు జగన్ కు షాక్ ఇచ్చారు. ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ ఇంటికి వెళ్లడంపై ఆంక్షలు విధించారు విజయవాడ పోలీస్ కమిషనర్. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఉదయం వేళలో.. విజయవాడలో భారీ ట్రాఫిక్ ఉంటుంది.ఈ నేపథ్యంలో దుర్గమ్మ వారిధి మీదుగా కాకుండా వెస్ట్ బైపాస్ మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్లాలని వైఎస్ జగన్‌కు కమిషనర్ కార్యాలయం నోటీసుల్లో స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. మరోవైపు కొందరు జోగి ఇంటిపై దాడి చేశారు. ఈ నేపథ్యంలోనే పరామర్శించేందుకు జోగి ఇంటికి జగన్ వెళ్తున్నారు.

## డబ్ల్యూపిఎల్ చాంపియన్స్‌గా ఆర్సీబి

### 6 వికెట్ల తేడాతో విజయం

### పోరాడి ఓడిన ఢిల్లీ కేపిటల్స్

### కదంతొక్కిన మంధాన

**వడోదర, ఫిబ్రవరి 5:** ఉమెన్స్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ విజేతగా మరోమారు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు నిలిచింది. గురువారం వడోదర వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రత్యర్థి ఢిల్లీ కేపిటల్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించి, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు డబ్ల్యూపిఎల్ శిఖరాన్ని అధిరోహించింది, కప్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంలో స్మృతి మంధాన కీలక ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది. బెంగళూరు జట్టు 2024లోనూ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఇక మ్యాచ్ విషయానికొస్తే, టాస్ గెలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, ఢిల్లీ కేపిటల్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు లిజెల్లె లీ (37), షఫాలీ వర్మ (20) రాణించారు. వన్‌డౌన్‌లో వచ్చిన లారా వోల్వార్డ్ 25 బంతులెదుర్కొని 2 సిక్స్‌లు, 3 ఫోర్లతో 44 పరుగులతో దూకుడుగా ఆడింది. కెప్టెన్ రోడ్రిగ్యూస్(57) 37 బంతుల్లో ఫోర్లతో అర్ధసెంచరీతో కదం తొక్కింది. ఆఖరిలో చినెల్లీ హెన్రీ 15 బంతుల్లో 2 సిక్స్‌లు, 4 ఫోర్లతో 35 పరుగులతో రెచ్చిపోవడంతో ఢిల్లీ కేపిటల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బౌలర్లలో సయాలీ సత్ఘరే, అరుంధతి రెడ్డి, నదినె డి క్లెర్క్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అనంతరం 204 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు ఆరంభంలోనే చతికిలపడింది. ఓపెనర్ గ్రేస్ హారీస్ (9) పరుగులకే పెవిలియన్ చేరగా, మరో ఓపెనర్ స్మృతి మంధాన రెచ్చిపోయి ఆడారు. వీలు చిక్కినప్పుడల్లా బౌం డరీలు బాదుతూ ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించింది. మంధానకు జార్జియా వోల్ జత కలిసి జట్టు స్కోరు బోర్డును పరుగులెత్తించారు. జార్జియా వోల్ 54 బంతులెదుర్కొని 14 బౌండరీలతో 79 పరుగులు చేసి మిన్ను మణి బౌలింగ్‌లో బంతిని బౌండరీకి తరలించే యత్నంలో షఫాలీ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత స్మృతి మంధాన (87) హెన్రీ బౌలింగ్‌లో పెవిలియన్ చేరింది. దీంతో ఆర్సీబి ప్రేక్షకులు ఒకింత ఆందోళనకు గుర య్యారు. మ్యాచ్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. అప్పుడే క్రీజులోకి వచ్చిన రాధా యాదవ్, తన బ్యాట్‌ను ఝులిపించి జట్టును విజయతీరాలకు చేర్చింది. ఇంకా రెండు బంతులు మిగిలి ఉండగా, ఆర్సీబి విజయం సాధించి, డబ్ల్యూపిఎల్ విజేతగా నిలిచింది.



## ఖాళీ చేయించండి: హైకోర్టు

>> విషయంలో సహజ న్యాయసూత్రాలను పాటించి, ఆక్రమణదారులకు నోటీసులిచ్చి వివిరణ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఖాళీ చేయించేందుకు తీసుకున్న చర్యల వివరాలను కోర్టు ముందు ఉంచాలంటూ విచారణను మార్చి 18కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామం శ్రీశైలం ప్రాజెక్ట్‌కు సంబంధించి జలవనరుల శాఖ పరిధిలోని భూములు ఆక్రమణలో ఉన్నాయని, పలు క్వార్టర్లను సైతం అనధికారికంగా వినియోగిస్తున్నారని పేర్కొంటూ న్యాయవాది డి.కాశీ రావు హైకోర్టులో పిల్ వేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం పనిచేసే కార్మికుల కోసం క్వార్టర్లు నిర్మించారని, దశాబ్దాలు గడుస్తున్నా వాటిని ఖాళీ చేయడం లేదన్నారు. 121 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఖాళీ చేయించడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

### వార్తాఫలం

**మేషం:** సంతానాన్ని క్రమశిక్షణలో ఉంచడానికి గాను మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.చిరకాల స్వప్నం నెరవేరే సమయం.

**వృషభం:** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**మిథునం:** శత్రువర్గం సృష్టించే సమస్యలు సైతం అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. శ్రమ అధికం.

**కర్కాటకం :** గతంలో కొనుగోలు చేసిన కమర్షియల్ భూములను అమ్మకానికి పెడతారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**సింహం:** అనుమానంగా ఉన్న వ్యవహారాలతో సందేహాలు మరింత బలపడతాయి. వృత్తిలో స్వల్ప మార్పులు.

**కన్య :** ఉద్యోగాలలో వెసలుబాటు తెచ్చుకొని ఎంతోకొంత సమయాన్ని కేటాయించి కుటుంబ సభ్యులతో గడుపుతారు.

**తుల:** కొద్దిపాటి పెట్టుబడులతో అధిక లాభాలను తెచ్చే స్వల్పకాలిక వ్యాపారాలపైన దృష్టిని సారిస్తారు. వస్త్రలాభం.

**వృశ్చికం:** మీ భావాలను ఉద్దేశాలను అర్థం చేసుకోగల ఆత్మీయ వర్గం అందుబాటులో ఉంటారు.కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడిన చికాకులు తొలుగుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు రాగలవు.పోటీ పరీక్షలలో విజయం.

**మకరం:** రాజకీయ, కళా రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ధనలాభం, ప్రయత్నాలు ఫలిస్తాయి. వస్త్రలాభం.

**కుంభం:** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. నూతన వస్త్రాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.క్రయ విక్రయాలలో లాభాలు.

**మీనం :** దూరప్రాంత యత్నాలు సానుకూలపడతాయి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## భగవంతుడితో పెట్టుకున్నవాడు సర్వనాశనం అయిపోతాడు

### - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** దేవుడి విషయంలో పరమ పాపం చేసి తాము తప్పు చేయలేదని బొంకే వాళ్ళకు భగవంతుడు ఎంత మాత్రం క్షమించడని,వాళ్ళకు ప్రజా తిరస్కారం శాశ్వతంగా ఉంటుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు.భగవంతుడుపై పగ పట్టి ఏడుకొండల్ని రెండు కొండలుగా చిత్రీకరించిన నేపథ్యం వైఎస్సార్సీపీది అని పవన్‌కల్యాణ్ ఆరోపించారు. భగవంతుడితో పెట్టుకున్నవాడు సర్వనాశనం అయిపోతాడు తప్ప బతికి ఉన్న దాఖలాలు లేవని అన్నారు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుణ్ణి క్షమాపణ కోరకుంటే మట్టి కరిసిపోతారని మండిపడ్డారు. భగవంతుడికి మోకరిల్లే వరకూ విషయాన్ని వదిలిపెట్టమని ఆయన హెచ్చరించారు. సీఎం చంద్రబాబుతో కలసి నిర్వహించిన మీడియా సమావేశంలో పవన్ ఉద్వేగంగా మాట్లాడుతూ తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై కూటమి నేతలు సమావేశమై చర్చించారు.హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నామని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరమని అన్నారు. 2022లోనే కల్తీ నిర్ధారణ అయినా ఆయోధ్యకు కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారని ఆరోపించారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో కళ్ల ముందు ఎన్నో వాస్తవాలు కనిపిస్తుంటే మాట్లాడకపోవటం సబబు కాదని హితవు పలికారు. అన్ని నివేదికలు ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధా రించాయన్నారు. ఎన్డీడీబీ జంతుకొవ్వు అవశేషాలు నిర్ధారిస్తే, తమ వద్ద అలాంటి పరీక్ష చేసే సామర్థం లేదని ఎన్డీఆర్‌ఐ చెప్పిందన్నారు. ప్రతీ మాట భక్తుల మనోభావాలు, సెంటి మెంటును దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నామని తెలిపారు. దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతో వ్యవహరిస్తూ వస్తున్నామన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుంటే అది ఇంకా పెద్ద తప్పు అవుతుందనే వాస్తవాలు బయటపెడుతున్నామని తెలిపారు.



## కల్తీ లడ్డూ వ్యవహారంలో వైఎస్సార్సీ నేతలు తమకుతాము క్లీన్ చిట్ ఇచ్చుకోవటం దుర్మార్గం

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ.ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:**కల్తీ లడ్డూ వ్యవహారంలో దేవుడినే మోసగించిన వైఎస్సార్సీపీ నేతలు తమకు తాము క్లీన్ చిట్ ఇచ్చుకోవటం దుర్మార్గమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు,డీసీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన కూటమి పక్షాల మీడియా సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ సొంత మాధ్యమాల ద్వారా నిజాలను కప్పిపెట్టి ప్రజలను మభ్యపెట్టాలని వైఎస్సార్సీపీ చూస్తుందన్నారు.ప్రజలను దోచుకున్నది కాక,దేవుడి దోచుకోవాలని చేసిన ఆరితెరిన దొంగలు వైఎస్సార్సీపీ నేతలన్నారు.తిరుమల తిరుపతిలో అన్యమతస్థుల ప్రాబల్యం పెంచి దానిని ఓటు బ్యాంకుగా మార్చుకునే కుట్రకు వైఎస్సార్సీపీ తెరలేపిందని ఆయన ఆరోపించారు. అన్యమతస్థుల ప్రాబల్యం వైఎస్సార్సీపీ పెంచే కుట్రలను రాజీలేకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని తెలిపారు. సింథటిక్ నెయ్యితో రూ. 250 కోట్లు దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అన్ని దేవాలయాల పవిత్రతను కాపాడటంతోపాటు హైందవుల మనోభావాలు దెబ్బతినకుండా ముందుకు వెళ్తామని తెలిపారు. ప్రజల విశ్వాసం కాపాడేందుకు కలసి కట్టుగా పోరాడతామన్నారు.

### తొక్కిసలాట ఘటన నివేదిక

# బుట్టదాఖలేనా?



2025 జనవరిలో ఘటన

> -విశ్రాంత జడ్జి దర్యాప్తులో వెల్లడైన లోపాల అంశాలేమిటి?

**తిరుపతి,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంతద్వార దర్శనాలకు సామాన్యభక్తులను అనుమతించడంలో నిర్ధేశిత టైమ్‌స్లాట్ టోకెన్ జారీకి ముందే 2025 జనవరిలో తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై విశ్రాంత జడ్జి దర్యాప్తు నివేదికలు బుట్టదాఖలయ్యాయా అనే ప్రశ్నల చర్చసాగుతూనే ఉంది. ఈ ఘటనలో తొలిరోజుల్లోనే టిటిడిలో కీలక అధికారులను బదలీ చేయడం, చివరకు పోలీసుయంత్రాంగంపై ఆ ప్రభావంచూపింది. గత ఏడాది జనవరి 8వతేదీ టోకెన్లు జారీకి ముందే సరైన సౌకర్యాలు కల్పించకపోవడం,భద్రత అంతంమాత్రంగానే ఉండటంతో తొక్కిసలాట జరిగిందనే ప్రధాన కారణాలను బాధితులు ఏకంగా సిఎం చంద్రబాబుకు, డిసిఎం పవన్‌కల్యాణ్‌కు, చివరకు విచారణ కమిటీ విశ్రాంత న్యాయమూర్తికి వెల్లడించారు. ఏకంగా ఆరుగురు భక్తులు విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్యస్వాతి(37), కంచర్లపాలెంకు చెందిన శాంతి(35), మద్దెలపాలెంకు చెందిన రజని(47), నరసరావుపేట రామచంద్రాపురంకు చెందిన బాబునాయుడు(51), తమిళనాడు సేలంజిల్లా మేదారిగ్రామంకు చెందిన మల్లిగ(50), పొల్లాచ్చికి చెందిన నిర్మల(45) ప్రాణాలు కోల్పోయారు. యాభైమందికిపైగా క్షతగాత్రులైన విషయం తెలిసిందే. ఆ రోజు తిరుపతిలో భక్తుల రద్దీ నియంత్రణలో టిటిడి అధికారులు, పోలీసుఅధికారుల అతివిశ్వాసంతోనే విషాద ఘటన జరిగిందనేది చివరకు తేల్చారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణకు రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తిని నియమించింది. ఆయన ఏకంగా పది పదకొండునెలలు ఈ ఘటనపై సమగ్రంగా క్షేత్రస్థాయిలో కూడా దర్యాప్తు చేశారు. చివరకు నివేదికలను ప్రభుత్వానికి అందజేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ఛాంబర్ నుండి విచారణ చేపట్టారు. వైకుంతద్వార దర్శన టోకెన్ల జారీకి ముందే చోటుచేసుకున్న తొక్కిసలాటకు కారణాలు, అక్కడ భద్రత ఏర్పాట్లుపై సంబంధిత పోలీసు,రెవెన్యూ, టిటిడి అధికారుల నుండి వివరాలు సేకరించారు.ఘటన జరిగిన బైరాగిపట్టెడ పద్మావతి ఉద్యానవనం,సత్యనారాయణపురం ప్రాంతాల్లో ప్రజలను కలసి వివరాలను రాబట్టారు. ఇదంతా ఒక నివేదిక రూపంలో సమర్పించారు. ఎక్కడికక్కడ పోలీసులు, విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా లేకపోవడంతో ఒక్కసారిగా నిరీక్షణ ప్రాంతం నుండి క్యూలైన్లలోనికి చేరుకునేందుకు తోపులాట ,చివరకు తొక్కిసలాట జరిగిందనేది నిర్ధారించారు. బైరాగిపట్టెడలో బందోబస్తు అప్పటి తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, పూర్వ టిటిడి గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి సస్పెన్షన్ వేటుపడింది. కమిటీలోని జస్టిస్ సత్యనారాయణమూర్తి పూర్వ టిటిడి ఇఒ,పూర్వ టిటిడి జెఇఒ,జిల్లా కలెక్టర్‌ను,పోలీసు అధికారులను లోతుగా విచారణ చేసి వివరాలు రికార్డు చేశారు. ఆ తరువాత ప్రత్యక్షసాక్షులు, బాధితులనుండి కూడా సమాచారం రాబట్టి నివేదికగా తయారుచేశారు. భక్తుల భద్రతలో, రద్దీని నియంత్రించడంలో టిటిడి అధికారులు, బందోబస్తు నిమిత్తం జిల్లావ్యాప్తం నుండి వచ్చిన పోలీసులు, రెవెన్యూ విభాగం విధుల్లో పూర్తిగా విఫలమైందనేది విచారణ కమిషన్‌కు అందిన సమాచారం. ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీకి ముందు తగిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించలేకపోవడమే తొక్కిసలాటకు కారణమని పలువురు బాధితులు విచారణ కమిషన్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తికి విన్నవించారు. ఈ నివేదిక ఆధారంగా గత ఏడాది ఘటనకు కొందరు సిఐలు, ఎస్‌ఐలపై చర్యలకు సిఫార్సు చేశారా?లేదా అందులోని ప్రధాన వివరాలపై ఇంతవరకు చర్యలు లేకపోవడం దేనికి సంకేతమనేది రాజకీయవర్గాల్లోనూ చర్చగా మారింది. ఇంతకీ గత ఏడాది జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో ఎవరెవరి తప్పిదమనేది ఇప్పటికీ తేలని విషయాలు. ఈ ఘటన నివేదికలు ఏమయ్యాయనేది సందిగ్ధతే.

## శ్రీశైలానికి నకిలీ నెయ్యి సరఫరా అయింది: చైర్మన్ పట్టాభిరామ్

**శ్రీశైలంప్రాజెకు,ఫిబ్రవరి05,ప్రభాతవార్త:** శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంకు 3లక్షల 25 వేల టన్నుల నకిలీ నెయ్యి సరఫరా అయిందని స్వ చ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వెల్లడించారు. గురువారంశ్రీశైలంకు చేరుకున్న ఆయన దేవస్థానం కార్యలయ భవనంలోని సమావేశ మందిరములో దేవస్థానంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై ఆదికారులతో సమీక్షించారు.అనంతరం విలేఖర్లతో మాట్లాడారు.మే 2022 నుండి ఏప్రిల్ 2023 దాదాపు 11 నెలలపాటు నకిలీ నెయ్యిని సరఫరా చేసారని ఆరోపించారు.ఈ కాలవ్యవదిలో 11 కోట్ల రూపాయల విలువైన నకిలీ నెయ్యి ఏ బోలేబాబా డైరి అయితే తిరుమల్లో పాపానికి వడిగట్టిందో అదే డైరి నుండి రాజేష్ కార్పోరేషన్ అనే సంస్థ ద్వారా శ్రీశైలదేవస్థాన ంకు కూడా నకిలీ నెయ్యి సరఫరా చేసారని తెలియడం చాల బాధ కలిగిందన్నారు.వైస్ జగన్ ముఖ్య మంత్రిగా ఉన్నటువంటి ప్రభుత్వం అనాడు హిందూ దేవాలయాలపై చేసిన దాడులు,వారు చేసిన అవినీతి,వారు చేసిన పాపాలు కోట్లాది మంది హిందువుల మనోబావాలు తీవ్రంగా గాయపరుస్తున్నాయని వ్యాక్యనించారు.ఒక మతంపట్ల వారు చేసిన దాడి రధాలు తగలబెట్టడం,విగ్రహాలను ద్వంసం చేయడం ఇటువంటి పాపాలకు వడిగట్టడం స్వామివారి ప్రసాదాలకు ఉపయేగించే పధార్ధలు కూడా ఇటువంటి పాపాలు చేస్తారా అని అన్నారు.కొంచం కూడా భయం కూడా లేకుండా అక్కడ వేంకటేశ్వరస్వామివారి సన్నిదిలో ఇక్కడేమో శివయ్య సన్నిదిలో ఈ రకమైన పాపాలు చేయడం ఇవన్ని క్షమించరాని పాపాలు స్వామివారు అగ్రహానికి గత ఎన్నికల్లో గురిఅయ్యారన్నారు.శ్రీశైలదేవస్థానంలో జరిగిన నకిలీ నెయ్యి సరఫరా గురించి ట్రస్ట్‌బోర్డు ఉన్నది కనుక వారి పరిదిలో వారు విచారణ జరుపుతారని అన్నారు.ప్రభుత్వ పరంగా చర్యలు కఠినంగా తీసుకుంటుందని చెప్పారు.ఎన్‌డిఏ ప్రభుత్వం,కూటమి ప్రభుత్వం దేశంలోని అన్ని మతాలను గౌరవిస్తూ ఎవరి మనోబావాలు కూడా ఇబ్బంది కలుగకుండా పరిపాలన చేయడం జరుగుతుందని చెప్పారు.





పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టాభిరామ్

## రాష్ట్రంలో ఎఫ్‌సిఐకి 14.35 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములు

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎఫ్‌సీఐకి 14.35 లక్షల టన్నుల సామర్థం గల గోదాములు ఉన్నట్లు కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి నిమున్‌బెన్ జయంతిభాయ్ బంభానియా తెలిపారు.ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే ఆహార ధాన్యాల నిల్వల కోసమని తెలిపారు. ఇవికాకుండా ఎఫ్‌సీఐ కేంద్ర గోదాముల కార్పొరేషన్ నుంచి 39.38 లక్షల టన్నుల సామర్థం గల గోదాములను అద్దెకు తీసుకొందని ఆయన వెల్లడించారు. లోక్‌సభలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. ఫుడ్ కార్పొరేషన్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి కాకినాడ పరిధిలో 90,132 టన్నులు, రాజమండ్రిలో 1,05,792 టన్నుల సామర్థం ఉన్న గోదాములు ఉన్నట్లు వివరించారు. కేంద్ర గోదాముల కార్పొరేషన్‌కు రాజమండ్రిలో 51,895 టన్నులు, కాకినాడలో 29,943 టన్నుల నిల్వ సామర్థం ఉన్న గోదాములు ఉన్నట్లు చెప్పారు. ఇక ఏపీలో 2,51,753 కిలోమీటర్ల మేర పొడవైన ఓఎఫ్‌సీ నిర్మాణం పూర్తి అయినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆయన లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు. రాష్ట్రంలో 2,759 గ్రామాలు 4జీ కనెక్షన్ల పరిధిలోకి వచ్చినట్లు వెల్లడించారు.

## విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం : డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

### - పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రమాదబీమా చెక్కులను అందించిన డిజిపి





పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రమాదబీమా చెక్కులను అందిస్తున్నడీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో విధుల్లో ఉండగా వివిధ ప్రమాదాల్లో మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చెక్కులను అందజేశారు. బాపట్ల ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన హెడ్ కానిస్టేబుల్ కీర్తి వెంకటరాజు (హెచ్.సీ నం. 1924) కుటుంబానికి రూ.1,11,00,000/చెక్కును బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజ్ లో భాగంగా కీర్తి వెంకటరాజు భార్య పెరుగు నన్నూరమ్మకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అందజేశారు.అదేవిధంగా రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ... ప్రమాదవశాత్తు మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్స్యూరెన్స్ (జీపీఏఐ) లో భాగంగా ప్రమాదాల్లో మరణించిన పోలీసుల కుటుంబ సభ్యులకు డీజీపీ చెక్కులను అందజేశారు. అనంతపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తూ మరణించిన పోలీస్ కానిస్టేబుల్ ఎ.సతీష్ కుమార్ (పీసీ, నం. 3168) కుటుంబానికి రూ.20.65 లక్షలు. డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వులో విధులు నిర్వరిస్తూ యాక్సిడెంటులో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఎం. నిరీక్షణ బాబు (పీసీ. నం. 2057) కుటుంబానికి రూ.20.37 లక్షలు.ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.నగేష్ (హెచ్. సీ. నం. 2838)

కుటుంబానికి రూ.20.45 లక్షలు.ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఆఫీసులో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన హోం గార్డ్ ఎస్.కె కాసిం అలా (నం.1187) కుటుంబానికి రూ.10.35 లక్షలు చెక్కులు అందజేశారు.

## తిరుమల లడ్డూ కల్తీ గత పాలకులు తెలిసి చేసిన నేరం : ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ.ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ కల్తీ గత పాలకులు తెలిసి చేసిన నేరమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు.కూటమి పక్షాల మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్, ఆయన సహచరులపై ధ్వజమెత్తారు. 2022లో వైసీపీ హయాంలోనే సీఎఫ్టీఆర్‌ఐ నివేదిక లడ్డూలో కల్తీ జరుగుతోందని నిర్ధారించినా నాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నివేదికను తొక్కి పెట్టి కల్తీని 2024 వరకూ కొనసాగించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పరీక్ష చేయించిన ఎన్డీడీబీ ల్యాబ్ లడ్డూ కల్తీపై ఎలాంటి నివేదిక ఇచ్చిందో ఆ తరహా నివేదికే సీఎఫ్టీఆర్‌ఐ సంస్థ 2022లోనే వైసీపీ ప్రభుత్వానికి ఇచ్చిందని గుర్తు చేశారు. నెయ్యి అని పిలవబడే రసాయన పదార్థం తయారు చేశారు తప్ప నెయ్యే లేదన్నది నివేదికల్లో తేలిందని వెల్లడించారు. 2019లో నెయ్యి కొనుగోలు టెండర్లలో ఉన్న నిబంధనలను వైసీపీ ప్రభుత్వం సడలించటంతోనే కల్తీకి బీజం పడిందని మంత్రి వివరించారు. పాలు లేకుండా నెయ్యి తయారు చేసే విధానానికి ఊతమిచ్చేలా నిబంధనలు మార్చేశారన్నారు.

నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న నెయ్యి టెండర్లలో పాల్గొనే సంస్థలతో ఆర్థిక లావాదేవీల చర్చలు జరిపారని అన్నారు. కోట్లాది మంది వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న వాస్తవాలు ప్రజల ముందు పెడుతున్నామని తెలిపారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ నాణ్యతపై గత ప్రభుత్వ హయాంలో అనేక ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఆర్గానిక్ నెయ్యి వల్ల లడ్డూ అలానే ఉంటుందని మభ్యపెట్టారని దుయ్యబట్టారు.

## ఓంకార జ్యోతిర్లింగేశ్వర శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**తిరుపతి,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదల్ల చెరువులోని ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలో శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుండి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. 16వతేదీ గంగ గౌరీ సమేత పరశురామ స్వామివారి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.శివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, నిత్య అన్నదానం కూడా ఏర్పాటు చేస్తున్నామని కమిటీ సభ్యులు కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర స్వామి, సింగంశెట్టి సుబ్బరామయ్య, సురేంద్ర రాజు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## 15న తిరుమలలో రుద్రుడికి విశేష అభిషేకాలు



**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లో తిరుమలక్షేత్ర పాలకుడుగా రుద్రుడు కొలువై పూజలందుకుంటున్నాడు. హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో వరాహస్వామి క్షేత్రప్రాధాన్యత సంప్రదాయం. అయితే శ్రీనివాసుడు కొలువైన చోట రుద్రుడు కూడా క్షేత్ర పాలకుడుగా వెలియడం విశేషం.తిరుమల గోగర్భం సమీపంలో రుద్రుడికి 15వతేదీ ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. దేవదేవుని ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు కాలినడకన క్షేత్రపాలక శిల వద్దకు చేరుకుని, విశేష ప్రత్యేక అభిషేకాలు జరిపిస్తారు.

## టిటిడి నూతన ఇఒ ముద్దాడ రవిచంద్ర నేడు బాధ్యతలు



**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నూతన ఇఒగా నియమితులైన ముద్దాడ రవిచంద్ర గురువారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. ఆయనకు తిరుపతిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు తదితరులు స్వాగతం పలికారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల సూచనలు స్వీకరించి టిటిడి సేవలు మెరుగుపరచడంపై ఒకింత దృష్టి సారించనున్నారు. నేటి ఉదయం ఆయన తిరుమల ఆలయంలో ఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## తెరచుకున్న బంగారు డాలర్ల అమ్మకాల కౌంటర్

### - వారం రోజులు స్థిరంగా ధరలు





**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తుల సౌలభ్యం కోసం నిర్వహిస్తున్న బంగారు,వెండి డాలర్ల విక్రయాల కౌంటర్ ఎట్టకేలకు తెరచుకుంది. ఇక్కడ మార్కెట్‌లో వాటి ధరలకు అనుగుణంగా భక్తులకు అవసరమైన డాలర్లు అమ్మకాలు చేస్తారు. ఈ మేరకు ధరల్లో తేడాతో కొద్దిరోజులు ఈ కౌంటర్‌ను టిటిడి మూసివేంది. చివరకు గురువారం ఉదయం నుండి కౌంటర్‌ను తెరచి భక్తులకు దేవుని ప్రతిమతో విక్రయించే డాలర్లు అందుబాటులో ఉంచింది. ఈనెల 10వతేదీ వరకు ఒకే ధరపై పలు రకాల డాలర్లు అమ్మకాలు భక్తులకు అందుకునే వెసలుబాటు కలిగింది. 2గ్రాముల బంగారు డాలర్ ధర 30,828 రూపాయలుగా, 5గ్రాముల బంగారు డాలర్ 74,799 రూపాయలు, 10గ్రాముల బంగారుడాలర్ ధర 1,47,852రూపాయలుగా నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నారు. అలాగే 5గ్రాముల వెండి డాలర్‌ను 1,648రూపాయలకు, 10గ్రాముల డాలర్ 3,132రూపాయలు, 50గ్రాముల వెండి డాలర్‌ను 15,002రూపాయలకు విక్రయిస్తున్నారు. ఈనెల 10వతేదీ వరకు ఇదే దరలు నిర్ణయించబడింది. శ్రీవారి భక్తులు ఎంతో పవిత్రంగా, భక్తితో కొనుగోలుచేసి ధరించడం సాంప్రదాయం. భక్తులు 50వేల రూపాయలు పైగా విలువైన డాలర్లు కొనుగోలు చేస్తే పాన్‌కార్డును తప్పనిసరిగా (జిరాక్స్ కాఫీ)సమర్పించాల్సి ఉంటుంది.

## లోటుపాట్లు లేకుండా భద్రత ఏర్పాట్లు

### కపిలేశ్వరస్వామి ఆలయం వద్ద టిటిడి, పోలీసుల పరిశీలన



**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటంతో భక్తులకు లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆలయం వద్ద భక్తులను అనుమతించే విషయం, క్యూలైన్లు, వాహన సేవల సమయంలో ఊరేగింపు, క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెలసుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్‌తో కలసి అధికారులు ఏర్పాట్లపై సూచనలు చేశారు. 8వతేదీ నుండి ప్రారంభంకానున్న బ్రహ్మోత్సవాల్లో ఆలయంలోపల భద్రతపై కూడా పరిశీలన చేసి సూచనలచ్చారు.

## ట్రయల్‌కోర్టు ఆదేశాలు కొనసాగించండి వివేకా హత్యకేసులో సిబిఐకి సుప్రీంకోర్టు ఆదేశం

**విజయవాడ,ఫిబ్రవరి,ప్రభాతవార్తప్రతినిధి:**వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తుపై ట్రయల్ కోర్టు ఆదేశాలను కొనసాగించాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. నెల రోజుల్లో పూర్తి చేయాలన్న సీబీఐ కోర్టు ఉత్తర్వును సవరించి సాధ్యమైనంత త్వరగా దర్యాప్తును పూర్తి చేయాలని స్పష్టం చేసింది. దర్యాప్తు సమయంలో ఇంకా ఎవరినైనా పిలవాల్సివస్తే దానికి ఎలాంటి అడ్డంకులు లేవని జస్టిస్ ఎంఎం సుందరేశ్ స్పష్టం చేశారు. ట్రయల్ కోర్టు ఉత్తర్వుల్లో ఆ విషయం స్పష్టంగా ఉన్నందున యథాతథంగా దర్యాప్తు కొనసాగించాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించాలా? అక్కర్లేదా? అన్నది సీబీఐ స్పష్టంగా చెప్పాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. ఈ కేసులో సీబీఐ అస్పష్టంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించింది. ఇప్పటికైనా స్పష్టంగా ఏం కావాలో చెబితే దాని ప్రకారం ముందుకెళ్తామని తెలిపింది. అదే క్రమంలో సుప్రీం కోర్టు తాజాగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం డిసెంబర్ 10న వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన కుమార్తె సునీత దాఖలు చేసిన వ్యాజ్యకాలీన దరఖాస్తుపై సుప్రీంకోర్టు 2026 జనవరి 20 విచారణ జరిపింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ఎన్ కే సింగ్ ధర్మాసనం ముందుకు సునీత దరఖాస్తు విచారణకు వచ్చింది. తన తండ్రి హత్య కేసులో విస్తృత కుట్రకోణాన్ని వెలికితీసే వరకూ సీబీఐ దర్యాప్తు జరిపేలా ఆదేశించాలని కోరినా కేవలం కిరణ్ యాదవ్, అర్జున్‌రెడ్డి అనే ఇద్దరి పాత్రపైనే దర్యాప్తునకు అనుమతిస్తూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సునీత సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో ఈ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. తాము అడగని అంశాలను సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకొని నిర్ణయం వెలువరించిందని కోర్టుకు వివరించారు. రూ.4 కోట్లు మనీట్రయల్‌పై దర్యాప్తు అసంపూర్తిగా జరిగిందని దానిపై లోతుగా పరిశీలించాలని కోరారు. సీబీఐ కూడా అదే చెప్పిందని గుర్తుచేశారు. నిందితుల కాల్ రికార్డుల్ని సేకరించడం వల్ల తదుపరి ప్రయోజనంలేదన్నారు.

## కల్తీ నెయ్యి డైవర్ట్‌కే అంబటి కుల రాజకీయాలు :జనసేననేత కిరణ్‌రాయల్

**తిరుపతి,పిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** ఆయన వైసిపి రాజకీయ అంబటి రాంబాబు కాదని త్రిబుల్ ఎక్స్ రాంబాబు అని పెట్టాలని తిరుపతి నియోజకవర్గ జనసేననేత కిరణ్‌రాయల్ ఎద్దేవాచేశారు. బూతులు మాట్లాడే ఆయన్ను సంస్కారవంతుడంటూ జగన్ కితాబునివ్వడం విడ్డూరంగా ఉందన్నాడు. అంబటి రాంబాబు త్రిబుల్ ఎక్స్ సబ్బుకు బ్రాండ్ అంబాసిడర్ గా తీసుకుంటే బాగుంటుందని సూచించారు. ఆయన పేరును త్రిబుల్ ఎక్స్ రాంబాబు గా మార్చితే జనానికి ఇంకా గుర్తుండిపోతాడని వ్యంగ్యంగా విమర్శించారు. కాపు కులానికే అంబటి మాయని మచ్చఅని,జగన్ ఆరు కిలోమీటర్ల యాత్రకు ఆరు గంటలు తీసుకోవడం కేవలం గ్రాఫిక్స్ కోసమేనని కిరణ్ ఘాటుగా విమర్శించాడు నెయ్యి కల్తీ జరిగిందని శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు స్వయంగా చెబితే దాన్ని వక్రీకరించడానికి వైసిపి నాయకులు కుయుక్తులు పన్నుతారని అన్నారు. వైసీపీడైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు భూతులు నేర్పించే యూనివర్సిటీని నెలకొల్పేందుకు వైసీపీ యోచిస్తున్నట్లు ఉందని కిరణ్ రాయల్, జనసేన నేతలు ఆకేపాటి సుభాషిణి,కిషోర్ మనోజ్,సాయి దేవ్,నవీన్,లోకేష్,సాయితో కలసి విమర్శనాస్త్రాలు సంధించారు.

వార్త

ఈర్ష్యలేకపోవడం, దానగుణం, ప్రియభాషణం, స్వచ్ఛమైన హృదయం ఇవి విజయానికి సోపానాలు.

-జీన్ ఫ్రాముజాన్

# సంక్షోభంలో యువజనం!

చేయబోయేపనిని గూర్చి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడంనైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. ఈ మూడింటిలోనూ సాఫల్యం చెందితేనే పరిపూర్ణత లభిస్తుంది. అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతాం. ఇది వ్యక్తులకైనా, సంస్థలకైనా, ప్రభుత్వాలకైనా వర్తిస్తుంది. దేశంలో కోట్లాది మంది యువతీ యువకులు నిరాశానిస్పృహల్లో మునిగితేలుతున్నారనే విషయం పెద్దలకు తెలియంది కాదు. వారిలో నూతనోత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి కార్యోన్ముఖులను చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి కూడా పెద్దలకు క్షుణ్ణంగా తెలుసు. కానీ ఆవైపు అడుగులు పడడం లేదు. రాజకీయ నాయకులు ఎప్పుడూ రాబోయే ఎన్నికల గూర్చి ఆలోచిస్తే రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్ గురించి మదనపడుతుంటారు. ఆధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతో శస్త్రసాంకేతిక రంగాలు పురోగమిస్తున్నాయి. ఆధునిక మానవుడు అపూర్వమైన మేధసంపత్తిని సంతరించుకుని శ్రద్ధాయుక్తులు, ప్రతిభాసామర్థ్యాలతో విశ్వంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలకమైందనే విషయం కూడా అందరికి తెలిసిందే. నవభారత నిర్మాణానికి ఉద్యమించి దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేయాల్సిన పవిత్ర బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందనే విషయం పాలకపెద్దలు పదేపదే సెలవిస్తుంటారు. కాగితాలపై కళావిన్యాసంతో ఈలక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని దేశంలోని పల్లెపల్లెల్లో, బస్తీల్లోనూ స్థితిగతులను చక్కదిద్ది ఆర్థికంగా, సామాజికంగా, సంస్కృతికంగా యువజనులందరిని కలిపి ఐక్యతతో కృషి చేస్తే దేశానికి ఉజ్వల భవిష్యత్ సుసాధ్యమవుతుందనే విషయం కూడా తెలియందేమీ కాదు. ఇందుకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారు. మారిన కాలానుగుణ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యంగా విద్యావిధానంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలిసినా ఆ కోణంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో తీసుకున్నా అమలుకు నోచుకోవడం లేదు. చాలా మంది విషయంలో చదివే చదువుకు, జీవనోపాధికి సంబంధం లేకుండాపోతున్నది. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎందరో వారి చదువుతో సంబంధం లేని హోంగార్డులు, చివరకు నాలుగో తరగతి ఉద్యోగానికి కూడా క్యూలు కడుతున్నారు. ఒకరిద్దరు కాదు.వేలసంఖ్యలో నియామకాలకు హాజరవుతున్నారు. అంతేకాదు ఈ ఉద్యోగాలకోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు.అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక బంగారు కొలువుగా మారిపోయింది. ఆ ఉద్యోగంలో చేరితే ఆ కుటుంబానికి ఆరోగ్య, ఆర్థిక, భద్రత లభిస్తాయనే ఆశలు పెరిగిపోయాయి. అటు కేంద్రప్రభుత్వం, ఇటు రాష్ట్రప్రభుత్వాలు ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనలు ఇస్తున్నారు. కొంతమేరకు నియామకాలు కూడా జరుగుతున్నాయి.ఆ ఉద్యోగాల కోసంగ్రామాల్లో ఉన్న యువత పట్టణాలకు చేరుకొని కోచింగ్ సెంటర్లబాట పడుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. దీనిని సొమ్ము చేసుకునేందుకు కొన్ని కోచింగ్ సెంటర్లు తమ శక్తి కొలదీ ప్రయత్నాలు చేస్తున్నాయి. పరీక్షలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ కోచింగ్ సెంటర్లకు అంతగా లక్ష్మిప్రసన్నం ఉంటుంది. మరొకపక్క ఎలాంటి అవకతవకలు లేకుండా,దళారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఈ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆయా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నా శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలున్నట్లు ఈ దళారులు ఏదో ఒక రూపంలో ఎక్కడో ఒక చోట చొచ్చుకుపోయేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇక దేశంలో ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూస్తున్న కోట్లాది మంది యువతీయువకులకు ప్రభుత్వపరంగా ఉద్యోగాలు కల్పించడం అనేది సాధ్యమయ్యే పనికాదు. అలా కోరుకోవడం కూడా ఏమాత్రం సమంజసం కాదు. పోని స్వయం ఉపాధి పథకాలైనా అవకతవకలకు, అవినీతికి దూరంగా నడుస్తున్నాయంటే అదీ లేదు. ఉత్తరమో, దక్షిణమో లేకుండా ఫైళ్లు కదలని పరిస్థితి.యువజన శక్తులే దేశాభివృద్ధికి బాటలంటూ ఉపన్యాసాలు ఇస్తూ దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు లక్షలాది కోట్లరూపాయలు యువజన సంక్షేమానికి వెచ్చించినా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. అన్నిటికంటే ముఖ్యంగా దేశప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది.చదివిన చదువుకు తగిన ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకోని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్నత చదవులు చదివిన యువకులు గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటు లేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. మరొకపక్క ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే కార్యక్రమాలు దేశంలో నిరాటంకంగా జరుగుతున్నాయి. ఇదంతా లేతమనసులపై చెరగని ముద్ర వేస్తున్నది. సమాజంపై ప్రేమ, అభిమానం ఉన్న యువతీయువకులే పగద్వేషంతో రగలిపోతున్నారు. మరికొందరు నిస్సహాయకస్థితిలో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి.యువతీయువకుల్లో ఆత్మవిశ్వాసంపెంచాలి. అందుకు ముఖ్యంగా ప్రభుత్వవైఖరిలో మార్పురావాలి.

> ఆత్మవిశ్వాసం లేకపోవడమే మన అపజయాలెన్నింటికో ప్రధాన కారణం.
>
> సి. బాబే



> ఆరోగ్యం, మంచి శరీర స్థితిని కలిగి ఉండటం బంగారాన్ని మించిన మహద్భాగ్యం.
>
> సిసిరో



## ప్రజావాక్కు



### వ్యర్థాల నిర్వహణ పెద్ద సవాల్

ప్రపంచవ్యాప్తంగా పట్టణీకరణ పెరుగుతున్నకొద్దీ వ్యర్థాల నిర్వహణ ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా వ్యర్థాలనుండి విద్యుత్ ఉత్పత్తి చేసే సాంకేతికత అందుబాటులోకివచ్చింది.పునర్వినియోగానికి వీలు కాని వ్యర్థ పదార్థాలను ఉపయోగపడే ఇంధనంగా, ప్రధానంగా వేడి లేదా విద్యుత్తుగా మార్చే ప్రక్రియనే వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి అంటారు. ఇది కేవలం చెత్తను నిర్మూలించడమే కాకుండా, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి ఒకప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుంది. ఈ విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి వివిధ పద్ధతులు ఉన్నాయి. దహన ప్రక్రియలో వ్యర్థాలను భారీ ఉష్ణోగ్రత వద్ద కాల్చి ఆవిరి ద్వారా విద్యుత్తును సృష్టిస్తారు. మరొక పద్ధతిలో తక్కువ ప్రాణవాయువుతో వ్యర్థాలను వాయువుగా మారుస్తారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రభుత్వంలో చలనం శూన్యం

రాజకీయ నాయకులకు ఓ మంచి గుణం ఉంది.ఏది అడిగినానో అనిచెప్పరు.కానీఆఅడిగినదాన్నిజన్మలో చేయరు. ఇది పెద్దచెత్త ప్రవృత్తి. గత దశాబ్దంపైగాఇ.పి.ఎస్. ఫించను దారులకు రూ.వెయ్యి రూపాయల నుంచి కనీసం 7500కు పెంచమని అర్థిస్తున్నా ప్రభుత్వం అయ్యో అలాగా తప్పక చూస్తామని అంటున్నారు. బడ్జెట్‌కు ముందుగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గారికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీగారికి మెయిల్స్, లేఖలు అనేకం పంపినా, ప్రభుత్వంలో చలనం శూన్యం. ఇంకెవరి కాళ్ళు, చేతులు పట్టుకోవాలి?

- డా.ఎన్.ఎస్.ఆర్.మూర్తి, సికింద్రాబాద్

### సమయాన్ని తగ్గించడమే లక్ష్యం

ప్రతిపాదిత హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాంతీయ అనుసంధానాన్ని గణనీయంగా మెరుగుపరచనుంది.ముఖ్యంగా హైదరాబాద్, కర్నూలు, అనంతపూర్ మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడం ద్వారా ఈ ప్రాజెక్ట్ కీలక పాత్రపోషిస్తుంది. ఈ మెరుగైన అనుసంధానం వల్ల ఉద్యోగులు, రోజువారీ ప్రయాణికులు, వ్యాపార సంస్థలు వ్యాపారవేత్తలు వంటి అనేక వర్గాలకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### అమెరికా సుంకాల ఆట.. కాసేపు ఊరట

తాజాగా భారత్ వాణిజ్యంపై వడ్డించిన 50 శాతం సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం ఊరట. ఆయన ఇంతవరకూ ప్రపంచ దేశాలకు వివిధ పేర్లతో వడ్డిస్తున్న సుంకాల కన్నా, మిత్రుడంటూ భారత్ పట్ల పెంచిన సుంకాలే అధికం.రష్యాఇంధనం కొంటున్నందుకు ప్రతీకారంగా పాతిక శాతం, ఇచ్చి పుచ్చుకున్న విధానంలో పాతిక శాతం వెరసిఏభై శాతం పన్నులు నిర్ణయించారు. ఇప్పుడు వాటిని 18 శాతంగా ప్రకటించడం హర్షణీయమే. కానీ కొన్ని సందేహాలు మిగిలి ఉన్నాయి. భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదరబోతుంది అన్నారు.మంచిదే.పనిలో పనిగా భారత్ తమ మాట విని రష్యా ఇంధనాన్ని కొనుక్కోవడం ఆపేస్తుందని చెప్పారు. అది చెప్పాల్సింది మనం కదా!అలా ఆపడం ద్వారా చిరకాల మిత్రుడిని, ప్రయోజనాన్ని, స్వతంత్ర నిర్ణయాన్ని భారత్ వదులుకో వస్తుంది.అందుకనే మన ప్రధాని ఆ మాటపై మౌనం వహించారు.భారత్ మిగతా దేశాలతో వరుసగా చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాలే ట్రంప్‌ని కదిలించి ఉంటాయి.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### పేదల బడ్జెట్ ప్రవేశ పెట్టాలి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బడ్జెట్ పేదల బడ్జెట్‌గా ఉండాలి. ముఖ్యంగా రైతు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే విద్య, ఆరోగ్య, సంక్షేమానికి పెద్ద పీట వేయాలి. బడ్జెట్ లక్షల కోట్ల రూపాయలతో రూపొందించినా కేటాయించిన నిధులను ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.అలాగే ప్రజలకు ఉపయోగపడేలా బిల్లులు ఆమోదించాలి. పేదలకు నిరాశ్రయులకు వసతి కల్పించాలి. బడ్జెట్‌తో దేశాభివృద్ధికి దోహద పడాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

### సెమికండక్టర్ ప్రాజెక్టు

బడ్జెట్ రాజకీయ ప్రయోజనాలను దూరంగా పెట్టింది అని చెప్పవచ్చు. అలాగే బలహీన రాష్ట్రాలు అనే పేరుతో ప్యాకేజీలు ఇచ్చే సంప్రదాయానికి మంగళం పాడింది. నిజానికి ఇది మంచి ఆలోచనే సుమ. బడ్జెట్4అంశాలపైన ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఎందుకంటే బీహార్ లాంటి రాష్ట్రాలు సారవంతమైన నేలను కలిగి ఉండినాకూడా ప్రణాళికలురూపొందించకుండా వెనుకబడిపోయాం.కేంద్రం ప్రస్తుతపరిస్థితులకు అనుగుణంగా సెమికండక్టర్ ప్రాజెక్ట్ 2.0 నీ ప్రకటించడం కూడా గమనించవచ్చు.

-భారత అవినాష్, జనగాం

మన వి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇంతకు అసలు 'దొంగ'లెవరు?

**ఈ కేసు వ్యవహారం అధికారులకు ఈ సంఘటన తర్వాత భారతదేశంలో దేశీయ నిఘా వ్యవస్థలు వున్నాయా? వుంటే ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి? అనే మీమాంస కలుగుతోంది. ఈకేసు విషయం వెలుగు చూసిన ప్రారంభంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీ పార్టీకి చెందిన డబ్బు అంటే మీ పార్టీకి చెందిన డబ్బు అంటూ పరస్పరం ఆరోపణలు చేసుకొన్నారు. త్వరలో తమిళనాడులో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఈ ఆరోపణలు చేసుకున్నప్పటికీ ఆ తర్వాత ఎవరికి వారు మౌనం పాటిస్తున్నారు. నిజానికి ఈ కేసుకు సంబంధించిన మూలాలు రాజకీయ పార్టీ నేతల వద్దనే వున్నాయని ప్రజలు భావిస్తున్నారు. రాజకీయ పార్టీల నేతలు ఈ అపవాదు నుంచి బయట పడాలంటే ఈ కేసుకు సంబంధించిన వివరాలను వీలున్నంత త్వరగా బహిర్గతం కావడం అవసరం. అంతేకాకుండా నిఘావ్యవస్థలకు చెందిన అధికారులు ఈ కేసుకు సంబంధించిన పూర్వపరాలను వెల్లడించి, సంబంధిత వ్యక్తులను అరెస్టు చేయడం ద్వారా తమ సమర్థతను చాటుకోవాల్సిన అవసరం వుంది.**



అన్నవరపు బ్రహ్మయ్య

ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ సాంబారు బుడ్డీ చిన్నప్పుడు ఆడే ఆట మాదిరిగా కనిపించకుండాపోయినా 400 కోట్ల రూపాయలతో కూడిన రెండు కంటైనర్ల విషయంలో ఎవరికి వారే సర్దుకున్నట్లుగా వుంది. అధికారంలో వున్న కొంతమంది నాయకులు, ఉన్నతాధికారులు వేల కోట్ల రూపాయల అవినీతి కార్యకలాపాలకు సంబంధించిన వార్తలు వినడానికి అలవాటు ప్రజలకు ఈ డబ్బుతో కూడిన కంటైనర్లు కనిపించకుండా పోవడం చిత్రవిచిత్రంగా అనిపిస్తోంది. అలవోకగా వింత వింత అంశాలతో సినిమాలు తీసే దర్శకుల క్రియేటివిటీని మించి ఈ కంటైనర్ల కథనం నడిచినట్టుగా వుంది. సహజంగా జవాబు దొరకని ప్రశ్నను బిలియన్ డాలర్ల ప్రశ్న అని అంటారు. ఈ సంఘటనకు సంబంధించి సామాన్య ప్రజలలో అనేక ప్రశ్నలు వెంటాడుతున్నాయి. అసలు ఆ కంటైనర్లలో వున్నది రూ. 400కోట్లేనా లేక లెక్కకు మించిన కోట్లు వున్నాయా? వందల కోట్ల రూపాయలతో కూడిన కంటైనర్లు కనిపించకుండా పోవడం ఏమిటి?అసలు ఎక్కడ బయలు దేరాయి? ఎక్కడకు వెళుతున్నాయి? ఈ డబ్బు ఎవరికి సంబంధించినది? వారికి ఈ డబ్బు ఎలా వచ్చింది? ఇంత పెద్దమొత్తంలో డబ్బు నిల్వ చేసే ఆయా రాష్ట్రాలలో వున్న పోలీసులు ఏం చేస్తున్నారు? డబ్బుతో కూడిన కంటైనర్లు కనిపించకుండా పోయాయంటూ రెండు వారాల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తి ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నాడా? ఆ వ్యక్తి గురించి ఇడి ఇప్పటి వరకు నోరు విప్పడం లేదు ఎందుకని? ఇంకా అనేక ప్రశ్నలు వెంటాడుతున్నాయి. ప్రజలలో తలెత్తిన ఈ ప్రశ్నల విలువ ఎంతో నిఘా అధికారులు చెప్పాల్సి వుంటుంది. సహజంగా ఇంట్లో బంగారం/డబ్బు పోయిందని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఫిర్యాదులో పేర్కొన్న మొత్తంలో సగానికి మాత్రమే కేసు నమోదు చేస్తారు. అందువల్ల కనిపించకుండా పోయినా ఆ రెండు కంటైనర్లలో వున్నవి 400 కోట్లరూపాయలేనా అని ప్రజలు అనుమానిస్తున్నారు. కనిపించకుండా పోయినా కంటైనర్లు సరుకులు చేరవేసే కంటైనర్లా లేక స్కూటర్లు కార్లు రవాణా చేసే పొడవాటి కంటైనర్లా? అనే ప్రజల అనుమానాలకు ఎవరు సమాధానం చెబుతారు. అంతేకాకుండా నిజంగా ఫిర్యాదు దారుడు చెబుతున్నట్టుగా కనిపించకుండా పోయినవి రెండు కంటైనర్లేనా లేక ఇంకా వున్నాయి అనే అనుమానం కూడా తేలాల్సి వుంది.డబ్బుతో కూడిన కంటైనర్లు కనిపించకుండా పోయిన వార్త చదివితే స్వతంత్ర భారతదేశంలో ఏదైనా సాధ్యమేనని పిస్తోంది. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే, పోలీసులు ఫిర్యాదు చేసిన వ్యక్తి తల్లిదండ్రులు, కులం మొదలుకొని అనేక వివరాలు సేకరిస్తారు. కానీ 400 కోట్ల రూపాయల వాహనాలు తప్పిపోయాయని ఫిర్యాదు చేసిన వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసు చెప్పడం లేదు.కిషోర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి సంబంధించిన డబ్బు అని, విరాట్ గాంధీ అనే హవాల వ్యాపారికి సంబంధించిన డబ్బు అనే వదంతలు వచ్చాయి. ఈ డబ్బుకు సంబంధించిన వ్యక్తి ఒకరు ఆంధ్రప్రదేశ్లోని తిరుపతి నగరంతో కూడా సంబంధం కలిగివున్నట్టు వార్తలు వచ్చాయి. ఇన్ని రకాల వార్తలు బయటకు వచ్చినప్పటికీ పోలీసులు పూర్తిస్థాయి వివరాలు తెలియక చెప్పడం లేదా తెలిసినా గోప్యత పాటిస్తున్నారా? అనేది అర్థం కావడం లేదు. అయితే ఈ కేసుకు సంబంధించి అరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేసి సాయంత్రానికి వదిలివేసినట్టు వార్తలు వచ్చాయి. నిజానికి నిందితులను అరెస్టు చేయాలి కానీ, అదుపులోకి తీసుకోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ఫిర్యాదు దారుడు మహారాష్ట్రలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఫిర్యాదు దారుని సొంత రాష్ట్రం ఏది? ఏ రాష్ట్రంలో వ్యాపారం చేస్తున్నాడు?చేస్తున్న వ్యాపారంఏమిటి? అనే విషయాలు తెలియడం లేదు. అంతేకాకుండా అవినీతికి సంబంధించి ఏ చిన్న వార్త వెలుగు చూసినా రాష్ట్రాలలో అవినీతి నిరోధక సంస్థలు (ఎసిబిలు), కేంద్రప్రభుత్వానికి చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈడి)లకు చెందిన అధికారులు చుట్టుముడతారు. కానీ మహారాష్ట్రలోని ఎసిబి అధికారులు కానీ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన అధికారులు కానీ పట్టించుకున్న దాఖలా కనిపించడం లేదు. అదేవిధంగా సిబిఐ, ఈడి అధికారులు కూడా వీరు ఇంకా రంగంలోకి దిగలేదు. డబ్బుకు సంబంధించిన ఎవరైనా బహిరంగంగా 400 కోట్ల రూపాయలను కంటైన్నర్ల ద్వారా తరలించారంటే పైన తెలిపిన అధికారుల ఇజ్జత్కా సవాల్ అని చెప్పాలి. సహజంగా ఇటువంటి వ్యవహారాలన్ని గుట్టు చప్పుడు కాకుండా జరుగుతాయి. ఒకవేళ బయట పడినా ఎవరికి వారే తేలుకుట్టిన దొంగలా వుండిపోతారు. కానీ ఇందుకు విరుద్ధంగా 400కోట్ల రూపాయలు కనిపించకుండా పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒకవేళ పోలీసులు, నిఘా అధికారులు డబ్బుతో కూడిన కంటైన్నర్లను పట్టుకొన్నప్పటికీ ఇన్ని వందల కోట్ల రూపాయాలకు లెక్క చెప్పడం అంత తేలికైన వ్యవహారం కాదు. అయినప్పటికీ డబ్బు కనిపించకుండా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయడం వెనుక కూడా ఏదోబలమైన కారణం వున్నట్టు అనిపిస్తోంది. మొత్తంగా ఈ కేసు వ్యవహారం అధికారులకు ఈ సంఘటన తర్వాత భారతదేశంలో దేశీయ నిఘా వ్యవస్థలు వున్నాయా? వుంటే ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి? అనే మీమాంస కలుగుతోంది. ఈకేసు విషయం వెలుగు చూసిన ప్రారంభంలోబిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీ పార్టీకి చెందిన డబ్బు అంటే మీ పార్టీకి చెందిన డబ్బు అంటూ పరస్పరం ఆరోపణలు చేసుకొన్నారు. త్వరలో తమిళనాడులో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఈ ఆరోపణలు చేసుకున్నప్పటికీ ఆ తర్వాత ఎవరికి వారు మౌనం పాటిస్తున్నారు. నిజానికి ఈ కేసుకు సంబంధించిన మూలాలు రాజకీయ పార్టీ నేతల వద్దనే వున్నాయని ప్రజలు భావిస్తున్నారు. రాజకీయ పార్టీల నేతలు ఈ అపవాదు నుంచి బయట పడాలంటే ఈ కేసుకు సంబంధించిన వివరాలను వీలున్నంత త్వరగా బహిర్గతం కావడం అవసరం. అంతేకాకుండా నిఘావ్యవస్థలకు చెందిన అధికారులు ఈ కేసుకు సంబంధించిన పూర్వపరాలను వెల్లడించి, సంబంధిత వ్యక్తులను అరెస్టు చేయడం ద్వారా తమ సమర్థతను చాటుకోవాల్సిన అవసరం వుంది. ●



(రచయిత : సీనియర్ జర్నలిస్ట్)

# 'ఆలోచన'కు అవరోధంగా కృత్రిమ మేధ

మద్రాపు వసుంధరా దేవి

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నేటి విద్యారంగంలో అనివార్యమైన అంశంగా మారుతోంది. సాంకేతిక సౌలభ్యాల పేరిట ఇది పాఠశాలస్థాయిలో కూడా వేగంగా ప్రవేశిస్తోంది. అయితే స్కూల్ ఎడ్యుకేషన్ అనేది కేవలం పాఠ్యపుస్తక జ్ఞానం అందించే దశకాదు. అది పిల్లల ఆలోచనాశక్తి, వ్యక్తిత్వం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నిర్మించే అత్యంత కీలకమైన దశ. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల సందర్భంలో ఎఐ నియంత్రణలేకుండా ప్రవేశిస్తే, విద్యలో సమానత్వం, నాణ్యత, లక్ష్యసాధన అన్నవే తీవ్రంగా దెబ్బతింటున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ ఎఐ ఆధారిత అభ్యసనం పిల్లల ఆలోచనా శ్రమను తగ్గిస్తూ, సిద్ధంగా ఉన్న సమాధానాలపై ఆధారపడే అలవాటును పెంచుతోంది. ఈ ప్రభావం ప్రాజెక్ట్ వర్క్స్, హోమ్ వర్క్ వంటి కీలక అభ్యాస విధానాల్లో మరింత తీవ్రంగా కనిపిస్తోంది.ప్రాజెక్ట్ వర్క్స్ విద్యార్థిలో పరిశోధనా దృష్టి, సమాచార సేకరణ నైపుణ్యం, స్వయంగా ఆలోచించి నిర్ణయించుకునేశక్తి, ప్రదర్శనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు రూపొందించబడ్డాయి.కానీ ఎఐ ఆధారిత కంటెంట్ సులభంగా లభించడం వల్ల ప్రాజెక్ట్‌వర్క్ అసలు ఉద్దేశ్యం నశిస్తోంది. పిల్లలు సమస్యను అర్థం చేసుకోవడం, పుస్తకాలు తిరగేయడం,ఉపాధ్యాయులతో చర్చించడం వంటి దశలను దాటేసి,సిద్ధంగా ఉన్న సమాచారం కాపీ చేసి సమర్పిస్తున్నారు. దీంతో ప్రాజెక్ట్ వర్క్ ఒక అభ్యాస సాధనంగా కాకుండా, మార్కుల కోసం పూర్తి చేయాల్సిన యాంత్రిక పనిగా మారుతోంది. ఇది విద్యార్థి మేధో వికాసానికి తీవ్రనష్టం కలిగిస్తోంది. భాషాభ్యసనం విషయంలో ఈ ప్రభావం మరింత ప్రమాదకరం. ప్రభుత్వ పాఠశాలల్లోచదువుతున్న అనేక మంది పిల్లలకు పాఠశాలే భాషాభ్యాసానికి ప్రధాన వేదిక. కానీ ఎఐ తయారు చేసిన వ్యాసాలు, పేరాగ్రాఫ్లు, సమాధానాలపై ఆధారపడటం వల్ల పిల్లలు స్వయంగా వాక్యాలు నిర్మించే అవకాశాన్ని కోల్పోతున్నారు. భాషావేత్త చెప్పినట్లుగా, భాష మన ఆలోచనలను నిర్మిస్తుంది. దానిని యంత్రాలకు అప్పగిస్తే ఆలోచనలే యాంత్రికమవుతాయి. స్కూల్ దశలోనే ఈపరిస్థితి ఏర్పడితే, భావవ్యక్తీకరణలో పిల్లలు జీవితాంతం బలహీనులుగా మిగిలే ప్రమాదం ఉంది. గణితం, సైన్స్ వంటి సబ్జెక్టలో ఎఐ ప్రభావం మరింత లోతుగా ఉంది. గణితం ద్వారా పెంపొందించాల్సిన తార్కిక ఆలోచన, దశలవారీ సమస్య పరిష్కార నైపుణ్యం ఎఐ నేరుగా సమాధానాలు ఇవ్వడం వల్ల క్రమంగా తగ్గిపోతోంది. ఆల్బర్ట్ ఐన్స్టీన్ అన్నట్లు, విద్య అనేది సమస్యలకు సమాధానాలు తెలుసుకోవడం కాదు, ఎలా ఆలోచించాలో నేర్చుకోవడం. సైన్స్ విషయంలో కూడా ప్రయోగాలు, పరిశీలన, ప్రశ్నించే అలవాటు స్థానంలో స్క్రీన్ ఆధారిత సమాచారం వచ్చి చేరుతోంది. సోషల్ స్టడీస్లోనూ ఇదే పరిస్థితి. చరిత్ర, సివిక్స్, భూగోళం వంటి అంశాల ద్వారా పిల్లల్లో సామాజిక చైతన్యం, పౌరబాధ్యత పెంపొందించాల్సిన అవసరం ఉంది. కానీ ఎఐ ఆధారిత సంక్షిప్త నోట్స్‌వల్ల సంఘటనలపై లోతైన విశ్లేషణ జరగడం లేదు. ఎఐ ప్రభావం విద్యార్థులకే పరిమితం కాకుండా ఉపాధ్యాయుల బోధనా నాణ్యతపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. కొంతమంది ఉపాధ్యాయులు ఎఐ తయారు చేసిన నోట్స్, ప్రశ్నాపత్రాలు, వివరణలపై అధికంగా ఆధారపడుతూ స్వయంగా అధ్యయనం చేసే అలవాటును కోల్పోతున్నారు. బోధనలో సృజనాత్మకత,చర్చ, అనుభవాధారిత విధానాల స్థానంలో రెడీమేడ్ కంటెంట్ వినియోగం పెరుగుతోంది.దీనివల్ల ఉపాధ్యాయులు క్రమంగా పేలవంగా తయారవుతూ, విద్యార్థుల ఆలోచనలను ప్రేరే పించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారు. డా.ఏ.పీ.జే. అబ్దుల్ కలాం అన్నట్లుఉత్తమ గురువు విద్యార్థిలో ప్రశ్నలను పుట్టిస్తాడు, సమాధానాలు కాదు. కానీ ఎఐ ప్రశ్నలను తగ్గించి, సమాధానాలనే ముందుంచుతోంది. హోమ్‌వర్క్ విషయంలో ఎఐ మరింత పెద్ద సమస్యగా మారింది.విద్యార్థి స్వయంగా హోమ్‌వర్క్‌చేశాడా, లేక ఎఐ ఆధారంగా తయారుచేశాడా అన్నది ఉపాధ్యాయులు స్పష్టంగా నిర్ధారించలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి బలం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతి విద్యార్థి పనిని లోతుగా పరిశీలించే అవకాశం ఉపాధ్యాయులకు ఉండడం లేదు. ఫలితంగా నిజంగా కష్టపడే విద్యార్థి,ఎఐ ఆధారంగా పనిచేసిన విద్యార్థి ఒకే స్థాయిలో నిలబడుతున్నారు. ఇది క్రమంగా నిజాయితీ విలువలను దెబ్బతీస్తోంది. ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే పరిస్థితి తల్లిదండ్రుల విద్యాస్థాయి తక్కు వగా ఉన్న కుటుంబాల్లో కనిపిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటె లిజెన్స్ విద్యకు సహాయకుడు కావాలి గానీ, ప్రభుత్వ పాఠశాలల విద్య లక్ష్యాలను దారి తప్పించే శక్తిగా మారకూడదు. ●

# భూసార పరిరక్షణతోనే సాగు ముందడుగు

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశం వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులతో పాటు వ్యవసాయం చేసే విధానాల్లోఅనేక సాంకేతిక ఉపకరణాలు రైతులకు అందుబాటులోకి వస్తూ వ్యవసాయ సాగును సులభతరం చేస్తున్నప్పటికీ,క్షేత్రస్థాయిలో రైతులు అంతర్గతంగా భూసార పరిరక్షణకు పంట మార్పిడి, సేంద్రియ విధానాలపై సరైన రీతిలో ఆసక్తిచూపలేకపోవడమో లేక వ్యవసాయంలో మోతాదుకు మించిన కృత్రిమ రసాయన ఎరువుల వాడకం లేకుంటే మార్కెట్లో నకిలీ విత్తనాల చలామణి లాంటి అంశాల వలన రైతులు ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే అనర్థాలు కంటే ఎక్కువగా నష్టపోతున్నారు అనే సంశయం కలగక మానదు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక ఉపకరణాలు వ్యవసాయం చేయడానికి సహకరిస్తున్నా భూమిలో ఉన్నటువంటి నత్రజని ఫాస్ఫరస్ పొటాషియం లాంటి పోషకాలు మొక్కల పెరుగుదలకు వినియోగం అయ్యే క్రమంలో తరచుగా భూసారం తగ్గిపోవడం సహజమే. అయితే తిరిగి మరల భూసారాన్ని పెంచుకునే విధంగా పంట మార్పిడి సాంప్రదాయ విధాన పద్ధతులతోపాటు సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారాన్ని పెంపొందించి అధిక పంట దిగుబడిని పెంచుకునే విధానమే సరైనది అనే అభిప్రాయం వ్యవసాయ రంగంలో తరచుగా వినిపిస్తుంటాయి. వ్యవసాయదారులు వాణిజ్యపరమైన నిత్యావసర ఆహార పంటలను పండించేందుకు ఆసక్తి చూపుతున్న, పంట దిగుబడి త్వరగా రావడానికి అనేక రకాల రసాయన ఎరువులను వాడుతున్నప్పటికీ తర్వాతి క్రమంలో అనేకసార్లు నష్టాల బారినపడుతుండటం శోచనీయం. ముఖ్యంగా భూమిలో ఆరోగ్యకరమైన మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్ లాంటి ప్రాథమిక పోషకాలను మొక్కలు భూమి నుండి గ్రహిస్తాయి తద్వారా పోషకాలు శాతం భూమిలో తగ్గుతూ వస్తుంటాయి కాబట్టి సహజంగా జీవ సంబంధమైన వ్యర్థాలు, వర్మీకంపోస్ట్ లాంటి వాటిని తరచుగా భూమిలో ఉపయోగిస్తుంటే భూసార పరిరక్షణ ఎప్పుడు నిలకడగా ఉండడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో దోహదపడుతుంది. పంటలకు చీడపీడ పురుగులు హానికర, తెగులు లాంటివి రాకుండా రక్షింపపడడమే కాకుండా మొక్కలు వైరస్ బ్యాక్టీరియా ఫంగస్ తెగుళ్లను తట్టుకుని నిలిచే విధంగా ఉండి రైతులకు అధిక దిగుబడి రావడానికి ఎక్కువ ఆస్కారం ఉంది. అంతేకాకుండా సేంద్రియ విధానంతో పండించిన పంటలకు మార్కెట్లో చాలా ప్రాముఖ్యత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపదకు కొదువలేనప్పటికీ, సాధ్యమైనంతగా పశువుల నుండి వచ్చే వ్యర్థాలను ఎరువులుగా వాడే విధానం సాంప్రదాయ వ్యవసాయ రంగంలో చాలావరకు తగ్గుతూ వస్తుంది. దీనికి ప్రధాన కారణం రైతులు కృత్రిమ రసాయన ఎరువులమీదనే ఆధారపడడం సర్వసాధారణంగా గోచరిస్తుంది. రసాయన ఎరువులు ఉపయోగించే విధానంలో కూడా అనుకున్న స్థాయిలో పంటలపై సరియైన రీతిలో పిచికారి చేయకపోవడం రసాయనాలు నేరుగా గాలి ద్వారా వాతావరణంలోకి చేరి పర్యావరణాన్ని



కూడా ఇబ్బందిని కలిగిస్తూ మానవ జీవన ఆరోగ్య స్థితిగతులపై ప్రభావితం చూపిస్తున్నాయి. పర్యావరణానికి నష్టం కలిగించని సహజమైన సేంద్రియ ఎరువుల విధానాన్నిపంట మార్పిడి విధానాన్ని ఎక్కువగా రైతులు అవలంబిస్తే మంచి పోషక విలువలతో కూడినటువంటి పంటలను భావితరాలకు అందించడమే కాకుండా శ్రేష్ఠమైన బలవర్ధకమైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం అధికంగా ఉంటుంది.పశువుల నుండి వచ్చే జీవ సంబంధమైన వ్యర్థాలు వృక్ష సంబంధమైన ఎరువులు భూసారాన్ని పరిరక్షించుకునేందుకు దోహదం చేస్తాయి. కాబట్టి జీవ వృక్ష సేంద్రియ ఎరువులను తరచుగా అవసరమైన మేరకు పంట పండించే భూమిలో వేయడం వల్ల భూసారం తగ్గకుండా పంటలు అధిక దిగుబడి రావడానికి మొక్కలకు ఎంతో సహాయం చేస్తూ ఉంటుంది.అంతేకాకుండా భూమిలో నిరంతరం ఒకే పంట వేయకుండా ప్రతి సంవత్సరం పంట మార్పిడి చేయడం ద్వారా భూసారం తగ్గకుండా రసాయన ఎరువులకు అధిక ప్రాధాన్యత ఇవ్వకుండానే పంట ఎదుగుదలకు దోహదం చేసి అధిక దిగుబడి రావడానికి ఆస్కారం ఉంటుంది. దేశంలో కొన్నిరాష్ట్రాల్లో తప్ప చాలావరకు రైతులుసేంద్రియ విధానాన్ని చేయడంలో ఆసక్తి చూపలేకపోతున్నారు ఏమో కానీ కొందరు రైతులు రసాయన ఎరువుల వాడకం వైపే ఎక్కువగా మొగ్గు చూపుతుండడం కొంతకాలం తర్వాత వ్యవసాయంలో పంటల దిగుబడి తగ్గిపోయి నష్టాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుత కాలంలో సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆహారఉత్పత్తులు ఆకుకూరలు, కూరగాయలు వాణిజ్య వ్యాపార పంటలు వరి, మొక్కజొన్న, పసుపు మిరప పప్పు దినుసులు,లాంటి వాణిజ్య వ్యాపార పంటలకుదేశీయ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయంగా ఎగుమతుల్లో అధికంగా గిట్టుబాటు ధర ఉంది. అంతేకాకుండా ఆధునిక జీవన విధానాల్లో ప్రజలు కూడా సేంద్రియ ఎరువుల విధానంతో పండిన పంటలపై అవగాహన పెంచుకుంటున్న దృష్ట్యా ఆరోగ్య రీత్యా కొనుగోలు విషయంలో సేంద్రియ ఎరువుల విధానం ద్వారా పండిన పంటలకు కొంతైనా ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఏదేమైనప్పటికీ వ్యవసాయ రంగంలో అనేక మార్పులు వచ్చినా భూసారం తగ్గకుండా ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత చాలా వరకు రైతులపైనే ఉంటుందనే భిన్నవాదనలు లేకపోలేదు. కొన్నిసార్లువ్యవసాయ రంగంలో తరచుగా దిగుబడి తక్కువ వస్తుండడం వీటికి ప్రధాన కారణాలు అన్వేషించి దానిని అధిగమించడానికి వ్యవసాయ సాగుకు మూలాధారమైన సేంద్రియ ఎరువుల విధానం,పంట మార్పిడి విధానాలే పరిష్కారం అనే విధానాన్ని తెలుసుకోవాల్సిన ఆవశ్యకత రైతాంగానికి ఉంది. ఈ క్రమంలో నిరంతరం పండించిన పంటవేయకుండా పంట మార్పిడి చేస్తూ వ్యవసాయం అభివృద్ధిలో వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ రైతాంగం నష్టాలను సాధ్యమైనంతగా తగ్గించుకోవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని చెబుతున్నప్పటికీ,సహజంగా భూసారంలో పోషక పదార్థాలను అభివృద్ధిపరిచే విధానాలను ఆధునిక నవీన పద్ధతులతో రూపుదిద్దుకోవాల్సిన అంశాలలో విప్లవాత్మకమైన మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనాఉంది. వ్యవసాయ రంగంలో సులభతరమైన ఆధునిక సాంకేతిక ఉపకరణాలు ఎన్నో వస్తున్నా భూసారాన్ని పరీక్షించుకునే విధానాలు సరిగాలేకపోతే వ్యవసాయ అభివృద్ధిలో రైతులకు ఆధునిక ఉపకరణాలు కావలసినంత ఉపయుక్తం ఏమాత్రం కావేమో. అదేవిధంగా రైతులు కూడా తమ వ్యవసాయ ఉత్పత్తులను సమృద్ధిగా పండించేందుకు వ్యవసాయ భూముల్లో భూసారం తగ్గకుండా పంట మార్పిడి సహజమైన సేంద్రియ ఎరువులు వాడకం విధానాన్ని రూపొందించే ప్రణాళికను సిద్ధం చేసుకుని వ్యవసాయంచేస్తూ నష్టపోకుండా ఆర్థికస్వావలంబన దిశగా ముందుకు పురోగమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ●

# లోక్‌సభలో ఎడతెగని రగడ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** లోక్‌సభలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే గురువారం కూడా సభ ముగిసింది. ఉదయం సభ ప్రారంభం కాగానే, భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చకు అవకాశమివ్వాలని ప్రతిపక్ష సభ్యులు అందోళనకు దిగారు. నరేంద్ర –సరెండర్ అంటూ ప్లకార్డులు చేతబూని నినాదాలిచ్చారు. స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ కొనసాగించాలని విపక్ష సభ్యులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సభను వాయిదా వేశారు. మళ్లీ పున: ప్రారంభమైనప్పటికీ సభలో పరిస్థితి మారలేదు. ఈ సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, ప్రధాని కుర్చీ సమీపంలో ఒక అనుచిత సంఘటన జరగవచ్చనే సమాచారం ఉన్నందున, సభలో గందరగోళం నెలకొనే ఆందోళనల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీని సభకు హాజరుకావద్దని తాను సలహా ఇచ్చానని తెలిపారు. లోక్‌సభలో మాట్లాడుతూ బిర్లా, "అత్యంత విచారంతో తాను సభకు తెలియజేయాలనుకుంటున్నాను, నిన్న లోక్‌సభ ఛాంబర్‌లో కొందరు ఎంపీలు ప్రవర్తించిన తీరు దారుణం. లోక్‌సభ చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగలేదు. మన పార్లమెంటరీ ఛాంబర్‌లో స్పీకర్‌కు గౌరవప్రదమైన స్థానం ఉంది, ఈ విషయం రాజ్యాంగంలో కూడా పేర్కొనబడింది. పార్లమెంటులో అభిప్రాయ భేదాలు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి, కానీ ఇంతకు ముందు ఇలాంటి ప్రవర్తన చూడలేదు" అని అన్నారు. "ప్రతిపక్ష నాయకులు చేసినది పార్లమెంటరీ కార్యకలాపాలకు తగినది కాదు. ఇది ఒక నల్ల మచ్చ లాంటిదని తాను చెబుతాను. పార్లమెంటు సజావుగా నడవడానికి మనమందరం సహాయం చేయాలి," అని బిర్లా అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రస్తావిస్తూ, సభా నాయకుడు సమాధానం ఇవ్వాల్సి ఉన్నప్పుడు కొందరు కాంగ్రెస్ ఎంపీలు అనుచిత పరిస్థితిని సృష్టించవచ్చని తనకు సమాచారం అందిందని స్పీకర్ చెప్పారు. సభా నాయకుడు రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై సమాధానం ఇవ్వాల్సి ఉన్నప్పుడు, కొందరు కాంగ్రెస్ ఎంపీలు ఏదైనా అనుచితమైన పని చేయవచ్చని నాకు సమాచారం అందింది. పార్లమెంటులో తాను ఇలాంటివి కూడా చూశాను' అని ఆయన అన్నారు. ఒకవేళ అలాంటి సంఘటన జరిగి ఉంటే, అది దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను తీవ్రంగా దెబ్బతీసేదని బిర్లా అన్నారు. "ఒకవేళ అలాంటి సంఘటన జరిగి ఉంటే, అది దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను ఛిన్నాభిన్నం చేసేది. కాబట్టి, అలాంటి పరిస్థితిని నివారించడానికి, నిన్న సభకు రావద్దని తాను ప్రధానమంత్రిని కోరాను. స్పీకర్‌గా, పార్లమెంటు మర్యాదను కాపాడటం నా బాధ్యత," అని ఆయన అన్నారు.

**ట్రేడ్ డీల్‌పై చర్చకు విపక్షాల పట్టు**

**ప్లకార్డులతో నిరసన, స్పీకర్ ఆగ్రహం, వాయిదా**

**ప్రధాని మోడీపై దాడికి కాంగ్రెస్ ఎంపిల కుట్ర?**

**అందుకే సభకు రావద్దని ప్రధానికి చెప్పా: ఓం బిర్లా**

**ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఆమోదం**

**స్పీకర్ ఆరోపణలను తోసిపుచ్చిన కాంగ్రెస్**

ఇదిలా ఉండగా, బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రతిపక్షాలు వరుసగా నాలుగో రోజు కూడా నిరసనలు కొనసాగించడంతో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంప్రదాయ ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని లోక్‌సభ గురువారం ఆమోదించింది. అయితే, ఈపరిణామం పూర్తిగా అసాధారణమైనది కాదు. 2004లో, అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ కూడా ప్రతిపక్షాల అంతరాయాల కారణంగా రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సమాధానం ఇవ్వకుండా ఆమోదించారు. గురువారం కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం పొందినప్పుడు ప్రధానమంత్రి మోడీ లోక్‌సభలో లేరు. సభను శుక్రవారానికి వాయిదా పడింది.

**ఆరోపణలు నిరాధారమైనవి:కాంగ్రెస్**

లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్రమోడీని ప్రతిపక్ష ఎంపీలు బెదిరించారని లేదా అడ్డుకోవడానికి ప్రయత్నించారని వచ్చిన ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు గురువారం తోసిపుచ్చారు, "ప్రణాళికాబద్ధమైన" సంఘటన జరిగిందనే వాదనలు అబద్ధమని, పార్లమెంటు కార్యకలాపాల్లో అంతరాయాల నుండి దృష్టిని మళ్లించే లక్ష్యంతో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిపక్ష సభ్యులు ప్రధానమంత్రిని అడ్డుకోవడానికి లేదా హాని కలిగించడానికి ప్రయత్నించారని సూచించే నివేదికలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తోసిపుచ్చారు, అలాంటి వాదనలను 'పూర్తిగా తప్పు' అని పిలిచారు. "అలాంటి సమస్య ఏమీ లేదు. ఎటువంటి ప్రణాళిక లేదు'అని ఆమె అన్నారు. కాంగ్రెస్ ఎంపీ వర్ష గైక్వాడ్ కూడా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీరును తప్పుపట్టారు. బిజెపి ఎంపీ నిషికాంత్ దూబె చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, మాజీ ప్రధానమంత్రులు, ఇతరులపై తాను ఉపయోగించిన "అసభ్యకరమైన భాష" అని అభివర్ణించిన దానిని పాలక పార్టీ ఆమోదించిందా అని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడితో సహా ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు.

**ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించాలి**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని పార్లమెంటులో మాట్లాడటానికి అనుమతించాలని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కోరారు. రాష్ట్రపతి ప్రసంగం సందర్భంగా ఆయన వ్యాఖ్యలపై లేవనెత్తిన అభ్యంతరాలు ఒక పెద్ద పార్లమెంటరీ సమస్యను సృష్టించాయని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న విషయాలనే ఉటంకిస్తున్నారని థరూర్ అన్నారు. "ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించాలి. ఆయన ఇప్పటికే ఒకపత్రికలో ప్రచురితమైన విషయాన్ని ఉటంకిస్తున్నారు. అది ఇకపై అప్రచురితమైన విషయం కాదు. ఆయన కేవలం తన అభిప్రాయాన్ని చెప్పి, ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగంలోని ఇతరఅంశాల గురించి మాట్లాడాలనుకున్నారు. ఇంతపెద్ద అభ్యంతరం చెప్పి, ఆయనను మాట్లాడకుండా అడ్డుకోవడం ద్వారా, ఒక పెద్ద సమస్యను సృష్టించారు," అని ఆయన అన్నారు.



## చమురు కొనుగోళ్లపై భారత్‌దే తుది నిర్ణయం

### అమెరికాతో ఒప్పందంపై రష్యా స్పందన

**మాస్కో, ఫిబ్రవరి 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ ప్రధానమంత్రి నరేంద్రమోడీల మధ్య కుదిరిన చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై వస్తున్న ఊహాగానాలకు మాస్కో తెరదించింది. భారత్ తన శక్తి అవసరాల కోసం ఎవరి దగ్గరైనా చమురుకొనుగోలు చేసుకునే పూర్తి స్వేచ్ఛ ఉందని,ఈవిషయంలో తాము ఎటువంటి ఆందోళన చెందడం లేదని రష్యా స్పష్టం చేసింది.

**'ఇందులో కొత్తేమీ లేదు' : రష్యా స్పందన**

రష్యాకు భారత్ ఒక వ్యూహాత్మక భాగస్వామి అని, ఇంధన రంగంలో తమ మధ్య ఉన్న బంధం ఇరు దేశాలకు ప్రయోజనకరమని రష్యా విదేశాంగశాఖ పేర్కొంది.క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ 'భారత్ ఎప్పుడూ రష్యా నుంచే చమురు కొనడంలేదు. ఇతర దేశాల నుంచి కూడా కొనుగోలు చేస్తోంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సరఫరా దారులను మార్చుకోవడంలో భారత్‌కు పూర్తి సార్వభౌమ అధికారం ఉంది' అని వ్యాఖ్యానించారు.

**ట్రంప్ క్లెయిమ్..మోడీ మౌనం**

ఇటీవల వాషింగ్టన్‌లో జరిగిన భేటీ తర్వాత ట్రంప్ ఒక సంచలన ప్రకటన చేశారు. అమెరికాతో కుదిరిన డీల్‌లో భాగంగా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తుందని దానికి బదులుగా అమెరికా లేదా వెనిజులా నుంచి చమురు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రధాని మోడీ తన ప్రకటనలో కేవలం సుంకాల తగ్గింపు గురించి మాత్రే ప్రస్తావించారు. కానీ రష్యా చమురు కొనుగోలు నిలిపివేతపై ఎక్కడా పెదవి విప్పలేదు. కానీ దీనిపై రష్యా స్పందించి భారత్ తమ చమురు కొనుగోలు చేయమని ఎక్కడా చెప్పలేదని వివరించింది. అలాగే రష్యా-భారత్ మధ్య ఉన్న ఇంధన భాగస్వా మ్యం అంతర్జాతీయ మార్కెట్ స్థిరత్వానికి అవసరమని మాస్కో నొక్కి చెప్పింది.

**రష్యా చమురుపై భారత్ ఎంతగా ఆధారపడింది?**

2021 వరకు భారత్ దిగుమతి చేసుకునే చమురులో రష్యా వాటా కేవలం 0.2 శాతం మాత్రే ఉండేది. కానీ, 2022 ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రాయితీ ధరకు రష్యా చమురు లభించడంతో భారత్ తన కొనుగోళ్లను భారీగా పెంచింది. భారత్ దిగుమతి చేసుకునే మొత్తం చమురులో సుమారు మూడోవంతు అంటే 35 శాతం రష్యా నుంచే వస్తోంది. ప్రతిరోజూ సుమారు 1.3నుంచి 1.5 మిలియన్ బారెళ్ల రష్యా చమురు భారత రిఫైనరీలకు చేరుతోంది.

రాజకీయ పార్టీల ఉచిత హామీలపై పిల్

## అత్యంత ప్రాముఖ్యతతో విచారిస్తాం



త్రిసభ్య ధర్మాసనం విచారిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచితాలను పంపిణీ చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను 'అత్యంత ప్రాముఖ్యత' కలిగినవిగా సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. 'ఇది అత్యంత ముఖ్యమైనది. ప్రజా ప్రయోజనం దృష్ట్యా దీనిని ముగ్గురు న్యాయ మూర్తుల ధర్మాసనం విచారించాలి' అని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ అధ్యక్షత వహించిన ఇద్దరు న్యాయ మూర్తుల ధర్మాసనం పేర్కొంది. ఫ్రీబీ సంస్కృతిని సవాలు చేస్తూ అడ్వకేట్ అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు దృష్టికి తీసుకువెళ్లి, ఈ విషయాన్ని మరింత ఆలస్యం చేయకుండా కోర్టును కోరారు. 'ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలువస్తున్నాయి సూర్యుడు, చంద్రుడుమాత్రమే వాగ్దానం చేయబడటానికి మిగిలి ఉన్నారు' అని పిటిషనర్ తరఫు న్యాయ వాది ఎత్తిచూపారు. 'ఇవి(ఉచితాలు) అవినీతి పద్ధతులు'అని ఆయనపేర్కొన్నారు. మార్చిలో విచారిస్తామని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

# 'భారత్ టాక్సీ' సర్వీసులు మొదలు





**ఓలా, ఉబెర్ బాదుడుకు బ్రేకులు పడినట్లేనా?**

**న్యూఢిల్లీలో యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** దేశీయ టాక్సీ సేవల రంగంలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ సంస్థల ఆధిపత్యానికి చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం మద్దతుతో రూపొందించిన 'భారత్ టాక్సీ' సేవలు గురువారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్రహోం మంత్రి అమిత్‌షా ఈ వినూత్న యాప్‌ను లాంచ్ చేశారు. 'సహకార్ సే సమృద్ధి' అనే నినాదంతో డ్రైవర్లే యజమానులుగా సాగే ఈ సరికొత్త ప్రయాణం ప్రయాణికులకు కూడా ఊరటనివ్వ నుంది.

**డ్రైవరే యజమాని..** 'భారత్ టాక్సీ' అనేది కేవలం ఒక యాప్ మాత్రమే కాదు ఇది 'సహకార టాక్సీ కో ఆపరేటివ్ లిమిటెడ్' ద్వారా నడిచే ఒక సహకార వ్యవస్థ. అముల్ విజయ గాథను స్ఫూర్తిగా తీసు కుని ఐఎఫ్‌ఎఫ్‌సిఒ, నాఫెడ్ వంటి దిగ్గజ సహ కార సంస్థల భాగస్వామ్యంతో దీనిని రూపొం దించారు. ఈ ప్లాట్‌ఫామ్‌లో చేరే ప్రతి డ్రైవర్‌ను 'సారథి' అని పిలుస్తారు. ప్రతి సారథికి ఈ సహకార సంస్థలో ఐదు షేర్లు ఉంటాయి. అంటే డ్రైవర్లు కేవలం పని చేసేవారే కాదు.. సంస్థలో భాగస్వాములు కూడా.

**జీరో కమీషన్.. ఫిక్స్‌డ్ ఫీజు:** ప్రస్తుతం ఓలా, ఉబర్ వంటి సంస్థలు డ్రైవర్ల సంపాదనలో 20 నుంచి 30శాతం వరకు కమీషన్ రూపంలో తీసుకుంటున్నాయి. కానీ 'భారత్ టాక్సీ'లో ఎలాంటి కమీషన్‌ఉండదు. డ్రైవర్లు యాప్‌ను వాడుకున్నందుకు రోజుకు కేవలం 30 రూపాయల నామినల్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన



మొత్తం డ్రైవర్ జేబుకే వెళ్తుంది. దీనివల్ల డ్రైవర్ల ఆదాయం పెరగడమే కాకుండా ప్రయాణికులకు కూడా సాధారణ ధరలకే 30 శాతం తక్కువకే రైడ్స్ లభించే అవకాశం ఉంటుంది.

**ప్రయాణికుల భద్రతకు పెద్దపీట:** ప్రయాణికుల భద్రత కోసం భారత్ టాక్సీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. డ్రైవర్లు అందరినీ ఢిల్లీ పోలీసుల ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే విధుల్లోకి తీసుకుంటారు. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో ఢిల్లీ పోలీసుల సహకారంతో మొత్తంగా 35 ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటుచేశారు. ఎమర్జెన్సీ అలర్ట్స్, లైవ్ రైడ్ ట్రాకింగ్ వంటి ఫీచర్లు కూడా యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

**పైలట్ ప్రాజెక్టు సక్సెస్ కావడంతో..** గత డిసెంబరు నుంచి ఢిల్లీ, గుజరాత్‌లో జరిగిన ప్రయోగాత్మక పరిశీలనలో ఈ యాప్ అద్భుతమైన ఫలితాలను సాధించింది. రోజుకు సగటున 10,000 రైడ్స్‌ను పూర్తి చేస్తూ సుమారు 3 లక్షల మంది డ్రైవర్లు ఇప్పటికే ఈ ప్లాట్‌ఫామ్‌లో చేరారు. రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలకు ఈ సేవలను విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ భారత్ ట్యాక్సీ‌తో ఉబర్, ఓటా వంటి సంస్థలకు బ్రేక్ పడే అవకాశం ఎక్కువగా ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## తగ్గిన పసిడి, వెండి ధరలు

**ముంబై, ఫిబ్రవరి 5:** రెండు రోజుల పెరుగుదల తర్వాత గురువారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి, అయితే వెండి ధర 8 శాతానికి పైగా పదునైన పతనాన్ని నమోదు చేసింది. ఉదయం 10.25 గంటల ప్రాంతంలో ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఎంసిఎక్స్ ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ 0.98 శాతం తగ్గి 10 గ్రాములకు రూ. 1,51,552కి చేరుకుంది. అదే సమయంలో, ఎంసిఎక్స్ మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ 8.39 శాతం పడిపోయి కిలోకు రూ.2,46,283కి చేరింది. ఉదయం ప్రారంభ ట్రేడింగ్‌లో బంగారం, వెండి ధరలు సుమారు 6 శాతం పెరిగినప్పటికీ, ఆ స్థాయిలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాయి.. కొత్త ఫెడ్ చైర్మన్‌గా కెవిన్ వార్ష్ నామినేషన్‌ను మార్కెట్లు చాలా వరకు స్వీకరించడంతో, వారం ప్రారంభంలో బంగారం, వెండి ధరలలో పతనం అదుపులోకి వచ్చిందని విశ్లేషకులు తెలిపారు. అమెరికా బలగాలు ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేయడంతో ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ సురక్షిత పెట్టుబడుల కొనుగోళ్లు ఇంకా కొనసాగుతున్నాయి.


## రేపు మలేసియాకు ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 7, 8 తేదీల్లో రెండు రోజుల పాటు మలేషియాలో పర్యటించనున్నారు. వాణిజ్యం, శక్తి, సముద్ర భద్రత, పెట్టుబడులు తదితర అంశాలపై ఆ దేశంతో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకుంటారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అక్కడ నివసిస్తున్న భారతీయులు, వాణిజ్య, వ్యాపారవేత్తలతో సమావేశమవుతారని అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా, ప్రధాని మోడీ మలేషియాను సందర్శించడం ఇది మూడోసారి.

## బొగ్గు గనిలో పేలుడు: 16 మంది దుర్మరణం

**మేఘాలయలో దుర్ఘటన**

**షిల్లాంగ్, ఫిబ్రవరి 5:** మేఘాలయలో ఓ బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 16మంది కార్మికులు మృతి చెందారు. శిథిలాల కింద మరికొంత మంది కార్మికులు చిక్కుకుని ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కార్మికుల కోసం రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపడుతోంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, మేఘాలయలోని తూర్పు జైంటియా హిల్స్ జిల్లాలోని థాంగ్స్కు ప్రాంతంలో అనుమానిత అక్రమ బొగ్గు గనిలో భారీ పేలుడు జరిగింది. అప్రమత్తమైన అధికారులు, పోలీసులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. 16 మంది కార్మికుల మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికితీశాయని



తూర్పు జైంటియా హిల్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వికాష్ కుమార్ తెలిపారు. చిక్కుకుపోయిన కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందన్నారు. గని లోపల బొగ్గు తవ్వకాల సమయంలో పేలుడు సంభవించిందని అనుమానిస్తున్నారు, దీని ఫలితంగా అనేక మంది కార్మికులు భూగర్భంలో చిక్కుకున్నట్లు కూలిపోయింది. పేలుడుకు ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడలేదు, కాగా ఈ సంఘటన నుండి ఒక కార్మికుడు గాయాలతో బయటపడ్డాడు. స్థానిక పోలీసులకు, అధికారులకు సహాయక చర్యల్లో సహాయం చేయడానికి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) బృందాలను ఆ ప్రాంతానికి తరలించినట్లు కుమార్ చెప్పారు.ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తుకు మేఘాలయ ప్రభుత్వం ఆదేశించింది.

'రాజస్థాన్‌లో హనీమూన్ హత్య' తరహా ఘటన

## భర్తను వాకింగ్‌కు తీసుకెళ్లి ప్రియుడితో చంపించిన భార్య



**షిల్లాంగ్, ఫిబ్రవరి 5:** పెళ్లయిన మూడు నెలలకే భర్తను హత్య చేయించిందో యువతి. వాకింగ్‌కు వెళదామని తీసుకెళ్లి ప్రియుడితో కొట్టి చంపించింది. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. మేఘాలయ 'హనమూన్ హత్య'ను గుర్తుచేస్తున్న ఈ దారుణ ఘటన రాజస్థాన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌కు చెందిన ఆశిష్‌కు మూడు నెలల కిందట అదే ప్రాంతానికి చెందిన అంజూతో వివాహమైంది. అయితే కొన్ని రోజులకే వీరి మధ్య మనస్పర్థలు రావడంతో అంజూ పుట్టింటికి చేరుకుంది. ఆ తర్వాత పెద్దల సమక్షంలో సమస్య పరిష్కారమవడంతో మళ్లీ అత్తింటికి చేరుకుంది. జనవరి 30న రాత్రి 9 గంటల సమయంలో వీరిద్దరూ రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉండగా అటుగా వెళుతున్న కొందరు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆశిష్ ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని వాహనం తమను ఢీకొట్టిందని, ఆ తర్వాత అందులో నుంచి కొందరు వ్యక్తులు దిగి తనను బెదిరించి నగలు దోచుకెళ్లినట్లు అంజూ విచారణలో పేర్కొంది. అయితే ఆమె చెప్పిన సమాధానానికి, ఘటనా స్థలంలోని పరిస్థితులకు పొంతన లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. అంతేగాక, అంజూకు ఎలాంటి గాయాలు కాకపోవడం, ఆశిష్ ఒంటిపై గాయాలు ఉండటంతో పోలీసులు ఆమెను గట్టిగా విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అంజూ పెళ్లికి ముందు తన ఇంటి సమీపంలో నివసించే సంజూని ప్రేమించినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. వివాహం తర్వాత కూడా అతడితో ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు తెలిపారు. పుట్టింటికి వెళ్లిన సమయంలో బాయ్‌ఫ్రెండ్‌ను కలిసిన ఆమె భర్త హత్యకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన రాత్రి ఆశిష్‌ను తీసుకుని అంజూ నిర్మానుష్య రహదారిపై వాకింగ్‌కు వెళ్లిందని అప్పటికే అక్కడ సంజూ తన స్నేహితులతో కలిసి మాటు వేసినట్లు తెలిపారు. వారంతా ఆశిష్‌పై దాడి చేసి చంపినట్లు పోలీసులు వెల్లడించారు. ఆ తర్వాత అంజూ ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

## సంక్షిప్తంగా..

### ఐదు తేజస్ మార్క్1-ఎ యుద్ధ విమానాలు సిద్ధం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** మిలిటరీ విమానాల ఉత్పత్తి సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ గురువారం కీలక ప్రకటన చేసింది. అయిదు తేజస్ మార్క్ 1–ఎ ఫైటర్ విమానాలు సంపూర్ణంగా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. భారతీయ వైమానికదళం కోసం ఈ యుద్ధ విమానాలను ఉత్పత్తి చేశారు. అయితే ఫ్యాక్టరీలో మరో 9 విమానాలు సిద్ధంగా ఉన్నాయని, అమెరికా జనరల్ ఎలక్ట్రిక్ సంస్థ సరఫరా చేసే ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు హెచ్ఎఎల్ తన ప్రకటనచెప్పింది. డెలివరీకోసం అయిదు విమానాలు సిద్ధం అయ్యాయని, ఒప్పందం ప్రకారం ఆ విమానాలను రూపొందించామని, అదనంగా 9 విమానాలను, అమెరికా ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్న బెంగళూరుకు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ కంపెనీ వెల్లడించింది.

### పుచ్చకాయల వాహనంలో పేలుడు పదార్థాలు



**తిరువనంతపురం, ఫిబ్రవరి 5:** పుచ్చకాయల లోడ్‌తో వెళుతున్న మినీ లారీలో పేలుడు పదార్థాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో ఆ వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు. పుచ్చకాయలను తొలగించారు. వాటికింద దాచిన బాక్సుల్లో భారీగా పేలుడుపదార్థాలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తమిళనాడుకు చెందిన మినీ లారీలో పుచ్చకాయలమాటున పేలుడు పదార్థాలు రవాణా చేస్తున్నట్లు కేరళ పోలీసులకు సమాచారం అందింది. కాగా ఫిబ్రవరి 3న రాత్రి 9 గంటల సమయంలో వాలాయర్, వడక్కెంచేరి జాతీయ రహదారిలోని పాలక్కాడ్ ప్రభుత్వమెడికల్ కాలేజీసమీపంలో ఆ మినీలారీని పోలీసులు అడ్డుకున్నారు. పుచ్చకాయలను బయటకు తీసి వందకు పైగా పెట్టెల్లో పేలుడు పదార్థాలు ఉండటం చూసి పోలీసులు అవాక్కయ్యారు. లక్షల విలువైన 4,000 జిలెటిన్ స్టిక్స్, 17 డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు.

### మధ్యప్రదేశ్ ఆసుపత్రిలో కాల్పులు: నర్సు దారుణ హత్య



**భోపాల్, ఫిబ్రవరి 5:** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే నర్సును ఒక వ్యక్తి హత్య చేశాడు. గన్‌తో ఆమెపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. నర్సు హత్యపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్‌జిల్లాలో ఈ సంఘటన జరిగింది. షాగఢ్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో 25ఏళ్ల దీప్‌శిఖా చదర్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నది. నైట్ డ్యూటీకి ఆసుపత్రికి చేరుకున్న నర్సు దీప్‌శిఖా ప్రధాన ద్వారం వద్ద ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమెపై దాడి చేశాడు. నర్సును కిందకు తోసి గన్‌తో మూడురౌండ్లు కాల్పులు జరిపి పారిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న ఆమె అక్కడికక్కడే మరణించింది. ఇది చూసి స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. నర్సు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

### వందేళ్ల వృద్ధుడికి హత్య కేసు నుంచి విముక్తి

**అలహాబాద్, ఫిబ్రవరి 5:** ఉత్తరప్రదేశ్‌లో 100 సంవత్సరాల వృద్ధుడికి దాదాపు నాలుగున్నర దశాబ్దాల తర్వాత న్యాయం దక్కింది. 1982 నాటి హత్య కేసులో ఈ వృద్ధుడిని అలహాబాద్ హైకోర్టు నిర్దోషిగా తీర్పు చెప్పింది. నాడు ఒక భూవివాదం గొడవ ఒకరి హత్యకు దారితీసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హమీన్‌పూర్‌లో 1982లో జరిగిన ఈ హత్య ఘటనలో మైకు అనే వ్యక్తి ప్రధాన నిందితుడు కాగా, ధనీరామ్, సత్తిదిన్ ప్రేరేపించినట్లు అభియోగాలు నమోదయ్యాయి.ఈ కేసును విచారించిన హమీన్‌పూర్ సెషన్స్ కోర్టు 1984లో ధనీరామ్, సత్తిదిన్‌కు జీవిత ఖైదు శిక్ష విధించింది. సెషన్స్ కోర్టు తీర్పుపై 40 ఏళ్ల క్రితం వారు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. పిటిషన్ విచారణ దశలో ఉండగా, వారు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో మంజూరైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మైకు అరెస్టు కాలేదు.ఈ కేసును హైకోర్టు తాజాగా విచారణ జరిపింది. ప్రధాన నిందితుడు మైకును అరెస్టు చేయకపోవడాన్ని ప్రశ్నించింది. అనంతరం ధనీరామ్ అప్పీలుపై నిర్ణయంలో జాప్యం, ప్రాసిక్యూషన్‌లో లోపాలను ఎత్తి చూపిన న్యాయస్థానం అతడిని నిర్దోషిగా తేల్చింది. అతడి వయస్సును కూడా పరిగణనలోకి తీసుకుని నిర్దోషిగా తేల్చింది.

# ఆదివాసీల దశాబ్దాల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

## గుర్తేడు మండలం ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే శిరీషాదేవి



గుర్తేడు తాశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే,కలెక్టర్

**గుర్తేడు(చింతూరు) ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా గుర్తేడు మండలాన్ని గురువారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ దినేష్‌కుమార్, రంప చోడవరం యంయల్ఏ మిరియాల శిరీషాదేవి చేతుల మీదుగా ప్రారంభించారు. గుర్తేడులో ఉన్న ప్రభుత్వ భవనంలో తాత్కాలిక తాశీల్దార్ కార్యాలయం,తాత్కాలిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. 2025 అక్టోబర్‌లోనే వై రామవరం మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది.వై రామవరం మండలంలోని మొత్తం 17 పంచాయితీల్లో బుద్దగండి,పాతకోట, కానివాడ, ధారగడ్డ,గుర్తేడు 5 పంచాయితీలలోని 59 రెవెన్యూ గ్రామాలను కలిపి గుర్తేడు మండలంగాను, మిగిలిన వై రామవరం, యార్లగడ్డ, చవిటిదిబ్బల, పి.యర్ర గొండ, పనసలపాలెం, కోట,యర్రంరెడ్డిపాలెం, చింతల పూడి, దాలిపాడు,దేవరమదుగుల, చామగడ్డ,కె.ఎర్రగొండ 12పంచాయితీల్లో 78 రెవెన్యూ గ్రామాలను పాత వై.రామవరం మండలంగా ఉంచారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం యంయల్ఏ మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ఆదివాసిల దశాబ్దాల కలను సాకారం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని, రంపచోడవరాన్ని జిల్లాగా చేసిన ఘనత చంద్రబాబునాయుడుదే అని, ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జీవితాంతం ఋణపడి ఉండాలని ఆమె అన్నారు. ఆదివాసిలు, కొండరెడ్లపై ప్రత్యేక అభిమాన్ని ముఖ్యంత్రి చంబ్రాబునాయుడు మరో సారి చాటుకున్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు.ఇప్పటికే రంపచోడవరం జిల్లాలోని 12 మండలాల్లో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని,అనేక మారు మూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించటానికి నిధులు మంజూరు అయ్యాయని, ప్రభుత్వం ఇచ్చిన ఈ బృహత్తర అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.ఆదే వేదికపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాపరాయి ఘటన ఈ ప్రాంత చరిత్రను మార్చిందని,ఎటువంటి కమ్యూనికేషన్ లేని మారుమూల గ్రామాలకు నేడు మొబైల్ సేవలు అందుబాటులోకి వచ్చాయని,అనేక గ్రామాలకు రహదారుల నిర్మాణం జరుగు తుందని, త్వరలోనే మండలానికి అవసరమైన అన్ని భవనాలను నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి,ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, రంప చోడవరం సబ్‌కలెక్టర్, చింతూరు ఇన్‌చార్జ్ పివో శుభం నోక్వాల్ ,రాష్ట్ర యస్.టి.కమిషన్ సభ్యులు గొర్లె సునిత ఉన్నారు.

# జలపాతాల ఖిల్లా మన్యం జిల్లా



### - మహా లొద్ద జలపాతం ప్రారంభోత్సవంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

### - మరో ఆంధ్రా ఊటీలా జిల్లాను తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం

**సాలూరుమ్రుక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా ) ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** సహజసిద్ధమైన సౌందర్యాలకు కేరాఫ్ అడ్రస్ మన్యం ప్రాంతమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. జలపాతాల ఖిల్లా మన్యం జిల్లా అని కితాబిచ్చారు. జిల్లాలో అనేక సహజ సౌందర్యాలు ఉన్నాయని, మరో ఆంధ్రా ఊటీలా జిల్లాను తీర్చిదిద్దడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని అన్నారు. సాలూరు మండలం, కొదమ గిరిజన పంచాయతీ పరిధిలోని ప్రకృతి రమణీయమైన మహా లొద్ద జలపాతాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన ఇన్నేళ్ల తర్వాత, తొలిసారిగా లొద్ద జలపాతానికి శాశ్వత రహదారి సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. మహా లొద్ద జలపాతానికి చేరుకునేందుకు వీలుగా 6 కిలోమీటర్ల మేర రహదారిని సుమారు రూ. 6 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ రోడ్డు మార్గం పూర్తయితే పర్యాటకుల తాకిడి పెరిగి, స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రకృతికి ఆలవాలమైన ఈ జలపాతం నుంచి అందాలను వీక్షించేలా పెద్ద గెస్ట్ హౌస్‌ను నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. డోలీ మోతలు లేని జిల్లాగా చేయాలని అన్ని రోడ్లను మంజూరు చేస్తున్నామని అన్నారు. సిరివరకు రూ. 14 కోట్లతో మరొక రోడ్డును మంజూరు చేశామని, త్వరలో అది కూడా పూర్తయితే, విద్య, వైద్యానికి ఇబ్బంది ఉండదని చెప్పారు. జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనలు చేస్తున్నారని, ముస్తాబు, రెవిన్యూ క్లినిక్, జలపాతాలను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ జలపాతం వద్ద పిల్లలు ఆనందంగా గడపాలని, ట్రెక్కింగ్ కూడా చేయవచ్చని అన్నారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల కోసం గైడ్ లను, ట్రెక్కింగ్ కొరకు బోయ్స్ ఉన్నారని, వారితో చుట్టుప్రక్కల అందాలను తిలకించవచ్చని అన్నారు. తమ నియోజకవర్గంలో మూడు నీటి ప్రాజెక్టులు ఉన్నాయని, వాటిని కూడా పర్యాటక కేంద్రాలుగా మార్చి, బోట్ షికారు ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ.... జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సూచించడం జరిగిందన్నారు. మంత్రి ఆధ్వ ర్యంలో ఈ రోజు ఏడవ జలపాతాన్ని ప్రారంభించుకున్నామని అన్నారు. జిల్లాలో అనేక జలపాతాలు ఉన్నాయని, ఇప్పటివరకు ఇవి ప్రజలకు అందుబాటులో లేవన్నారు.

# అంతర్రాష్ట్ర బదలీలకు ఏపి ప్రభుత్వం సానుకూలం

### - టిజి రాష్ట్రానికి వెళ్లే వివరాలు కోరుతున్న పాఠశాల విద్యా శాఖ

**విజయవాడ,ఫిబ్రవరి 5,ప్రభాత వార్తప్రతినిధి:**అంతర్రాష్ట్ర బదిలీల్లో భాగంగా గతంలో తెలంగాణ రాష్ట్రానికి వెళ్లేందుకు సమ్మతి ఇచ్చిన ఉద్యోగుల నుంచి ఏపీ పాఠశాల విద్యా శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. విద్యా శాఖలో పని చేస్తున్న 229మంది అంతర్రాష్ట్ర బదిలీలకు ఐచ్ఛికాలు ఇచ్చారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసి స్టెంట్లు, ఎంఈవోలు, సహాయ సంచాలకులు ఉన్నారు. స్పౌజ్, వ్యక్తిగత, మెడికల్, లోకల్ కేటగిరీల కింద బదిలీల్లో వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ ప్రక్రి యలో కొంత జాప్యం జరిగినందున కొంతమంది ఉద్యో గులు పదవీ విరమణ చేయడం, పదోన్నతి పొందడం, తెలంగాణకు వెళ్లేందుకు ఇష్టపడకపోవడంలాంటి కార ణాలు ఉన్నందున మొదటి జాబితాను నవీకరించేందుకు పాఠశాల విద్యాశాఖ వివరాలు సేకరిస్తోంది. వివ రాలను తక్షణమే పంపించాలని సూచించింది. ప్రత్యేక ఫార్మెట్లు ఇచ్చింది. వివరాల సేకరణ అనంతరం తుది జాబితాను రెండు, మూడు రోజుల్లో తెలంగాణకు రాష్ట్ర ప్రభుత్వం పంపించనుంది. ఇప్పుడు కొత్తగా ఎవ్వరినీ అనుమతించరాదని జిల్లా స్థాయి అధికారులకు సూచిం చింది. కొత్త వారికి సైతం అవకాశం కల్పించాలని ఏపీ టీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

# ఎసిబి వలలో మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్

### - రూ 20,000 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు

**ఆత్మకూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** ఆత్మకూరు మున్సిపాలిటీలో రెండోసారి ఏసీబీ అధికారులు దాడులు చేసి మున్సిపల్ అధికారులను అదుపులోకి తీసుకొని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన సంఘటన ఆత్మకూరు పట్టణంలో సంచలనంగా మారింది గురువారం ఆత్మకూరు మున్సిపాలిటీలో కమిషనర్ రమేష్ బాబును అధికారితోపాటు బిల్ కలెక్టర్ భాస్కర్లను ఏసీబీ అధికారులు నగదు 20,000 పట్టుకొని విచారణ ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర మ్యారేజ్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సర్టిఫికెట్ ఇచ్చేందుకు 20. వేల రూపాయలు లంచం ఏసీబీ వాళ్లకు చిక్కినట్లు ఎసిబీ డిఎస్పి సోమన్న, సీఐ బిఆర్ కృష్ణయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణానికి కొత్తపేటకు చెందిన నాయబ్ సయ్యద్ సజ్జత్ అలీ మ్యారేజ్ ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు వీఎల్టి సర్టిఫికెట్ ఇవ్వాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు ను సంప్రదించడం జరిగిందన్నారు. దీనికోసం మున్సిపల్ కమిషనర్ 20. వేలు ఖర్చు అవుతుందని తెలిపారని ఫిర్యాదుదారుడు నిన్నటి దినం అనగా బుధవారం ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించారని తెలిపారు. 20 వేల రూపాయలను మున్సిపల్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగి బిల్ కలెక్టర్ అయిన భాస్కర్ కి ఇవ్వాల్సిందిగా కమిషనర్ చెప్పినట్లు తెలిపారు. ఫిర్యాదు దారుని సమాచారం మేరకు రూ 20. వేలులంచం బిల్ కలెక్టర్ తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగిందన్నారు. బిల్ కలెక్టర్ ను విచారించగా మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు ఆదేశాల మేరకే 20వేల రూపాయలను తీసుకున్నట్లు తెలిపారు అన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, బిల్ కలెక్టర్ భాస్కర్ ఆయన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మకూరు ప్రాంతంలో అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులపై తక్షణమే బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందని పలువురు బాధితులు వాపోతున్నారు ఆత్మకూరు పట్టణంలో మరో నాలుగు శాఖల అధికారులపై ఏసీబీ నిగా ఉన్నట్లు విశ్వసనీయమైన సమాచారం .

# ఏజెంట్ చేతిలో మోసపోయిన ఆంధ్రా మహిళ

### - ఒమన్‌లో ప్రాణాపాయ స్థితి నుండి స్వస్థలానికి చేర్చిన ఎన్నారై టిడిపి

**గుంటూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల అనంతపురం జిల్లా, ధర్మవరానికి చెందిన షేక్ అబిదా అనే ఓ మహిళ తన కుటుంబ పోషణ కొరకు ఒమాన్ దేశం వెళ్ళటం జరిగింది. తను వర్క్ వీసాకు బదులుగా ఏజెంట్ ద్వారా విజిట్ వీసాపై ఆదేశానికి వెళ్ళింది. నెల రోజుల క్రితం ఒమన్‌కు వెళ్లిన షేక్ అబీదా, ప్రయాణం సమయంలోనే అస్వస్థతకు గురికాగా వెంటనే స్పందించిన విమానాశ్రయ అధికారులు మరియు క్లినిక్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించారు.సుమారు 15 రోజుల చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం మెరుగుపడింది.అదే సమయంలో ఈ విషయం తెలుసుకున్న విళిగిదేశి ప్ఫ్లి సభ్యులు ఆసుపత్రి యాజమాన్యం ను సంప్రదించారు. వెంటనే తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలోని విళిగిదేశి సెల్ కోఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్ మరియు స్థానిక డెక్కన్ వింగ్‌తో కలిసి పూర్తి సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా ట్రీట్మెంట్ కి సంబంధించిన బిల్లులు మరియు తన తిరుగు ప్రయాణానికి అవసరమైనటు వంటి విమాన టికెట్టు కొరకు ఆర్థిక సహాయం అబిదా బేగంకు అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.కాగా, నిన్న ఫిబ్రవరి 4న ఆమె హైదరాబాద్‌కు బయలుదేరగా, అక్కడి నుంచి స్వస్థలం అనంతపురం జిల్లా ధర్మవరం చేరుకునేందుకు విళిగిదేశి సెల్ సహాయం కూడా చేయడం జరిగింది. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన ఒక ఏజెంట్ ఆమెను విజిట్ వీసాపై ఒమన్‌కు పంపగా, ఆరోగ్య సమస్యల వల్ల పని చేయలేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆమె, చివరకు స్వదేశానికి తిరిగి రావాల్సి వచ్చింది. సకాలంలో తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ టిడిపి సెల్, విళిగిదేశి ఒమన్ మరియు డెక్కన్ వింగ్ టీం మెంబెర్స్ జోక్యం చేసుకోవడంతో ఆమె సురక్షితంగా భారత్‌కు చేరుకోగలిగింది.ఆమె తన అనుభవాన్ని పంచుకుంటూ, మహిళలు ఎజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని, గల్ఫ్ దేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా తిశివిళిగి, లేదా మీ ప్రాంతంలోనే తెలుగుదేశం చెందిన నాయకులను లేదా ఎన్నారై టిడిపి సెల్ వారిని లేదా నిర్ధారిత అధికారిక వర్గాలను మాత్రమే సంప్రదించాలని అబిదా బేగం విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా తనకు ఎంతో ఆదరణ ఇచ్చినటు వంటి తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ఇలాంటి టీం ని అందించి తనకు ప్రాణ రక్షణ కల్పించినందుకు కన్నీటి పర్యంతమవుతూ ఆమె తన తరపున తన కుటుంబం తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ కీలక మార్పులకు శ్రీకారం

### - ఇన్విజిలేటర్లను మాన్యువల్గా కేటాయించే విధానానికి స్వస్తి

**విజయవాడ.జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:**పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇన్విజిలేషన్ అంశాల్లో ముఖ్యమైన మార్పులు తీసుకొస్తోంది. దీనిలో భాగంగా ఇన్విజిలేటర్లను మాన్యువల్గా కేటాయించే విధానానికి స్వస్తి పలకనుంది. ఈ స్థానంలో ఆటోమేషన్ విధానాన్ని తీసుకురానున్నారు. ఈ మేరకు విద్యా శాఖ కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసిందిజ మంత్రి నారా లోకేశ్ వద్ద అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు తొలి నుంచీ మాన్యువల్ విధానంలోనే ఇన్వి జిలేటర్లను కేటాయిస్తున్నారు. డీఈవో, ఎంఈవోల విచక్షణాధికారంతో ఇన్విజిలేటర్లను పరీక్షా కేంద్రా లకు పంపుతున్నారు. అయితే, ఇక నుంచి మాన్యువల్ స్థానంలో ఆటోమేషన్ విధానం తీసకొస్తున్నారు. దీనికిగాను సాఫ్ట్వేర్ కూడా రూపొం దించారు. ఏ టీచర్ను ఎక్కడకు పంపాలనేది అటోమేషన్లో భాగంగా సాఫ్ట్వేరే నిర్ణయిస్తుంది. ఈ విధానంలో 8 నుంచి 10 కిలోమీటర్ల పరిధిని పెట్టనున్నారు. టీచర్ ప్రస్తుత పాఠశాల నుంచి అ దూరంలోని పరీక్ష కేంద్రానికే కేటాయిస్తారు. అలాగే ప్రస్తుత విధానంలో ఏదైనా ఒక సబ్జెక్టు పరీక్ష జరిగే సమయంలో ఆ సబ్జెక్టు టీచర్లకు ఇన్విజిలేషన్ డ్యూటీ వేయరు. ఇకపై గణితం, సైన్స్, సోషల్(గ్రూపు సబ్జెక్టులు) పరీక్షలు జరిగేటప్పుడు భాషా సబ్జెక్టుల టీచర్లను.. భాషా పరీ క్షలు జరిగే సమయంలో గ్రూపు సబ్జెక్టుల టీచ ర్లను ఇన్విజిలేటర్లుగా నియమించాలని నిర్ణయించారు. అలాగే అనారోగ్య సమస్యలున్న టీచర్లకు కొన్ని మినహాయింపులుంటాయి. ఈ నిబంధనల ప్రామాణికంగానే టీచర్లకు సాఫ్ట్వేర్ ఇన్విజిలేటర్ బాధ్యతలు కేటాయిస్తుంది. ఫలితంగా ఇన్విజిలేషన్ కేటాయింపు విషయంలో టీచర్లు, అధికారులు జోక్యం, నిబంధనల ఉల్లంఘనలు ఉండవని పాఠ శాల విద్యాశాఖ భావిస్తోంది.

ఇక, ఇన్విజిలేషన్కు ప్రైవేటు టీచర్లను కూడా వినియోగించాలని పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించింది. టెన్త్ పరీక్షల నిర్వహణకు 33వేల మంది టీచర్లు అవసరమవు తారు. ప్రైవేటు బడుల్లోనూ ప్రభుత్వ టీచర్లే ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

# ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసిపి దొంగ దీక్షలు : మంత్రి జనార్ధన్ రెడ్డి

**సచివాలయం,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** ఐదేళ్ళు రాయలసీమను నిర్లక్ష్యం చేసిన జగన్ నేడు దీక్షల పేరుతో డ్రామాలు అడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి మండిపడ్డారు.రాయలసీమకు మీ ప్రభుత్వంలో మీరు చేసింది,మా ప్రభుత్వంలో మేం ఏం చేశామో చర్చకు సిద్ధంగా ఉన్నామని దమ్ముంటే వైసీపీ నేతలు చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.ఈమేరకు ఆయన గురువారం ఆయన టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి రూ.12లక్షల కోట్ల బడ్జెట్‌లో పెడితే ..అందులో కనీసం రూ.2వేల కోట్లు కూడా రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేయలేదు.వర్షాభావం తక్కువగా ఉన్న రాయలసీమలో చంద్రబాబు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు శ్రీకారం చుడితే..రైతులకు ఎంతో ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్‌ను జగన్ అధికారంలోనికి రాగానే రద్దుచేశారు. జగన్ నిజంగా రాయలసీమ వాడే అయితే రాయలసీమ అభివృద్ధిపై సాగునీటి ప్రాజెక్టులకు చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం.దమ్ముంటే జగన్‌రెడ్డి,వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చకు రావలి మేం సిద్ధం,ఈనెల 11వ తేదిన జరిగే అసెంబ్లీ సమావేశాలకు 11మంది వైసీపీ ఎమ్మెల్యేలతో రండి...చర్చించేందకు మేం సిద్ధంగా ఉన్నాం ప్రజలకు వాస్తవాలు ఏమిటో కూడా తెలుస్తాయి

# శివయ్య సేవలో సంకట హార చతుర్థి హోమాలు



సంకట హార చతుర్థి పూజలు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో గురువారం సంకటహార చతుర్థి పూజలు,హోమాలు నిర్వహించారు.ఆలయంలోని పలు ప్రాంతాలు శాంతికి చిహ్నంగా ఉంది.ముఖ్యంగా మహిమాన్వితమైన అంజంజి వినాయక ఆలయం వద్ద సంకటహార చతుర్థి పూజలు నిర్వహిస్తున్నారు. వరాలివ్వటానికి మూలమైన కన్యామూల గణపతి ఆలయం వద్ద హోమాలు ఏర్పాటు చేసారు. ఆలయానికి చెందిన ఎస్ఎంకె శ్రీనివాసు గురుకుల్ సారధ్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలు ఏర్పాటు చేసారు. శ్రీనివాసు గురుకుల్ శాస్త్రోక్తంగా హోమాలు పూర్ణాహుతి గావించారు. గతంలో సంకటహార చతుర్థి పూజలను ఆలయం తరపునే నిర్వహించే వారు.అయితే దీనిని కకూడా సేవగా మార్చారు. భక్తులకు అవకాశం కల్పించారు. ప్రతి నెల భక్తులు ఈ పూజలు,హోమాలు జరుపుకుంటున్నారు.కన్యామూల గణపతి ఆలయం వద్ద కలశ స్థాపనగావించారు. హోమాలు వెలిగించారు. ఆలయం తరపున డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ సంకల్పంతో పూజలు నిర్వహించారు.పూర్ణాహుతితో పూజలు ముగిసాయి. దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ప్రవేశ ద్వారం ఎదురుగా దక్షిణాభిముఖంగా మొదటి దర్శనం ఇచ్చే దక్షిణామూర్తిని ఇక్కడ క్షేత్రపాలకుడుగా చెబుతారు.ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో గురువుకు ప్రత్యేక అలంకరణలు జరిపారు.ఈ కార్యక్రమాలకు పట్టణం నుంచే కాకుండా కర్నాటక నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించండి

### - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్

### - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు



ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ నాయకులు

**విజయవాడ.ఫిబ్రవరి5, ప్రభాత వార్తప్రతినిధి:** ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, తాజా బడ్జెట్ ఇందుకు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ (అమరావతి) నాయకులు డిమాండ్ చేసారు.సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గారిని కలిసి రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలపైన, 2023 జూలై1 నుంచి రావాల్సిన 12 వేతన సవరణ కమీషన్ ను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్ సమావేశాల్లో చర్చించి,పీఆర్సీ కమీషన్ ఏర్పాటు చేయాలని, ఈలోగా ఉద్యోగులకు ఐఆర్ ప్రకటన చేసేవిధంగా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ,కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని, ఉద్యోగులకు, ఉపాధ్యాయ లకు, విశ్రాంతి ఉద్యోగులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు కృషి చేయాలని, రాష్ట్రంలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులకు డిసిప్లినరి ప్రోసిడింగ్ లపై వన్ టైం సెటిల్మెంట్ చేసేవిధంగా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

# రాష్ట్రంలో రూ.34,680 కోట్ల విలువైన 16 రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం

**విజయవాడ,ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో ఇప్పటి వరకు రూ.12,967 కోట్ల విలువైన 10 రైల్వే ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రూ.34,680 కోట్ల విలువైన మరో 16 ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతుంది. లోక్‌సభలో టీడీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, పుట్టా మహేష్ కుమార్‌లు అడిగిన వేర్వేరు ప్రశ్నలకు రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్ సమాధానం ఇచ్చారు.గత 4 ఏళ్లలో 15 కొత్త లైన్లు, 50 డబ్లింగ్ లైన్ల కోసం సర్వే పనులు చేపట్టామని ర్లైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.వీటి మొత్తం పొడవు 6,985 కిలోమీటర్లని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 1 నాటికి ఏపీకి 4,499 కిలోమీటర్ల పొడవైన 12 కొత్త లైన్లు, 27 డబ్లింగ్ పనులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. వాటి విలువ రూ.70,232 కోట్లని ఆయన వెల్లడించారు. అందులో 1,178 లైన్లు ప్రారంభం అయ్యాయని, అందుకోసం రూ.28,039 కోట్లు ఖర్చు చేసినట్లు రైల్వేమంత్రి తెలిపారు. అమరావతి లైన్ కోసం భూ సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. గుంటూరు- బీబీనగర్ డబ్లింగ్ పనులు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. రూ.3,796 కోట్ల విలువైన భద్రాచలం- కొవ్వూరు (119 కి.మీ.) కొత్త లైన్ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో వ్యయాన్ని పంచుకొనే పద్ధతిలో మంజూరు చేశామని, అందులో ఇప్పటి వరకు భద్రాచలం- సత్తుపల్లి (56 కి.మీ.) మధ్య లైన్ నిర్మాణం పూర్తి అవుతుందని వివరించారు. గుంటూరు డివిజన్‌లో రవాణా సౌకర్యాలను సులభతరం చేయడానికి గుంటూరు- గుంతకల్లు (401 కి.మీ.), గుంటూరు- బీబీనగర్ (239 కి.మీ.) డబ్లింగ్ పనులు, గుంటూరు యార్డ్‌కు మల్టీ ట్రాకింగ్, ఎర్రుపాలెం- అమరావతి-నంబూరు మధ్య 57 కిలో మీటర్ల పొడవైన కొత్తలైన్ల నిర్మాణ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు.

# కేంద్ర పురావస్తు శాఖలో పనిచేస్తున్న రోజువారీ వేతన కార్మికుల వేతనాల నిలిపివేతపై కీలక పరిణామాలు

**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:**కేంద్ర పురావస్తు శాఖలో పనిచేస్తున్న రోజువారీ వేతన కార్మికుల వేతనాల నిలిపివేతపై కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ అంశంపై సహాయ కార్మిక కమిషనర్ (సెంట్రల్) రవీంద్ర కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశానికి కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ యాజమాన్యం ప్రతినిధులు ఎం.సాంబ శివ కుమార్, డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజికల్ ఇంజనీర్, ఎన్.ప్రసన్న కుమార్, అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్. అమరావతి సర్కిల్‌లోని అన్ని సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు, కార్మిక సంఘ ప్రతినిధులు అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, అమరావతి సర్కిల్ కేంద్ర పురావస్తు శాఖ క్యాజువల్ లేబర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి వెంకటరత్నం, ఉపాధ్యక్షులు గజ్జలయ్య, చూడామణి, అమృత్, భార్గవ్, ధర్మారావు, వీరేంద్ర,రమేష్,ప్రసాద్, యూనియన్ సభ్యులు హాజరయ్యారు. యాజమాన్య తరపున సహాయక సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ ఎన్. ప్రసన్న కుమార్ హాజరై, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజువారీ వేతన కార్మికుల సేవలను కొనసాగించలేమని స్పష్టం చేశారు. డైరెక్టర్ జనరల్, ఏఎస్ఐ, న్యూఢిల్లీ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, జనరల్ ఫైనాన్షియల్ రూల్స్-2017కు అనుగుణంగా ఇకపై మానవ వనరుల నియామకాలు పూర్తిగా అవుట్‌సోర్సింగ్ విధానంలోనే జరగాలని తెలిపారు. ఈ కారణంగానే అమరావతి సర్కిల్ పరిధిలోని రోజువారీ వేతన కార్మికుల నియామకాలను 2025 ఏప్రిల్ 1 నుంచి నిలిపివేశామని వివరించారు. అయితే కార్మిక సంఘం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. 150 మంది కార్మికులు పదేళ్లకు పైగా నిరంతర సేవలు అందించినప్పటికీ, వారి వేతనాలను అకస్మాత్తుగా నిలిపివేయడం అన్యాయమని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. వెంటనే కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకొని, బకాయి వేతనాలు మరియు అన్ని సేవా ప్రయోజనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సెంట్రల్ రవీంద్ర కార్మికుల వేతనాలు నిలిపివేయడానికి ఆదేశాలు జారీ చేసిన పీఏఓ, హైదరాబాద్, కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ ను సమావేశానికి రావాలని వచ్చేటప్పుడు స్పష్టమైన వివరణ తీసుకురావాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే 1/30వ స్థితి మంజూరు చేసిన కార్మికుల ఉత్తర్వులు, సంబంధిత జాబితాను తదుపరి సమావేశానికి సమర్పించాలని సూచించారు. ఈ వివాదాన్ని సఖ్యతతో పరిష్కరించేందుకు,

ఇరు పక్షాల మధ్య చర్చలు కొనసాగించాలని నిర్ణయించారు. తదుపరి సమావేశాన్ని ఫిబ్రవరి 12న ఉదయం 11:30 గంటలకు విజయవాడలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) కార్యాలయంలో నిర్వహించనున్నారు.

# నందిగామ ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యాన్నదానం

**విజయవాడ.ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడ- హైదారాబాద్ నడుమ 65వ జాతీయ రహదారికి సమీపంలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రభుత్వ ఆస్పత్రిలో సద్గురు శ్రీ బోదానంధ స్వామి ఆశ్రమం ఆద్వర్యంలో గత మూడు నెలలు నుండి నిర్వహిస్తున్న నిత్య అన్నదానం అందిస్తున్నారు, దాదాపు ఏపీ,టీజీ రాష్ట్రాల గ్రామీణులు ఆస్పత్రికి వందల సంఖ్యలో వైద్యసేవల కోసం వస్తారు.ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుండి వైద్యసేవలకు వచ్చేవారికి ఈ కార్యక్రమంలో మంచి సదుపాయంగా ఉంది.గురువారం పెద్ద ఎత్తున ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ కమిటీ చైర్మన్ బొగ్గవరపు రామకృష్ణ, కార్యదర్శి ఆత్మకూరు రమేష్, ఉపాధ్యక్షులు బుజ్జి, రాధాకృష్ణ, జనార్ధన్ తదితరులు నిత్యము రోగులకు, స్థానికులకు, దూర ప్రాంతాల నుండి రోగుల బంధువులకు ఉచితంగానే అన్నదానం నిర్వహిస్తున్నారు. ఎపి ప్రభుత్వ విప్, నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య, నందిగామ ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా సత్య నారాయణ పర్యవేక్షణలో ప్రతి రోజు నిత్య అన్నదానం చేస్తుండటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కమిటీ సభ్యులు, ఆశ్రమ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజలకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

# ఉద్యోగుల సమస్య పరిష్కారానికి'బాకీకి భూమి' అమలు చేయండి

### వేతన సవరణ, 4విడతల డిఎల బకాయిలపై శాసనససభలో ప్రస్తావించండి ఎమ్మెల్యేబొజ్జల సుధీర్‌రెడ్డికి ఉద్యోగ సంఘాల వినతి



ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డికి విన్నవిస్తున్న ఉద్యోగ సంఘాలు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 2 సంవత్సరాలు కావస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై స్పందన లేదని త్వరలో జరగబోవు శాసనసభ సమావేశాల్లో చర్చించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు గురువారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతిజిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మిలకు విన్నవించారు. ఆర్థిక భారం నుంచి ప్రభుత్వం బయటపడటానికి పరిష్కారంగ 'బాకీకి భూమి'ని అందించాలని ఓ ప్రతిపాదనను ప్రజా ప్రతినిధులకు విన్నవించారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు వారి సమస్యలను వివరిస్తూ ఉద్యోగ,ఉపాధ్యా,పెన్షనర్లకు హక్కుగా సంక్రమించి వి విధ రకాల ఆర్థిక ప్రయోజనాలు సుమారు రూ.35 వేల కోట్లకు సంబంధించి పెండింగ్‌లో ఉందని వివరించారు. ఇక వేతన సవరణ, 4విడతల డిఏ బకాయి.సరెండర్ లీవ్ వెరసి వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు.ప్రభుత్వానికి ఆసాధ్యంగా మారిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పరిష్కార మార్గంగా 'బాకీకి భూమి' అనే ప్రతిపాదనను శాసనసభలో చర్చించాలన్నారు.ఇటు 'రండీ-టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం ద్వారా చర్చలు జరుగుతున్నాయని నాయకకుల దృష్టికి తెచ్చారు.ఈ పరిస్థితుల్లో ఉద్యోగ,ఉపాధ్యాయ పెన్షనర్లకు తీవ్ర గందరగోళం, అయోమయ పరిస్థితి నెలకొందని తమ బాధలను మొరబెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన బకాయిలు,ఇంకనూ మంజూరు కావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, వేతన సవరణ కమిషన్‌ను ముగ్గురు సభ్యుల కమిటిగా ఏర్పాటు చేయాలని కోరారు. మధ్యంతర భృతి తదితర అర్థికపరమైన అంశాలలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టే రాష్ట్రబడ్జెట్‌లో తగిన కేటాయింపులు ప్రతిపాదించాలని అభ్యర్థించారు. సిపిఎస్ రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలలన్న ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. తెలుగుదేశం, జనసేన రాజకీయ పార్టీల ఉమ్మడి ఎన్నికల మెనిఫేస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్,జిపిఎస్ విధానాలను పున: సమీక్షించి ఏడాది లోగా ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపించుటకు శాసనసభలో ప్రస్తావించాలని కోరారు.ఈ బడ్జెట్ సమావేశంలోనే ప్రభుత్వం తన విధానాన్ని,నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘాల అభ్యర్థనను తాను తప్పక శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తానని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు.

# అధిక ధరలు - అక్రమ బెల్టుషాపులు

## ఎం ఆర్ పి పై పది అదనం, చోద్యం చూస్తున్న అధికారులు

**గరివిడి (విజయనగరం జిల్లా ) ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** మద్యం దుకాణాల్లో అధిక ధరలు, ఆపై అక్రమ బెల్టు షాపులు నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. అడుగడుగునా బెల్టు షాపులు, సందు సందుల్లో అక్రమ మద్యం దుకాణాలు సాక్షాత్కరిస్తూనే ఉన్నాయి. లైసెన్సెడ్ షాపులు కంటే అధిక ధరలుకి మద్యం అమ్మకాలు ఆయా బెల్టు షాపుల్లో సాగుతున్నాయన్న ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. యథేచ్ఛగా మద్యం షాపుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం పై అనేకఅనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బాటిల్ పై ఎం ఆర్ పి కంటే పది రూపాయలు అదనంగా అమ్మకాలు సాగిస్తున్నా అధికారులు కిమ్మనక పోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేతల అండదండలు, ఆమ్యామ్యాలకు అలవాటు పడి అధికారులు బెల్టు షాపులు నియంత్రిం చేందుకు ముందుకు వెళ్లడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని చోట్లా బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తునే ఉన్నాయి. మద్యం షాపుల నుండే మద్యం ఆయా బెల్టుషాపులు కి యథేచ్ఛగా రవాణా జరుగుతున్నప్పటికి సంబంధిత అధికారులు మిన్నకుండి పోతుండటంతో అధికారులు, షాపు యజమానులు ఒక్కటై ఈ అక్రమానికి పాల్పడు తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. .కాసులకు కక్కుర్తి పడి అధికారులు మౌనం వహిస్తున్నారని ఆక్షేపణలు ప్రజల నుండి బలంగా వినిపిస్తున్నాయి. అన్ని ప్రాంతాల్లోనూ, ఆయా షాపు యజమానులు తమకు అనుకున్నంత వ్యాపారం జరగడం కోసం బెల్టుషాపులు కి మద్యం అమ్మకాలు చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే షాపుల నిర్వహణ భారం పెరిగిందని, నష్టాల్లో షాపుల నడుస్తున్నాయని, లాభాల కోసం ఎం ఆర్ పి కంటే కొంత పెంచక తప్పదని షాపు యజమానులుపేర్కొంటూ అధిక ధరలకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని సిబ్బంది పేర్కొంటున్నారు. మద్యం షాపు యజమానులు అంతా సిండికేట్ గా ఏర్పడి అన్ని షాపుల్లో ను ఒకే మద్యం పాలసీ నడిపిస్తూ మద్యం ప్రియులను పిండేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని చోట్లా ఇదే విధానం ,అవే అదనపు ధరలు, అనుమతులు లేని బెల్టుషాపులు నిర్వహణ నిత్యకృత్యమైందన్నది జగద్విదితం. ఆయా బెల్టుషాపుల్లో అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేయడం తో పేద మద్యం వ్యసనపరుల నుండి పైసలు గుంజే ప్రయత్నం జరుగుతుందని చెప్పక తప్పదు. అక్రమ బెల్టు షాపులు నిర్వహిస్తే సహించేది లేదు, అటువంటి వారిపై చర్యలు తప్పవు, లైసెన్స్ రద్దు చేస్తామనే నేతలు ప్రకటనలు వట్టి బూటకమన్నది క్షేత్ర స్థాయిలో పరిస్థితి చూస్తే ఇట్టే ద్యోతకమవుతోంది. అలాగే మద్యం బాటిల్ పై ఉన్న ధరలు కంటే పది రూపాయలు అధిక ధరలకు మద్యం అమ్మకాలు నిరాటంకంగా జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోక పోవడం గర్హనీయం. ఎం ఆర్ .పి ధరలకు మద్యం అమ్మకాలు జరపాలన్న నిబంధన తుంగ లోకి తొక్కినా అధికారులు కిమ్మనక పోవడం లో ఆంతర్యమేమిటో అని మద్యం ప్రియులనుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్టు షాపులు నియంత్రణ కు ప్రయత్నిస్తారని ,ఎం ఆర్ పి ధరలకు మద్యం అమ్మకాలు జరిపిస్తారని మద్యం కొనుగోలు దారులు ఆశిస్తూ ఉన్నారు.



# అవిలాల చెరువును తిరుపతి ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతాం!

### - భూగర్భ జలాల పెంపు - ఉపాధి అవకాశం

### - తుడ ఛైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ మండలంలోని అవిలాల చెరువును హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో తిరుపతి ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని తుడ ఛైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా అవిలాల చెఱువును తిరుపతి ట్యాంక్‌బండ్ తరహాలో తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. గురువారం తుడ వైస్ ఛైర్మెన్ ఆర్.గోవిందరావుతో కలిసి అవిలాల చెఱువును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తుడ ఛైర్మెన్ మాట్లాడుతూ తిరుపతిని కేవలం స్మార్ట్‌సిటీగానే కాకుండా ఆహ్లాదకరమైన, పర్యావరణహిత నగరంగా అభివృద్ధి చేయడమే కూటమి ధ్యేయమన్నారు. అవిలాల చెఱువు అభివృద్ధి తుడ చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులలో ఒకటని పేర్కొన్నారు. పేరూరు చెఱువు నుండి సప్లై ఛానల్స్ ద్వారా మంచినీటిని అవిలాల చెఱువుకు అనుసంధానించే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవిలాల చెఱువు చుట్టూ రివిట్‌మెంట్ బండ్ (గట్టు) బలోపేతం, సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు వంటి కీలక పనులను పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించేలా చెఱువును పరిసరాల్లో భారీగా మొక్కలు నాటి గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయాలని సూచించారు. పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, ప్రజల ఆరోగ్యానికి దోహదపడేలా ఓపెన్ జిమ్ ఏర్పాటుపై చర్చించారు. చెఱువులోకి మురుగునీరు రాకుండా డైవర్షన్ ఛానల్ నిర్మాణం చేపట్టాలని, రాత్రివేళ సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సోలార్ విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవిలాల చెఱువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే దాదాపు 1000మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఛైర్మెన్ ఆశాభావం వ్యక్తం చేశారు. తుడ వైస్ ఛైర్మెన్ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ అవిలాల చెఱువు అభివృద్ధి పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నీటి కాలుష్యం జరగకుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. భవిష్యత్‌లో చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించే దిశగా కూడా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతిరూరల్ తహశీల్దార్ జనార్ధన్‌రాజు, తుడ ఎస్.ఇ. రవీంద్రయ్య, హార్టికల్చర్ అధికారి మాలతి, ఎంపిడిఓ దయాసాగర్, సర్వేయర్లు పాల్గొన్నారు.



రాజధానిలో నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

## రాజధానిలో పలు ప్రాజెక్ట్‌ల నిర్మాణాలు పరిశీలించిన మంత్రి నారాయణ

**విజయవాడ ఫిబ్రవరి5 ప్రభాతవార్త ప్రతినిధి:** సీడ్ యాక్సిస్ రోడ్డును ఓల్డ్ హైవేకు కలిపే స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి. గుంటూరు ఛానల్‌పై సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానించే బ్రిడ్జి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు బ్రిడ్జిల పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించించారు. ఇప్పటికే వెస్ట్ బైపాస్ పై ఒకవైపు వాహనాలకు అనుమతిచ్చినట్లు ఎన్ హెచ్ అధికారులు ఆయనకు వివరించారు.

# కాణిపాకంలో ఘనంగా సంకటహార గణపతివ్రతం

**కాణిపాకం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహార గణపతివ్రతంను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో బుధవారం చతుర్థి వ్రతంను ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు దఫాలుగా అర్చకులు నిర్వహించారు. గత నెల వరకు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా వ్రతంను నిర్వహిస్తుండేవారు. అయితే ఈవ్రతంకు భక్తుల నుండి విశేష స్పందన లభించడంతో ఉదయం 9, 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వ్రతాన్ని నిర్వహించాలన్న పాలకమండలి నిర్ణయం మేరకు బుధవారం మూడు దఫాలుగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వేదపండితులు సంకష్ట చతుర్థి వ్రతం మహాత్యాన్ని గురి ంచి వివరించారు. ఈవ్రతంను ఆచరించడం వల్ల భక్తులకు ఈతిబాధలు, కష్టాలు తొలగి అనుకున్న కోరికలు నెరవేరి అంతా శుభం కలుగుతుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయని వేదపండితులు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహార చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈఓ పెంచల కిషోర్ ఏఈఓ రవీంద్రబాబు, చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజీనాయుడు, రవి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# దళిత యువకుడి మృతిపై న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి తండ్రి ఆత్మహత్యాయత్నం

## - సుమంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్

**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ దళిత యువకుడి మృతిపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి తండ్రి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సదకుప్పం గ్రామ సమీపంలోని ఓ మామిడితోటలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మనోజ్(24) మృతి చెందడంతో ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబసభ్యులు దళితులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట మధ్యాహ్నం నుండి రాత్రి వరకు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుడి తండ్రి సుబ్రమణ్యం ఓ దశలో న్యాయం కోసం ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించాడు. సత్వరం స్పందించిన కుటుంబసభ్యులు, పోలీసులు ఆత్మహత్యాయత్నంను అడ్డుకున్నారు. ఈ సంఘటనపై భారీ ఎత్తున పోలీసులు మోహరించి ఆందోళనకారులను నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం శూన్యం అయ్యింది. అధిక సంఖ్యలో దళితులు, మృతుడి బంధువులు, సన్నిహితులు పోలీస్ స్టేషన్‌పైకి దూసుకురావడానికి ప్రయత్నించారు. మృతుడి బంధువులకు నచ్చజెప్పడానికి మండల టిడిపి నాయకులు ప్రయత్నించినా ఫలించలేదు. వివరాలిలా వున్నాయి. సదకుప్పం గ్రామానికి చెందిన సుమంత్‌రెడ్డి తన ట్రాక్టర్ ద్వారా మామిడి తోటకు పురుగుల మందు కూలీలతో పిచికారి చేయించేవాడు. బుధవారం పురుగుల మందు పిచికారి చేయడానికి సదకుప్పం దళితవాడకు చెందిన మనోజ్, జానకిరామ్, రామ్‌చరణ్, రాజాసింహాలను కూలీలుగా తీసుకెళ్ళాడు. మధ్యాహ్నం వరకు మామిడ తోటలో మందు పిచికారి చేసిన కూలీలు భోజనం కోసం ఇంటికి వెళ్ళారు. తిరిగి మందు పిచికారి చేయడానికి తోటలోకి రాగా మనోజ్‌పై జానకిరామ్, రామ్‌చరణ్, రాజసింహాలు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను చికిత్స నిమిత్తం అరగొంగ అపోలో ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందాడు. ఘర్షణ పడిన విషయంను సుమంత్‌రెడ్డి మనోజ్ తల్లిదండ్రులకు తెలియపరచగా మీ పిల్లవాడు మూర్ఛతో కింద పడ్డాడని చెప్పాడు. మీ మనోజ్‌కు ఎలాంటి అపాయం లేదని కుటుంబసభ్యులకు సుమంత్‌రెడ్డి ఫోన్ ద్వారా తెలిపాడు. చివరికి కూలీలు ఘర్షణ పడటంతోనే మనోజ్ మృతి చెందాడు. ఈ విషయంను తమకు తెలియపరచకుండా మూర్ఛ వచ్చిందని సుమంత్ అపద్ధం చెప్పాడని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులు సుమంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మృతుడి కుటుంబీకులు పట్టువీడకుండా రోడ్డుపైనే బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఒక దశలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలిసిన వెంటనే పలమనేరు డిఎస్పీ దేగల ప్రభాకర్ పోలీస్ స్టేషన్ చేరుకుని మృతుడి కుటుంబీకులు, ఆందోళన కారులతో చర్చించారు. మీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ వారు పట్టించుకోలేదు.

# తక్కువ ధరకు బంగారమంటూ ఆశ చూపించి. తెలివిగా రూ.20.25 లక్షలు రాబట్టుకుని ఉడాయించిన కేటుగాళ్లు

**విజయవాడ.ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** బంగారం ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారిని అతి తక్కువ ధరకు తమ వద్ద బంగారు ఇస్తామని నమ్మించి మోసగించి ముందస్తుగానే డబ్బు తెప్పించి కొందరు ప్రబుద్ధులు ఉడాయిస్తున్నారు. తమ దగ్గర బంగారు నాణేలు ఉన్నాయని నమ్మించి వాటిని ఇస్తామని చెప్పి రూ.20.25 లక్షల వరకు కొట్టేసిన ఘటన కృష్ణాజిల్లా పెనమలూరు శివారులో చోటు చేసుకుంది. పెనమలూరు నియోజకవర్గంలో తక్కువ ధరకు బంగారు నాణేలు అంటూ ఆశచూపి 20.25 లక్షలకు కేటుగాళ్లు టోకరా వేశారు. ప్రస్తుతం ఈ బంగారు నాణాల బురిడీ వ్యవహారం నరసరావుపేటలో హాట్ టాపిక్ గా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నరసరావుపేటకు చెందిన తిరుపతిరెడ్డి విజయవాడలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. పెనమలూరులో తనకు తెలిసిన వ్యక్తి వద్ద బిల్లులు లేని బంగారు నాణేలు ఉన్నాయని తిరుపతిరెడ్డికి బంధువు నరసింహా రెడ్డి తెలిపాడు. అవి అతనికి ఇస్తానని పేర్కొంటూ శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తిని తిరుపతిరెడ్డికి నరసింహా రెడ్డి పరిచయం చేశాడు. అలా శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డికి పరిచయమయ్యాడు. తరువాత వీడియో కాల్ ద్వారా సదరు వ్యక్తిని బాధితుడు తిరుపతిరెడ్డి సంప్రదించారు. వీడియో కాల్ చేయగా అతని వద్ద ఉన్న కొన్ని బంగారు నాణేలను ఆయన చూపించాడు. దీంతో అవి కొనుగోలు చేసేందుకు తిరుపతిరెడ్డి అంగీకరించారు. దాదాపు 20 గ్రాములున్న 17 నాణేలు రూ.37.40 లక్షల వరకు ఉంటాయని శ్రీనివాసరెడ్డి తెలిపాడు. తన వద్ద రూ. 20.50లక్షలు మాత్రమే ఉన్నట్లు తిరుపతిరెడ్డి, అతడి బంధువు మల్లారెడ్డి చెప్పారు. నగదు తీసుకుని పెనమలూరు శివారు గంగూరులో ఉన్న డీమార్ట్ వద్దకు రమ్మని, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డికి కేటుగాళ్లు సూచించారు. వారు చెప్పిన విధంగానే ఈనెల 2వ తేదీన రూ. 20.50 లక్షల నగదు తీసుకుని పెనమలూరు డిమార్ట్ వద్దకు బాధితులు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి ఆ ప్రాంతానికి వచ్చి రోడ్డు అవతల వైపు ఉన్న కారులో నాణేలు ఉన్నాయని చెప్పాడు. నగదు బ్యాగ్ తనకు ఇచ్చి కారు వద్దకు వెళ్లాలని ఆ వ్యక్తి తిరుపతిరెడ్డి, మల్లారెడ్డికి సూచించాడు. బ్యాగ్ ఇచ్చిన అనంతరం తిరుపతిరెడ్డి కారు ఎక్కేలోపే శ్రీనివాసరెడ్డితో పాటు మరో వ్యక్తి ఒక్కసారిగా అక్కడినుంచి చాకచక్యంగా వెళ్ళిపోయారు. ఈ క్రమంలో తిరుపతిరెడ్డి కారు డోర్‌ను గట్టిగా పట్టుకోవడంతో ఆయనకు గాయాలయ్యాయి. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# శాస్త్రోక్తంగా సంకష్టహార చతుర్థి పూజలు

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ అమ్మవారి ఆలయంలో గురువారం సంకటహార చతుర్థి సందర్భంగా శ్రీ గణేష్ మహారాజ్‌కి ఆగమ శాస్త్రానుసారం గణపతి హోమం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. దేవస్థానం వైదికకమిటీ సభ్యులు పూజల అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు.

- నిత్యాన్నదాన పథక విరాళాలు :

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ వారికి నిత్య అన్నదాన పథకం నిమిత్తం విజయవాడ వాస్తవ్యులు వై వెంకటస్వామి, శ్రీలక్ష్మి ్మ, యోషిత్ కుటుంబ సభ్యులు రు.1,00,116 విరాళం, పెనమలూరుకు చెందిన శ్రీలక్ష్మి ్మ నిత్య అన్నదాన పథకం నిమిత్తం రూ. 1,01,116విరాళం, ఏలూరు నివాసి ఇ గణేష్ మరియు కుటుంబ సభ్యులు నిత్య అన్నదాన పథకానికి రూ. 1లక్షవిరాళం అందించారు.

- దుర్గమ్మ సేవలో నీతి అయోగ్ సిఈవో ::-

నీతి ఆయోగ్ సీఈఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను గురువారం దర్శించుకున్నారు. ఆయన వెంట ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మీ ్మ షా ఉన్నారు.

నీతి అయోగ్ సిఈవోకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



నీతి అయోగ్ సిఈవోకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

# దేశంలోని పునరుత్పాదక ఇంధన శక్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

### - ప్రధానంగా ప్రైవేట్ రంగంలో 2035 నాటికి 5-6 లక్షల కొత్త ఉద్యోగాల సృష్టి లక్ష్యం

### - ప్రతి వినియోగదారునికి చవకైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా

#### - దేశంలోని టాప్ 3 పునరుత్పాదక ఇంధన కేంద్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ : ఆయోగ్ సిఇఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం

**విజయవాడ ,ఫిబ్రవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోని టాప్ 3 పునరుత్పాదక ఇంధన కేంద్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం చెందనుంది. నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ని గురువారం ఎపి సచివాలయంలో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన ఎర్నర్జీ ట్రాన్సిషన్ బ్లూప్రింట్ ముసాయిదాను అందజేశారు. ఈ బ్లూప్రింట్ ద్వారా రాష్ట్రాన్ని భారతదేశంలోని ప్రధాన మూడు పునరుత్పాదక ఇంధన కేంద్రాలలో ఒకటిగా అభివృద్ధి చేయడానికి స్పష్టమైన దిశానిర్దేశాన్ని నితి ఆయోగ్ రూపొందించింది. రాష్ట్రంలోని వినియోగదారులందరికీ విశ్వసనీయమైన, చవకైన, శుభ్రమైన విద్యుత్ అందించడమే దీని ప్రధాన లక్ష ్యం. ఈ వేదిక కింద, నితి ఆయోగ్‌తో భాగస్వామ్యంగా రూపుదిద్దుకుంది. ఇది "స్వర్ణ ఆంధ్ర విజన్" మరియు దీర్ఘకాలిక పారిశ్రామిక అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా, 2035 నాటికి రాష్ట్ర విద్యుత్ రంగాన్ని సుస్థిరత, సమర్థత, మరియు శుభ్రమైన ఇంధన వినియోగ దిశగా మారుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 47 శాతం పునరుత్పాదక ఇంధనాల నుంచే వస్తోంది. 2035 నాటికి రాష్ట్ర అవసరాల కోసం 35 జిగావాట్ సోలార్, 12 జిగావాట్ విండ్, 55-60 గిగావాట్ అవర్ ఎనర్జీ స్టోరేజ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలో పేర్కొనబడింది. అదనంగా, దేశవ్యాప్త ఎగుమతుల కోసం 30 జిగావాట్ సోలార్, 25-30 జిగావాట్ విండ్, 10-12 జిగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు ప్రతిపాదించబడ్డాయి. నితి ఆయోగ్ అంచనా ప్రకారం, 2035 నాటికి విద్యుత్ కొనుగోలు ఖర్చు యూనిట్‌కు రూ. 3.90-4.00 వరకు తగ్గే అవకాశం ఉంది. సరఫరా వ్యయాన్ని యూనిట్‌కు రూ. 6.00 లోపుగా తగ్గించడం లక్ష ్యంగా పెట్టుకున్నారు. దీని వల్ల గృహ వినియోగదారులు, రైతులు, మరియు పరిశ్రమలు గణనీయంగా లబ్ధి పొందుతాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర ఎర్నర్జీ ట్రాన్సిషన్ కోసం రూ. 3.30-3.40 లక్షల కోట్లు పెట్టుబడి అవసరం కాగా, అదనంగా దేశవ్యాప్త పునరుత్పాదక ఇంధన ఎగుమతి హబ్ నిర్మాణానికి రూ. 4.00-4.20 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ పెట్టుబడుల్లో 90 శాతం ప్రైవేట్ రంగం నుండే వచ్చే అవకాశం ఉండగా, వీటి ద్వారా రాష్ట్రంలోనే 5-6 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా. మౌలిక వసతుల అభివృద్ధి మరియు రంగ సంస్కరణల భాగంగా, ట్రాన్స్మిషన్ రంగంలో 2035 నాటికి రూ. 65,000-70,000 కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించబడ్డాయి. గ్రీన్ ఎనర్జీ కారిడార్, బి.ఓ సబ్‌స్టేషన్లు, బీజుదీది కారిడార్‌లు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించి ట్రాన్స్మిషన్ నెట్వర్కును ఆధునికీకరించనున్నారు. అలాగే, డిస్ట్రిబ్యూషన్ రంగంలో రూ. 40,000 కోట్ల పెట్టుబడితో నెట్వర్కులను బలోపేతం చేయడం, నష్టాలను తగ్గించడం, సరఫరా విశ్వసనీయతను మెరుగుపరచడం, మరియు లాభదాయకత వైపు మార్పులు తీసుకురావడం లక్ష ్యంగా పెట్టుకున్నారు. రైతు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ ప్రాజెక్టులను విస్తరించడం ద్వారా పగటి వేళల్లో స్థిరమైన విద్యుత్ సరఫరా కల్పించి, సబ్సిడీ భారాన్ని తగ్గించడమే ఉద్దేశ్యం.



ఏపీ సీఎస్ కె.విజయానంద్, నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం

ఈ బ్లూప్రింట్ మార్చి 2026 ప్రారంభంలో తుది రూపం దాల్చి, నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని కేంద్ర స్టీరింగ్ కమిటీకి సమర్పించబడుతుంది. మార్చి మధ్య నాటికి అమలు ప్రారంభమవుతుందని, అమలును పర్యవేక్షి ంచడానికి ప్రత్యేక ఎర్నర్జీ వార్ రూమ్ ఏర్పాటు చేయబడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమ పురోగతిని అంచనా వేసేందుకు ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించబడతాయి.

నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో విద్యుత్ మంత్రిత్వ శాఖ మరియు నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖల భాగస్వామ్యంతో ప్రారంభించబడిన జాతీయ కార్యక్రమం. రాష్ట్రాలకు శుభ్రమైన ఇంధన మార్పు ప్రణాళికలను రూపొందించడం, వాటి అమలుకు మద్దతు ఇవ్వడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

### ఆలిండియా జాక్టో అధ్వర్యంలో టెట్ మినహాయింపు కోసం

# జంతర్ మంతర్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

### సంఘీభావం తెలిపిన ఎంపిలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు గురు వారం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర భారీ ధర్నాను చేపట్టారు. ధర్నాకు పార్లమెంటు సభ్యులు సైతం సంఘీభావం ప్రకటించారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టెట్ రాయాలని సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు నెలకొన్న ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, విద్యా హక్కు చట్టం-2010 లోని సెక్షన్ 23 సవరించాలని కోరుతూ ఆల్ ఇండియా జాక్టో పక్షాన దశల వారి ఆందోళన కార్యక్రమంలో భాగంగా గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు ధర్నాకు ఆల్ ఇండియా జాక్ స్టీరింగ్ కమిటీ సభ్యులు సిఎన్ భార్తి, చావరవి, కత్తి నరసింహారెడ్డి, సదానంద గౌడ్‌లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.




ధర్నాకి వేలాది మంది ఉపాధ్యాయుల నినాదాలతో జంతర్ మంతర్ హోరెత్తింది. ఈ ధర్నా శిబిరానికి కేరళ రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు జాన్ బ్రిటీష్, శివ దాసన్, తమిళనాడు నుండి సెల్వరాజ్, కర్ణాటక నుండి కుమార్ నాయక్, బీహార్ నుండి రాజారామ్ సింగ్, సిపిఐ నాయకులు కె నారాయణ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయ కులు బి. వెంకట్, ప్రపంచ ఉపాధ్యాయ సమాఖ్య అధ్యక్షుడు అమియ కుమార్‌తోపాటు వివిధ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సీనియర్ ఉపాధ్యాయులను పరీక్షల పేరుతో ఆందోళన గురి చేయడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అమలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని చట్టాన్ని సవరిం చాలని, అందుకోసం పార్ల మెంటులో ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతామని భరోసాను ఇచ్చారు.

# రాష్ట్రంలో పెరగనున్న భూముల ధరలు!

### రిజిస్ట్రేషన్ల అధికారులు అధ్యయనం

### సమీకృత రిజిస్ట్రారు కార్యాలయాలు

### రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూముల ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. భూముల మార్కెట్ విలువ సవరణపై అధ్యయనం చేసేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గత యేడాది హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ప్రాంతంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూముల విలువ సవరణపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత తెలంగాణ వ్యాప్తంగా సవరణ చేపట్టాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ మేరకు భూముల మార్కెట్ పెంపుపై ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఆమోదం మాత్రం రాలేదు. ఈ క్రమంలో ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వం పలు మార్పులు చేపట్టింది. జీహెచ్ఎంసీ కోర్ అర్బన్ ప్రాంతాన్ని 12 జోన్లుగా విభజించింది. వాటిలో 60 సర్కిళ్లు, 300 డివిజన్లు ఏర్పాటు చేసింది. ఈ మార్పులను అనుసరించి ఆయా సర్కిళ్ల వారీగా భూముల వాస్తవిక విలువపై ఒక నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించినట్లు తెలిసింది. మరోవైపు రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి చాలాకాలంగా ఎలాంటి మార్పులు చేపట్టలేదు. ప్రస్తుతం కోర్ అర్బన్ మార్పుల కార ణంగా వీటికి సంబంధించి కూడా సంస్కరణలు చేపట్టే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. రాబడి అధికంగా ఉండే ప్రాంతాలను కలుపుతూ కొత్తగా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటుచేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇక రాష్ట్ర సర్కార్ రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకతను పెంచడానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం.



## తార్నాక ఆర్‌టిసి ఆస్పత్రికి ఎన్‌ఎబిహెచ్ ఎంట్రీలెవెల్ గుర్తింపు

### వైద్యసేవా ప్రమాణాల మెరుగుదలకు మరింత కృషి: సంస్థ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** తార్నాకలో ఉన్న ఆర్‌టిసి ఆసుపత్రి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఎబిహెచ్) గుర్తింపు పొందింది. నాణ్యమైన వైద్య సేవలు, రోగి ఆరోగ్య భద్రతను నిర్ధారించే దిశగా ఆసుపత్రి చేస్తున్న నిరంతర కృషికి ఇదొక మైలురాయిగా నిలువనుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆసుపత్రిలో మెరుగైన మౌలిక సదుపాయాల, వైద్య సేవల బలోపేతం, సేవా ప్రమాణాల మెరుగుదల కోసం కృషి చేస్తోంది. అధునాతన అత్యవసర, క్రిటికల్ కేర్ సేవలు, మాడ్యులర్ సూపర్ స్పెషాలిటీ ఆపరేషన్ థియేటర్లు, పూర్తిస్థాయి క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేసి వివిధ రకాల చికిత్స సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సదుపాయాలు రోగులకు సమయానుకూలంగా, సురక్షితంగా ప్రత్యేక వైద్య సేవలను అందించడానికి సహాయపడుతున్నాయి. ఆసుపత్రి విద్యా, శిక్షణ కార్యక్రమాలను కూడా విస్తరించింది. 100 సీట్ల బీఎస్సీ నర్సింగ్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, శస్త్రచికిత్స, ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్‌లో డీఎన్బీ పీజీ కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. ఆర్‌టిసి ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన సురక్షిత వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రి నిరంతరం కృషి చేస్తోంది. వైద్యుల సమష్టి కృషి, పట్టుదల, అత్యుత్తమైన ఆరోగ్య సేవల్ని సాధించాలనే అచంచలమైన సంకల్పానికి ఇది నిదర్శనం ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి అని కొనియాడారు. టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు, అర్హులైన వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన వైద్య సేవల్ని కొనసాగించాలని సూచించారు.ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎన్‌ఎబిహెచ్ సర్టిఫికేషన్ పొందడం చాలా సంతోషంగా ఉందని, ఇది అందరి కృషితోనే సాధ్యమైందని తార్నాక ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీమతి శైలజామూర్తి పేర్కొన్నారు. మెరుగైన వైద్య సేవలు, నాణ్యత ప్రమాణాలకు ఇది ఒక గుర్తింపుగా నిలుస్తుంద న్నారు. ఎంట్రీ లెవల్ సర్టిఫికేషన్ విశ్వసనీయతను పెంచుతుందని, అంత ర్గత ప్రక్రియలను బలోపేతం చేయాలన్నారు. తార్నాక ఆర్‌టిసి ఆసుపత్రికి ఎన్‌ఎబిహెచ్ గుర్తింపు వచ్చిన నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ అయిన డాక్టర్ శైలజ మూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పి శ్రీనివాస్ ఇతర వైద్య బృందాన్ని ఆర్‌టిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అభినందించారు.

## దేశంలోనే తొలిసారిగా ఫిష్ వ్యాక్సిన్

### ఒడిశాలో కొనసాగుతున్న పరిశోధనలు

### అక్కడ పర్యటిస్తున్న తెలంగాణ ప్రతినిధి బృందం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** దేశంలోనే తొలిసారిగా చేపల వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు జరుగుతున్నాయని ఐసీఏఆర్ సిఫా (ఐసీఏఆర్..సిఐఎఫ్ఏ) డైరెక్టర్ ప్రమోద్ కుమార్ సాహు వెల్లడించారు. ఒడిషా రాష్ట్ర పర్యటనలో భాగంగా తెలంగాణ మత్స్యశాఖ, ఎఫ్ఐబీ ప్రతినిధుల బృందం భువనేశ్వర్‌లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ అక్వాకల్చర్ (సిఐఎఫ్ఏ)ను గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ సాహు, సీనియర్ శాస్త్రవేత్తలు సంస్థ సాధించిన ప్రగతిని తెలంగాణ బృందానికి వివరించారు. చేపల పెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆర్ఎఫ్ఐడీ ట్యాగింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. దాదాపు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ సంస్థలో 7 రకాల ఆహారపు చేపలు, 7 రకాల అలంకరణ చేపలపై పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. కాగా.. కేంద్ర మత్స్య శాఖ సిఫాను ఫ్రెష్ వాటర్ అక్వాకల్చర్ స్పీషియస్ న్యూక్లియస్ బ్రీడింగ్ సెంటర్‌గా గుర్తించింది. ముఖ్యంగా రోహు, కాట్లా, కొర్రమీను, జీఐ స్కాంపి రకాల చేపలపై ప్రత్యేక దృష్టి సారించారు. తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ ఉన్న కొర్రమీను చేపపై జరుగుతున్న పరిశోధనలను డైరెక్టర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ పరిశోధనలకు ఆర్థిక చేయూతనిస్తోందని వివరించారు.

## పదోన్నతుల కోసం ఎంపిడిఓల ఎదురుచూపులు

### యేడాది క్రితమే సాధారణ పరిపాలన శాఖకు ఫైల్

### పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఫోకస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** చాలాకాలంగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ల ఎదురుచూపులు ఫలించడం లేదు. ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెడుతుందే కాని ముగించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 48 మంది సీనియర్ ఎంపీడీఓల జాబితాను పంచాయతీరాజ్‌శాఖ సిద్ధం చేసింది. పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే ఆ 48మంది ఎంపీడీవోలకు డిప్యూటీ సీఈఓలుగా పదోన్నతి రావాల్సి ఉంది. అదే విధంగా 10 మంది డిప్యూటీ సీఈవోలకు సీఈవోలుగా పదోన్నతి కల్పించాల్సి ఉంది. అయితే గత కొంత కాలంగా పదోన్నతుల కోసం ఎంపీడీవోలు ఎదురు చూడాల్సి వస్తోంది. 2019 నుంచి 2022 వరకు ఎంపీడీవోలకు పదోన్నతుల ప్రక్రియ కొనసాగింది. ఆ తర్వాత నుంచి ప్రమోషన్స్ ఊసేలేకుండా పోయిందని ఎంపీడీవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రమోషన్స్‌కు సంబంధించిన ఫైల్‌లో కదలిక వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలమేరకు ఉద్యోగుల వివరాలను పంచాయతీరాజ్‌శాఖ సిద్ధం చేసి నివేదికను సమర్పించింది. పంచాయతీరాజ్‌శాఖలో పనిచేస్తున్న ఎంపీడీఓల వివరాలను ప్రభుత్వానికి ఆ శాఖ అధికారులు అందజేశారు. ఆ సీనియర్ అధికారుల జాబితాను అందజేసి ఏడాది పూర్తవుతున్నా ఎలాంటిసానుకూల నిర్ణయం వెలువడడం లేదని ఎంపీడీవోలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# 17,18 తేదీల్లో హైదరాబాద్‌లో బయో-ఆసియా సదస్సు

### ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

### లైఫ్ సైన్సెస్, హెల్త్ టెక్నాలజీ, టెక్‌బయోపై నిపుణల చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 5:** ఆసియా ఖండంలోనే అత్యంత కీలకమైన లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్ టెక్నాలజీకి సంబంధించిన బయో-ఏసియా 2026 సదస్సు హైదరాబాద్‌లో జరగనుంది.ఈ బయో ఏసియా 23వ ఎడిషన్, రెండు రోజుల కార్యక్రమం ఫిబ్రవరి 17,18వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నది. ప్రపంచవ్యాప్తంగా బయోటెక్నాలజీ, ఔషధాలు, హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు, ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఈ బయో ఆసియా సదస్సును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, మంత్రి శ్రీధర్‌బాబుతో సంయుక్తంగా కలిసి ప్రారంభించనున్నారు.

'టెక్‌బయో అన్‌లీష్డ్: ఏఐ, ఆటోమేషన్ బయాలజీ రివల్యూషన్' అనే థీమ్ మీద సదస్సు జరగనున్నది. ఆధునిక సాంకేతికత వ్యవస్థ హెల్త్ ఇండస్ట్రీలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందనే అంశంపై కీలక చర్చలు ఈ సదస్సులో జరగనున్నాయి. అమ్జెన్, సానోఫీ, ఎలీ లిల్లీ, మిల్టెనీ బయోటెక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు.

బయో టెక్నాలజీ, ఔషధాలు, ఆరోగ్య సేవలు, మెడికల్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వంటి రంగాల మీద కీలకోపన్యాసం చేయనున్నారు. ఈ సదస్సులో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు ప్రొఫెసర్ బ్రూస్ ఎల్. లెవిన్, అమ్జెన్ సంస్థ సీఎస్‌వో డా.హోవర్డ్ వై. చాంగ్, జర్మనీకి చెందిన మిల్టెనీ బయోటెక్ వ్యవస్థాపకులు డా. స్టెఫాన్ మిల్టెనీ, సానోఫీ సంస్థ ఈవీపీ మాడలీన్ రోచ్ వంటి ప్రముఖులు కీలకంగా మాట్లాడనున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ కూడా హాజరుకానున్నారు.

భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారు(సైన్స్) ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డా.రాజీవ్ సింగ్ రఘువంశీ ఈ బయో ఆసియాలో ప్రసంగించనున్నారు. 'ఫార్మా బయోటెక్ భవిష్యత్తు' అంశంపై ఒక ప్రత్యేక సీఈఓ కాన్‌క్లేవ్ నిర్వహించనుండగా, అందులో డాక్టర్ రెడ్డీస్, జైడస్, బయోకాన్, సిప్లా వంటి భారతీయ ప్రముఖ సంస్థల సీఈఓలు పాల్గొననున్నారు. అలాగే నోవార్టిస్, రోష్, నోవో నార్డిస్క్, మెడ్ట్రానిక్, మెర్క్, ఆస్ట్రాజెనెకా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ప్యానల్ చర్చలు జరుగుతాయి.

ఈ చర్చల్లో ప్రధానంగా కొత్త తరహా బయోలాజిక్ ఔషధాలు, సెల్ జీన్ థెరపీలు, ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ వంటి అంశాలపై సమాలోచనలు జరపనున్నారు. బయోఏసియా 2026 ద్వారా హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో లైఫ్ సైన్సెస్, ఆరోగ్య రంగాల్లో ప్రముఖ కేంద్రంగా మరింత గుర్తింపు పొందనుంది. గత రెండు దశాబ్దాలుగా బయో ఏషియా ఆసియాలోనే ప్రముఖ లైఫ్ సైన్సెస్, బయోఫార్మా, హెల్త్‌టెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో ఆసియాలో అగ్రగామి వేదికగా ఎదిగింది. ప్రతి ఎడిషన్‌లో ప్రపంచ స్థాయి నాయకులు, పెట్టుబడిదారులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకు వస్తోంది. అత్యాధునిక శాస్త్రీయ ప్రగతిని పంచు కుంటున్నారు. ఈ థీమ్ ద్వారా బయాలజీ, డేటా, డీప్ టెక్నాలజీ కలయికతో ప్రపంచవ్యాప్తంగా ఔషధ ఆవిష్కరణలు, నిర్ధారణ పద్ధతులు, థెరపీ తయారీ, ఆరోగ్య సేవల అందజేతలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులను ప్రతిబింబిస్తుంది. టెక్‌బయో వల్ల వ్యాధులను అర్థం చేసుకునే విధానం, చికిత్సలను రూపకల్పన చేసే పద్ధతి, వైద్య సేవలను అందించే విధానం పూర్తిగా మార్పు చెందుతున్నది.

## ఫుట్‌బాల్ పోటీల నిర్వహణకు శ్రమిస్తోన్న వివిధ కమిటీలు

### పోలీసు అధికారులతో డిజిపి శివధర్‌రెడ్డి సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 5:** తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమివ్వనున్న '74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్' నిర్వహణపై రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి తన కార్యాలయంలో గురువారం సంబంధిత పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నేపథ్యంలో పోటీల నిర్వహణపై జరుగుతున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిజిపి మాట్లాడుతూ.. వచ్చే నెల మార్చి 23 నుంచి ఏప్రిల్ 5 వరకు హైదరాబాద్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుందని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర భద్రతా బలగాల నుంచి 53 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సుమారు 2100 మంది క్రీడాకారులు, అధికారులు భాగస్వాములు కాబోతున్నారని తెలియజేశారు. మార్చి 23న జట్లన్నీ నగరానికి చేరుకుంటాయని, మార్చి 25న మధ్యాహ్నం 3 గంటలకు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రారంభ వేడుకలు నిర్వహిస్తామని డిజిపి అన్నారు. ఈ పోటీల నిర్వహణ కోసం నగరం చుట్టుపక్క మైదానాలను తనిఖీ చేశామని, మైదానాలను కొన్ని మ్యాచ్‌ల కోసం, మిగిలిన మైదానాలను ప్రాక్టీస్ కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియం, తెలంగాణ పోలీస్ అకాడమీల వంటి మైదానాలలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. పోటీల నిర్వహణ కోసం వివిధ కమిటీలు పనిచేస్తున్నాయని, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వసతి, రవాణా సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాటు చేశామని డిజిపి పేర్కొన్నారు. ఏప్రిల్ 5న ఫైనల్ మ్యాచ్ అనంతరం ముగింపు వేడుకలను నిర్వహించ నున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడా కారులతో ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. గత సంవత్సరం 73వ బి.ఎన్ మల్లిక్ ఆల్ ఇండియా పోటీలను నిర్వహించిన త్రిపుర రాష్ట్రానికి వెళ్లి వచ్చిన పోలీస్ అధికారులతో సంబంధిత వివరాలను డిజిపి అడిగి తెలుసుకున్నారు.

ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే జట్లు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10 వరకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటాయని, దేశవ్యాప్త పోలీస్ బలగాల మధ్య క్రీడా స్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించేలా ఈ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని డిజిపి బి. శివధర్ రెడ్డి సంబంధిత పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ సిపి ఎం. రమేష్, హైదరాబాద్ అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, ఐజిపి, స్పోర్ట్స్ గజరావు భూపాల్ తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## పార్లమెంటు సమావేశాల్లోనే ఆర్‌టిఇ చట్టాన్ని సవరించాలి

### ఆర్‌యుపిపి టిఎస్ రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే విద్యా హక్కు చట్టం(ఆర్‌టిఈ) చట్టాన్ని సవరించాలని ఆర్‌యుపిపి టిఎస్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులుశానమోని నర్సిములు గురువారం అత్యవసర ఆన్‌లైన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ... రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా నిరంతరం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకి టెట్ మినహాయింపు కోరుతూ కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తులు చేసినట్టు తెలిపారు. ఏదైనా జీవో, చట్టం సాధారణంగా విడుదలైన తేదీ నుంచి అమలులో ఉంటుందనీ.. కానీ నేడు ఆర్‌టిఈ చట్టాన్ని సవరించి ఎప్పుడో 20, 30 ఏళ్ల క్రితం నియామకం కాబడిన ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలని ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు అసమంజసమన్నారు. రిటైర్మెంట్ కు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులు కూడా ఈ నిబంధన వల్ల మానసికంగా ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో అసమంజసమైన తీర్పును నిరసిస్తూ.. 2012 సంవత్సరానికి పూర్వమే నియామకం కాబడి ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలనే నిబంధనను నుండి మినహాయిస్తూ.. సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. దానికంటే ముందు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఆర్‌టిఈ చట్టాన్ని సవరించాలన్నారు. ఇదే అంశంపై ఈనెల 16న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు.

## విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి

### ఎంవిఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశానికి సిపిఎం మద్దతు

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యకు 20 శాతం నుండి 30శాతం నిధులు కేటాయించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10శాతం నిధులు కేటాయించి విద్యా రంగాన్ని కార్పొరేటీకరణ నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో నాణ్యమైన విద్యను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లను డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఎం.వి. ఫౌండేషన్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. సరైన నిధులు లేక మరుగుదొడ్లు, శుభ్రత, ఉపాధ్యాయుల కొరత వంటి కారణాలతో ప్రభుత్వ విద్యాసంస్థలు మూతపడుతున్నాయని, మరోవైపు సామాన్యులు తమ కష్టార్జితాన్ని ప్రైవేట్ సంస్థలకు ధారపోయాల్సి వస్తోందన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ, విద్యను వ్యాపారంగా మార్చడానికి అనుకూలమైన పద్ధతులను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తుందన మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలు.. పేదలను, అణగారిన వర్గాలను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నాయని, ఇది చదువుకునే హక్కును హరించే కుట్ర అని విమర్శించారు. ఎస్ఎఫ్ఐతోపాటు ఇతర విద్యార్థి సంఘాలు 30 శాతం నిధులు కేటాయించాలని అనేక సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నాయని గుర్తు చేశారు. ఎంవి ఫౌండేషన్ కూడా 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తుందన్నారు.

## కౌలు రైతుకు అండగా రైతు కమిషన్

### ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న ఓ కౌలు రైతు కుటుంబానికి తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ అండగా నిలిచింది. ములుగు జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న గిరిజన కౌలు రైతు కుటుంబానికి కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చేతుల మీదుగా కమిషన్ సభ్యుడు భూమి సునీల్ రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు గురువారం తార్నకలోని లీఫ్స్ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి హాజరైన కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, రాములునాయక్, గోపాల్‌రెడ్డి ఆ కుటుంబానికి అప్పటికప్పుడు నిర్ణయం తీసుకొని అదనంగా మరో రూ.15 వేల ఆర్థిక సాయమందిం చారు. కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి ఆత్మ స్థైర్యంగా ఉంటూ వారి కుటుంబంలోని పిల్లల్ని బాగా చదివించాలని, అందుకు తగ్గ సాయ మందిస్తామని పేర్కొన్నారు. ములుగు జిల్లా దేవగిరిపట్నంకు చెందిన గిరిజన రైతు నాగవతరాజు(40) ఎనిమిది ఎకరాల భూమిని కౌలు తీసుకుని పత్తి, వరి సాగు చేశాడు. వరుసగా మూడేళ్ల పంట నష్టం రావటంతో రూ.5 లక్షలవరకు అప్పులు అయ్యాయి. అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక 2020 జనవరి 23న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లావణ్య కూలీ పనులు, కుట్టు మిషన్‌తో పోషిస్తోంది. పెద్ద కుమార్తె తేజశ్రీ మానసిక దివ్యాంగురాలు కాగా చిన్న కుమార్తె అంజలి, కుమారుడు జస్వంత్, ఆర్థ ఉన్నారు. కాగా.. కమిషన్ సభ్యుడు భూమి సునీల్ తన తండ్రి మేక సంజీవరెడ్డి ద్వితీయ వర్ధంతిని రైతు కుటుం బాలను ఆదుకునే కార్యక్రమంగా మార్చారు. తండ్రి జ్ఞాపకార్థం ప్రతియేటా ఒక రైతు కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు.


## అనుబంధ గుర్తింపు కోసం 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ

### మార్చి 13 వరకు ప్రైవేటు జూనియర్ కాలేజీలు దరఖాస్తు చేసుకోవాలి.. ఆన్‌లైన్‌లోనే స్వీకరణ

### అపరాధ రుసుంతో ఏప్రిల్ 17 వరకు అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేట్, కార్పొరేట్, కంపోజిట్ కాలేజీల నుంచి ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తులను స్వీకరించనుంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అనుబంధ గుర్తింపు కోసం ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య గురువారం షెడ్యూల్‌ను జారీ చేశారు. మార్చి 13 వరకు ఎటువంటి ఆలస్యం రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 1000 లేట్ ఫీతో మార్చి 20 వరకు, రూ. 5000తో మార్చి 27 వరకు, రూ. 10వేలతో ఏప్రిల్ 3 వరకు, రూ. 15వేలతో ఏప్రిల్ 10 వరకు, రూ. 20వేల ఆలస్యం రుసుంతో ఏప్రిల్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి అనుబంధ గుర్తింపుతోపాటు అదనపు సెక్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సర్టిఫికెట్లతోపాటు దరఖాస్తు ఫీజు తనిఖీ రుసుంలను చెల్లించి గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తనిఖీ ఫీజు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతుల కోసం జనరల్ కాలేజీలకు రూ. 65వేలు, 5 కాలేజీలకంటే అదనంగా ఒకే యాజమాన్యానికి ఉంటే వారు తనిఖీ ఫీజును రూ. 75వేలు చెల్లించాలి. అఫిలియేషన్ ఫీజుగా రూ. 16వేలు చెల్లించాలి.. అదే 5 కాలేజీల కంటే అదనంగా రూ. 20వేలు చెల్లించాలి.

అదే మున్సిపాలిటీలు, నగరపంచాయతీలు అయితే తనిఖీ ఫీజు రూ. 50వేలు, 5 కాలేజీల కంటే ఎక్కువగా ఉంటే రూ. 62,500, అఫిలియేషన్ ఫీజు రూ. 14వేలు, 5 కాలేజీల కంటే ఎక్కువగా ఉంటే రూ. 15వేలు. గ్రామ పంచాయతీల్లో తనిఖీ ఫీజు రూ. 20వేలు, 5 కాలేజీల కంటే ఎక్కువగా ఉంటే రూ. 25వేలు, అఫిలియేషన్ ఫీజు 5 వేలు, 5 కాలేజీల కంటే ఎక్కువగా ఉంటే రూ. 10వేలు చెల్లించాలి. ఒకేషనల్ కాలేజీలకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తనిఖీ ఫీజు రూ. 60,000 అఫిలియేషన్ ఫీజు రూ. 5వేలు, మున్సిపాలిటీలు, నగరపంచాయతీల్లో రూ. 36వేలు తనిఖీ పీజు, అఫిలియేషన్‌కి రూ. 5వేలు, గ్రామపంచాయతీల్లో అయితే తనిఖీ ఫీజు రూ. 16వేలు, అఫిలియేషన్ ఫీజు రూ. 5వేలుగా నిర్ణయించినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 1450 వరకు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయి. అవి కాకుండా ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల కాలేజీలు మరో 1200 నుంచి 1400 వరకు కొనసాగుతున్నాయి. వాటిన్నింటిలో కలిపి ఇంటర్మీడియట్ విద్యలో సుమారు 10 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.



ఉపసర్పంచ్‌లను ఘనంగా సత్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, జైహింద్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, వట్టికూటి రామారావు, విక్రంగౌడ్ తదితరులు

## బిసిలను అణచివేయాలని చూస్తే ఓటుతో బుద్ధి చెబుతాం: జాజుల

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో బిసిల రాజకీయ శకం ఆరంభమైందని, బిసిలంటే పాలితులుకాదు, పాలకులని గ్రామపంచాయతీ ఎన్నికల్లో నిరూపించామని, బిసిలను అణచివేయాలని చూసిన పార్టీలను, నాయకులను తమ ఓటనే వజ్రాయుధంతో తగిన బుద్ధిచెబుతామని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 17శాతం రిజర్వేషన్లు గురించి సర్పంచ్ ఎన్నికల నిర్వహిస్తే బిసిలు ఓటుపోటుతో 52 శాతం సర్పంచులుగా గెలిచి తమ సత్తాచాటాలని జాజుల పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేన జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్‌గౌడ్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన నూతన సర్పంచులకు, ఉపసర్పంచులకు ఆత్మీయ అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌గౌడ్ విశిష్ట అతిథులు బిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, డా. చెరుకు సుధాకర్‌గౌడ్, పల్లె లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టికూటి రామారావు గౌడ్, తాటికొండ విక్రంగౌడ్ తదితరులతో పాల్గొని ప్రసంగించారు. గత రెండు సంవత్సరాలుగా బిసిలకు రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని పోరాటం చేస్తున్నామని, తెలంగాణలో బిసి ఎజెండా అంశంగా ముందుకు సాగుతున్నాయని, ఈదశలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో కూడా బిసిలను గెలిపించాలని తామిచ్చిన పిలుపుతో రాష్ట్రంలో 86శాతం బహుజన సర్పంచులు గెలిచారని, 52శాతం బిసి సర్పంచులు గెలిచారని, ఇదొక చరిత్రని జాజుల స్పష్టం చేశారు. బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయం నెరవేరాలంటే సర్పంచ్ నుండి ముఖ్యమంత్రి సీటువరకు బహుజనులు పరిపాలించాలని, పాపన్న స్ఫూర్తితో ఆమార్గంలో పయనించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు.

# రేవంత్‌రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్ వెనక్కి తీసుకోండి

### హార్వర్డ్ యూనివర్సిటీకి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 5:** తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ఇటీవల జారీ చేసిన సర్టిఫికెట్‌పై తీవ్ర వివాదం రేగింది. ఈ సర్టిఫికెట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అదే యూనివర్సిటీ పూర్వవిద్యార్థి, బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ గురువారం హార్వ ర్డ్ అధ్యక్షుడికి, డీన్‌కు ఘాటైన ఈమెయిల్ పంపారు.

దేశంలోనే అత్య ధికంగా 89 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న, ఓటుకు నోటు కేసు లో ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి జైలు జీవితం గడిపిన వ్యక్తికి హార్వర్డ్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రవీణ్ కుమార్ తన లేఖలో సీఎం రేవంత్ రెడ్డి ట్రాక్ రికార్డును ప్రస్తావిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేశారు.'దేశంలో ఏ ముఖ్యమంత్రి ఎదుర్కోనన్ని క్రిమినల్ కేసులు (89) ఎదుర్కొంటూ, ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి దొరికి, దాదాపుగా 50 రోజులు జైలులో గడిపి, ఇప్పుడు సీఎంగా పలు కుంభకోణాలకు పాల్పడుతూ, తెలంగాణ ప్రజల మీద ప్రతీకారం తీర్చుకుంటున్నారు. ప్రతిచోటా ప్రత్యర్థులపై అభ్యంతరకరమైన భాషను ప్రయోగిస్తున్న ఇలాంటి రాజకీయ నాయకుడు 21వ శతాబ్దానికి పనికిరాడు. ప్రాచీన రాతి యుగంలో కూడా ఇలాంటి నాయకులు ఉండి ఉండరు. ఇంతటి ట్రాక్ రికార్డు ఉన్న నాయకుడికి హార్వర్డ్ యూనివర్సిటీ సర్టిఫికెట్ ఇవ్వడం దేనికి సంకేతం?" అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు హార్వర్డ్‌కు పంపిన ఈమెయిల్ సారాంశాన్ని ఆయన మీడియాకు విడుదల చేశారు. హార్వర్డ్‌కు పంపిన మెయిల్ సారాంశం ప్రకారం... మీ ఈ నిర్ణయం, సంస్థాగత బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా ఉంది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) విశ్లేషించిన అఫిడవిట్ల ప్రకారం, రేవంత్‌రెడ్డిపై 89 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇది భారత దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధికం. వీటిలో 72 తీవ్రమైన ఐపిసీ సెక్షన్ల కింద నమోదైన కేసులున్నాయి. 2015లో అపఖ్యాతి పాలైన ఓటుకు నోటు కుంభకోణంలో, తోటి శాసనసభ్యుడికి లంచం ఇవ్వ జూపు తుండగా తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో ఆయన అరెస్ట్ అయి, దాదా పు 50 రోజులు జైలులో ఉన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపిస్తూ, బహిరంగంగా కుల, మతపరమైన విభజన రాజ కీయాలకు పాల్పడుతున్నారు. ప్రత్యర్థులపై, వారి కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన, అన్‌పార్లమెంటరీ భాషను ప్రయోగిస్తున్నారు.

ప్రత్యర్థు లను వేధించడానికి తప్పుడు కేసులను ఆయుధంగా వాడుతు న్నారు. ఆయన ప్రవర్తన, హెచ్‌కెఎస్ తన తరగతి గదుల్లో నేర్పుతుందని చెప్పుకునే నైతిక నాయకత్వం, నాగరికత, ప్రజాసేవ వంటి విలువలను అపహాస్యం చేస్తోంది.

400 యేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా నైతిక విలువలతో కూడిన నాయకులను తయారుచేస్తున్న హార్వర్డ్ కెన్నెడీ స్కూల్, ఇంతటి వివా దాస్పద నేపథ్యం ఉన్న రాజకీయ నాయకులకు సర్టిఫికెట్లు ఇచ్చే స్థాయికి ఎలా దిగజారింది? రేవంత్‌రెడ్డికి అడ్మిషన్ ఇచ్చేటప్పుడు కనీస నేపథ్య విచారణ, అధికారిక ఇంటర్వ్యూ లేదా తగిన శ్రద్ధ తీసుకున్నట్టు కనిపించ డం లేదు. హార్వర్డ్ కేవలం ప్రతిష్ఠ లేదా ఫీజుల కోసం వివాదాస్పద వ్యక్తులకు ఇలాంటి చిన్న ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను అమ్ముకుంటోంది అనిపిస్తోంది. ఇలా చేయడం ద్వారా అవినీతిపరులైన నాయకులు తమ నైతిక తప్పిదాలను, నేరాలను కప్పిపుచ్చుకుని, చట్టబద్ధత అనే ముసుగును ధరించడానికి అవకాశం కల్పిస్తున్నారు. ఇది నాయకత్వం కాదు, నమ్మక ద్రోహం అని పేర్కొన్నారు.

# అమ్మాయిలు షాపింగ్ చేస్తున్నారా !



అమ్మాయిలెంతో ఉత్సాహంగా షాపింగ్ చేస్తున్నారా. అయితే ఈ సూచనలు.

✦ గతంలో పర్సులో నగదుతో వెళ్లేవాళ్లం. బడ్జెట్ తెలిసేది. ఫోన్‌ద్వారా చెల్లించడం వచ్చిన తర్వాత అకౌంట్‌లో ఉన్నదంతా ఖాళీ అయ్యేవరకు షాపింగ్ చేస్తూనే ఉంటాం. అలాకాకుండా ముందుగానే మన బడ్జెట్ నిర్ణయించుకొని, ఆ ప్రకారమే షాపింగ్ అనుకోవాలి. ఇంటిల్లిపాదికీ ఎంత అవసరం అవుతుందో అనికాకుండా, మొత్తం మనం అనుకున్న బడ్జెట్‌లోకి వచ్చేలా జాగ్రత్తగా షాపింగ్ చేయాలి.

✦ మన దగ్గర కొనాల్సి వాటి జాబితా తప్పనిసరిగా ఉండాలి. అవసరమైన కౌంటర్లు / ఉత్పత్తులకు మాత్రమే వెళ్లి కొనాలి. లేదంటే కనిపించేవన్నీ కొనే ప్రమాదం ఉంది. క్రెడిట్‌కార్డ్‌తో చేసే షాపింగ్‌పై క్యాష్‌బ్యాక్, రివార్డులంటూ కొన్ని ప్రయోజనాలు ఉంటాయి. వాటిని తెలుసుకోవాలి. ముఖ్యంగా పండుగ సమయంలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. వీటిని వినియోగించుకుంటే కొంత నగదును పొదుపు చేయొచ్చు. గతంలో మనవద్ద ఉండిపోయిన కూపన్లు వృథా కాకుండా ఆన్‌లైన్‌లో ఈ పండుగకు వినియోగించొచ్చేమో పరిశీలించాలి. ◻

# దీంతో అందం, ఆరోగ్యం..



కరివేపాకు.. కూరలో పడితే నేచురల్ ఫ్లేవర్ వస్తుంది. సాంబారులో వేస్తే.. అదిరిపోతుంది. పొడిగా చేసుకుంటే.. పడిపడి తినేయొచ్చు. ఆయుర్వేదంలోనూ కరివేపాకు విశేషంగా వాడుతుంటారు. ఎన్నో అనారోగ్య సమస్యలకు ఇది చెక్ పెడుతుంది. ఆరోగ్యాన్ని అందించడం మాత్రమే కాదు.. అందాన్ని రెట్టింపు చేయడంలోనూ కరివేపాకు ఎంతో సాయపడుతుంది. కరివేపాకులోని యాంటి ఆక్సిడెంట్లు, యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్ లక్షణాలు.. మచ్చల్లేని, కాంతిమంతమైన చర్మాన్ని అందిస్తాయి. మెరుస్తున్న చర్మం సొంతం కావాలంటే.. కరివేపాకు ఫేస్‌ప్యాక్స్ ట్రై చేయొచ్చు. కరివేపాకులను నీటిలో ఉడకబెట్టి.. చల్లారాక మిక్సీలో వేసి పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమానికి ఒక టేబుల్ స్పూన్ తేనె కలిపి.. ముఖం, మెడ, చేతులపై రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత కడిగేసుకుంటే.. ముఖంపై మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. కరివేపాకు నీటితోనూ ముఖ సౌందర్యాన్ని మెరుగు పరుచుకోవచ్చు. కొన్ని కరివేపాకులను నీటిలో ఉడకబెట్టాలి. చల్లారాక.. ఆ నీటితో తరచూ ముఖాన్ని కడుక్కుంటే.. ఫేస్ రోజంతా ఫ్రెష్‌గా ఉంటుంది.

ఈ నీటిని టోనర్‌గానూ ఉపయోగించవచ్చు. కరివేపాకును ఉడకబెట్టి.. పేస్ట్‌లా చేసుకోవాలి. అందులో రెండుమూడు చుక్కల నిమ్మరసం వేసి ఫేస్‌ప్యాక్‌లా వేసుకోవాలి. బాగా ఆరిపోయిన తర్వాత కడిగేసుకుంటే.. చర్మం నిగారిస్తుంది. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే.. ముఖవర్చస్సు పెరుగుతుంది. జుట్టు రాలడం తగ్గాలన్నా.. వెంట్రుకలు ఒత్తుగా పెరగాలన్నా కరివేపాకును ఆశ్రయించాల్సిందే! ఇందులోని ఔషధ గుణాలు.. జుట్టు సంరక్షణలో కీలకంగా పనిచేస్తాయి. కరివేపాకును ఎండబెట్టి, పొడిచేసి.. మామూలు కొబ్బరినూనెలో కలుపుకోవాలి. ఈ నూనెను వారానికి రెండుసార్లు కుదుళ్లకు బాగా పట్టిస్తే.. జుట్టు సమస్యలు దూరం అవుతాయి. ◻

# ప్రజలు మెచ్చిన కలెక్టరమ్మలు

**అధికారం చేతిలో ఉంటే పెత్తనం చలాయించేవాళ్లు కొందరైతే, దాన్ని ప్రజా సేవకు మళ్లించేవాళ్లు ఇంకొందరు. రెండో కోవకు చెందుతారు ఈ యువ ఐఏఎస్ అధికారులు!**



**అత్యుత్తమం..** తమిళనాడు, తంజావూరు ప్రజలు మా కలెక్టర్ ప్రపంచంలోనే అత్యుత్తమం.. అంటూ ప్రియాంక బాలసుబ్రమణ్యన్ను పొగిడేస్తున్నారు. ఆమె అధికారిణిగా కాకుండా సాటి మనిషిగా అందరికీ సాయపడుతుండటమే దీనికి కారణం, తన దగ్గరకు వచ్చే వాళ్లందరినీ



చిరునవ్వుతో పలకరిస్తూ వాళ్ల సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి తక్షణమే ఆదేశిస్తారు. తమిళ నాడు గిండీ కాలేజీ నుంచి ఇంజినీరింగ్, ఐఐఎం బెంగళూరు నుంచి ఎంబీఏ పూర్తిచేశారు ప్రియాంక, కాంక్రీట్ కెరియర్ కాదనుకుని, సివిల్ సర్వెంట్గా మారారు. విద్యా రంగానికి చాలా ప్రాధాన్యత ఇస్తారు. తరచూ స్కూళ్ల తనిఖీలకు వెళ్తారు. పోషకాహారం, నైపుణ్యాల విషయంలో రాజీ లేని బాట ఆమెది. అధికార దర్పం ఆమెలో ఇసుమంతైనా కనిపించదు.

**ఏఐతో లెక్క తేల్చేశారు...**

డాక్టర్ సౌమ్య ఝా.... రాజస్థాన్లోని టోంక్ జిల్లా కలెక్టర్. పదో తరగతి విద్యార్థుల్లో 90 శాతం తాము సైన్స్ రంగంలో అడుగు పెడతామని చెప్పేవారు. కానీ నిజంగా ఆ గ్రూపుల్లో చేరేవాళ్లు మాత్రం కేవలం 12 శాతమే ఉండేవారు. కారణం ఎక్కువమంది గణితం అంటే భయపడటమే. దీని వెనక కారణాలు టీచర్ల కొరత, ఉన్నవాళ్లకే సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానం లేకపోవటం, టీచర్లు, విద్యార్థుల గైర్హాజరీ... ఇవన్నీ వచ్చాయి. ముఖ్యంగా హిందీ మీడియం చదివేవాళ్లలో ఈ లోపాలు కనిపిస్తాయి. పరిష్కారంగా ఏఐని ఉపయోగించాలనుకున్నారు. పథాయీవిస్ఏఐ. ఇన్ పేరుతో వెబ్‌సైట్ ఈ వెబ్‌సైట్‌లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేవారు. వాళ్ల జవాబు రాయని ప్రశ్నలేంటో తెలిసేవి. రివ్యూ చేసినప్పుడు అలాంటి ప్రశ్నలకు జవాబులు వివరించేలా చేశారు. దీనితో గణితంలో ఉత్తీర్ణత శాతం మూడు పాయింట్లు పెరిగాయి. పిల్లలు సాధించిన మార్కులూ పెరిగాయి.

**వరదల్లోనూ బెదరకుండా..**

ఈ ఆగస్టు ఏడాదిసెప్టెంబర్‌లో పంజాబ్ లో వరదలు వచ్చాయి. అజ్నాల జిల్లాలో 20 గ్రామాల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉంది. అప్పటికి డెప్యూటీ కమిషనర్ ఆఫ్ అమృతసర్గా ఉన్న సాక్షి సాహ్నీ.... ప్రత్యేక అధికారిగా క్షేత్రస్థాయిలో పని చేశారు. వందల సంఖ్యలో రంగంలోకి దిగిన ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, రెడ్‌క్రాస్‌కు చెందిన బృందాన్ని సమన్వయ పరుస్తూ సహాయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తానుగా మోకాలి లోతు వరకు నీరున్న చోట వరద నిల్వలు ఉన్నాయి.



వేల మందిని సురక్షిత ప్రాంతాలకు. తర్వాత వాళ్ళు తలదాచుకున్న ఇళ్లు, పాఠశాలలు, హాస్పిటల్స్‌ను పర్యవేక్షించారు. ప్రస్తుత గ్రేటర్ మొహాలీ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి చీఫ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నారు సాక్షి ◻

# నిజమైన పూజ

దేవతలను సాత్త్విక, రాజస, తామస అంటూ మూడు రకాలుగా పూజిస్తారు. మనమంతా నిత్యం ఇష్ట దైవాన్ని పూజించే విధానం సాత్త్వికం. కొందరు ధ్యానం కూడా చేస్తారు. భగవంతుణ్ణి మనసా వాచా కర్మణా ఆరాధించడమే నిజమైన పూజ. ఈ విధానంలో తమను రక్షించమని, తమ కోరికలను నెరవేర్చమని వేడుకుంటారు. రెండోది రాజసం. ఈ విధానం లో ఆడంబరాలు ఎక్కువ ఇది చూసేవారి కోసం దేవుణ్ణి పూజిస్తున్నట్టు ఉంటుంది. భారీ ఎత్తున పుష్పాలు, నివేదనలు మంత్రోచ్చారణలు ఉంటాయి. ఇక్కడ భగవంతుణ్ణి మెప్పించడం కన్నా తమను అందరూ అధికులుగా భావించాలి అనుకుంటారు. చిత్తశుద్ధి లేని ఈ పూజలు దాదాపు వ్యర్థమే. ఇక మూడో విధానం తామసం. ఎదుటివారిని నాశనం చేయాలనో లేక తామొక్కరే బాగుండాలంటే దురుద్దేశంతో చేసే పూజలు ఇందులో భయంకరమైన నివేదనలు, అర్చనలు ఉంటాయి. అన్యాయం, ఆక్రమం అయిన ఈ పూజలవల్ల ఎదుటివారి నాశనాన్ని కోరుకునే వీళ్ల తమ వినాశనాన్ని కొనితెచ్చుకోవడం తథ్యం ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ కూడా కామక్రోధాది గుణాలను దూరం చేస్తాయి అని చెబుతున్నాయి. ఈ దుర్గుణాలను దూరంచేసుకొని సత్వగుణ సంపన్నులుగా ఉండాలని కోరుకునేది నిజమైన పూజ.. తోటివారిలో పరమాత్మను చూస్తూ అందరినీ చూస్తూ శ్రేయస్సునూ ఆశిస్తూ చేసే పూజలే అవసరమైనవి. ◻

# టైల్స్ మధ్య మురికి పోవాలంటే!



టైల్స్ మధ్య మురికి పోవాలంటే! నెలను శుభ్రం చేస్తున్నా సరే టైల్స్ మధ్య మురికి చేరుతుంది. ఇంట్లో చేరిన దుమ్ముకి, తేమ తోడవడం తో అది కాస్తా గట్టిపడి పోయి.. టైల్స్ మధ్యలో ఉండిపోతుంది. ఫలితంగా పోలిని తరమా శుభ్రం చేస్తున్నా.. ఆ మురికి మాత్రం ఓ పట్టాన పోదు. అయితే ఇందుకు ఈ సింపుల్ చిట్కాలు ఉపయోగపడతాయని నిపుణులువెనిగర్, గోరువెచ్చని నీళ్ల ఈ సమపాళ్లలో తీసుకోని దీన్ని స్ప్రే బాటిల్లో పోసి టైర్స్ మధ్య మురికి పేరుకున్న చోట చేయాలి తర్వాత బ్ర రుద్దితే మురికి పదికిపోయి ఫ్లోర్ శుభ్రపడుతుంది.

దెబ్బలు తగిలిన ప్పుడు ఆ శుభ్రం చేయ దానికి ఉపయో గించే హైడ్రోజన్ పెరా !!సైతం టైల్స్ మధ్య చేరిన మురికిని పోగొట్ట దానికి ఉపయో గించు కోవచ్చు దీన్ని నేరుగా శుభ్రం చేయ దానికి వాడుకోవచ్చుట లేదా ఇందులో కొద్దిగా బేకింగ్ సోడాను కలిపి ప్రమాదమని ఆ మధ్య రాయాలి. కాసేపయ్యాక సిటితో కడిగేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. నిమ్మ రసాన్ని నీటిలో టైల్స్ మధ్య మరికిగా ఉన్న చోట పై చేయాలి. ఆ తర్వాత సబ్బుర్తో రుద్ది శుభ్రం చేస్తే మురికి వదిలిపోతుంది. అయితే నిమ్మ వల్ల రైల్స్ తగ్గే అవకాశం ఉంటుంది కాబట్టి కాస్త ఎక్కువ నీటిలో కొద్దిగా నిమ్మరసాన్ని కలిపితే సరిపోతుంది. ◻

# రాగి యాపిల్ హాల్వా

కావలసిన పదార్థాలు: రాగులు: అర కప్పు, యాపిల్: ఒకటి, చక్కెర: ఒక టేబుల్ స్పూన్, తరిగిన డ్రైఫ్రూట్స్: ఒక టేబుల్ స్పూన్, నెయ్యి: ఒక టీస్పూన్, ఇలాచీ పొడి: చిటికెడు. **తయారీ విధానం:** స్టవ్‌మీద పాన్‌పెట్టి రాగులను సన్నని మంటపై దోరగా వేయించాలి. చల్లారిన తర్వాత వాటిని మిక్సీలో మెత్తని పిండిలా చేసుకోవాలి. యాపిల్ తొక్క తీసి ముక్కలుగా కోయాలి. స్టవ్‌మీద గిన్నెపెట్టి యాపిల్ ముక్కల్లో ఒక కప్పు నీళ్లుపోసి మెత్తగా ఉడికించాలి. ఒక గిన్నెలో రాగి పిండి, తగినన్ని నీళ్లు పోసి బాగా కలిపి సన్నని మంటపై రెండు నిమిషాలు ఉడికించాలి. రాగిపిండి దగ్గర పడుతుండగా యాపిల్ ముక్కలు, చక్కెర, ఇలాచీ పొడి వేసి మరింత ఉడికించాలి. స్టవ్‌మీద పాన్ పెట్టి, నెయ్యి వేడయ్యాక డ్రైఫ్రూట్స్ వెయ్యాలి. బాగా వేగాక రాగి మిశ్రమం జోడిస్తే రాగి యాపిల్ హాల్వా సిద్ధం. ◻



తెర

# 'మారెమ్మ' టీజర్ లాంచ్ ఈవెంట్



ఈవెంట్ లో బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బాబీ కొల్లిమాధవ్, మంచాల నాగరాజు, మయూర్ రెడ్డి బండారు, మోక్ష ఆర్ట్స్ 'మారెమ్మ' ఇంటెన్స్‌డివైన్ టీజర్ లాంచ్ మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ' తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. టీం ఈరోజు టీజర్‌ను లాంచ్ చేసింది. ఒక అంటువ్యాధి గ్రామాన్ని చుట్టుముట్టి, ప్రజలు, పశువుల ప్రాణాలను బలిగొంటుంది. గ్రామస్తులు తమ గ్రామ దేవత మారెమ్మ తల్లిని ప్రార్థిస్తారు. తన తొలి ప్రయత్నంలోనే దర్శకుడు మంచర్ల నాగరాజు తెలంగాణలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా గ్రామీణ నేపథ్యంలో అద్భుతమైన కథను సిద్ధం చేశారు. డైరెక్టర్ బాబి కొల్లి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. రవితేజ గారితో జర్నీ చేస్తున్నప్పుడు మాధవ్ ని చూస్తూ ఉండేవాణ్ణి. రవితేజ గారు ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా వచ్చారు. అలాగే మాధవ్ కూడా తన కాళ్ళ మీద తనే నిలబడాలని ఆయన కోరుకుంటున్నారు. హీరో మాధవ్ మాట్లాడుతూ.. మీడియా మిత్రులకు, మా అన్నయ్య మాస్ మహారాజా రవితేజ గారి ఫాన్స్ కు నమస్కారం( నవ్వుతూ) ఈ వేడుకకు విచ్చేసిన బాబి గారికి ధన్యవాదాలు. హీరోయిన్ దీపా మాట్లాడుతూ.. ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. అందరూ థియేటర్స్ కి వచ్చి సినిమా చూస్తారని కోరుకుంటున్నాను కొత్తవాళ్లైనప్పటికీ ఒక అద్భుతం టీం తో వర్క్ చేశాం.

# 'యుఫోరియా' గ్రాండ్ రిలీజ్



'యుఫోరియా' గ్రాండ్ రిలీజ్ ప్రెస్ మీట్‌లో సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్..

భూమిక ప్రధాన పాత్రలో సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రం ˇయుఫోరియా. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మాతలుగా సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న విడుదల చేయబోతోన్నారు.

..సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ మాట్లాడుతూ.. .. ˇ1992లోˇలాఠీ చిత్రంతో ఇండస్ట్రీలోకి వచ్చాను. ఇన్నేళ్ల కెరీర్‌లో ఇది నా 14వ సినిమా. నా మొదటి చిత్రానికి ఎలా ఫీల్ అయ్యానో ఇప్పుడు కూడా అదే ఫీల్‌తో ఉన్నాను. ఓ మంచి కథను, కొత్త కథను మరింత కొత్తగా చెప్పే ప్రయత్నం చేశాను. నేను ప్రేక్షకుల దేవుళ్లని నమ్ముతాను. నేను వారి టైంకి, డబ్బుకి, విజ్ఞతకి విలువ ఇస్తాను.

..భూమిక మాట్లాడుతూ.. .. 'యుఫోరియా' లాంటి చిత్రాలను చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఇలాంటి చిత్రాల్లో రిస్క్ ఎంతో ఉంటుంది. కానీ గుణ శేఖర్ గారు, ఆయన ఫ్యామిలీ కలిసి రిస్క్ చేస్తున్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ.. 'యుఫోరియా' అనేది సందేశాత్మక చిత్రమేమో అని అంతా అనుకుంటున్నారు. కానీ ఇప్పటి వరకు ఈ మూవీని చూసిన వారంతా కూడా కొత్త కథకు కమర్షియల్ అంశాల్ని జోడించి కొత్తగా తీశారని మెచ్చుకున్నారు. నటి లిఖిత మాట్లాడుతూ..ˇఎంబీబీఎస్ చదువుకుంటూనే మోడలింగ్ చేశాను. ఫెమినా మిస్ ఇండియా టైటిల్ కూడా గెల్చుకున్నాను..నటుడు విఘ్నేశ్ మాట్లాడుతూ.. .. 'యుఫోరియా' ప్రీమియర్‌ని మా అమ్మనాన్న కూడా చూశారు. నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. 'యుఫోరియా' ప్రీమియర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. నాకు ఓ కొత్త గుణ శేఖర్ కనిపించారు. అని అన్నారు.

# రామ్‌చరణ్ 'పెద్ది' ఏప్రిల్ 30న రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చి బాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. మార్చి 27న విడుదల చేయాలని భావించిన ఈ సినిమాను వేసవి సెలవుల్ని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 30కి మార్చారు. ఈ అదనపు సమయంతో మేకర్స్ భారీ స్థాయిలో ప్రమోషన్స్‌కు సిద్ధమవుతున్నారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ చరణ్ మాస్ లుక్‌లో అదరగొట్టారు. పొడవైన జుట్టు, రగ్గడ్ గడ్డం, నోస్ రింగ్‌తో ఆయన లుక్ ఇంటెన్స్ గా కనిపిస్తోంది. ఆయన పదునైన చూపు నేరుగా గుండెల్లోకి దూసుకెళ్తుంది. చుట్టూ అలసిపోయిన, ముఖాల్లో వేదన కనిపించే జనసమూహం మధ్య నుంచి ఆయన రావడం ఎమోషన్ ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమాలో కథానాయికగా జాన్వీ కపూర్ నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రామ్ చరణ్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు డీవోపీ, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్, అవినాష్ కొల్లా తన అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్‌తో పెద్దికి అద్భుతమైన వరల్డ్ బిల్డింగ్ చేశారు.

# 'సుమతీ శతకం' ప్రి రిలీజ్ ప్రెస్ మీట్



మైత్రి మూవీస్ ద్వారా ఫిబ్రవరి 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న "సుమతీ శతకం" ఆశ్చర్యపరుస్తున్న టికెట్ ధర..విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'సుమతీ శతకం' విడుదలకు సిద్ధమైంది. సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాణంలో, ఎం.ఎం. నాయుడు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి అంచనాలు ఉన్నాయి. అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. కాగా, తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. హీరో అమర్దీప్ చౌదరి మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. ఒక సామాన్య స్థాయి నుండి మొదలై ఎన్నో సంవత్సరాలు కష్టపడి ఈరోజు . సుమతీ శతకం ద్వారా మీ ముందుకు వచ్చాను. ఒక్క ఛాన్స్, ఒకే ఒక్క ఛాన్స్ ఇచ్చి చూడండి. నన్ను నేను నిరూపించుకుంటాను. అన్నారు. హీరోయిన్ శైలి చౌదరి మాట్లాడుతూ... "అందరికి నమస్కారం. ఈ సినిమాలో నటించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. ఎంతో కష్టపడి ఈ సినిమా కోసం కష్టపడ్డాము. అన్నారు. దర్శకుడు ఎం.ఎం. నాయుడు మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. మా సినిమాను ఇంతగా ఎంకరేజ్ చేస్తున్న మీడియా వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నిర్మాత కొమ్మలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు. సుమతీ శతకం ఫిబ్రవరి 6వ తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా పై మాకు నమ్మకం ఉంది.

# 'స్కై' 13న గ్రాండ్ రిలీజ్



ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ 'స్కై' మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి ్మ గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై' . పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. 'స్కై' సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రావాల్సి ఉండగా వాయిదా పడింది. అనివార్య కారణాలతో వాయిదా పడిన ఈ సినిమాను ఈ నెల 13న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రమోషనల్ కంటెంట్ తో పాటు లిరికల్ సాంగ్స్ తో మంచి ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్ గా 'స్కై' మూవీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# 'శ్రీ చిదంబరం గారు' బ్లాక్‌బస్టర్ అవ్వాలి:

## ఎమ్.ఎమ్.కీరవాణి




శ్రీమతి. చింతా వరలక్ష్మీ ్మ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన 'శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు లెజెండరీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి, కథానాయకుడు ఆనంద్ దేవరకొండ, నిర్మాత, నటి నిహారిక కొణిదెల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్.ఎమ్. కీరవాణి మాట్లాడుతూ యంగ్ బ్లడ్ అంతా ఎంతో ఉత్సాహంతో చేసిన సినిమా ఇది. ఈ సినిమా సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను. అన్నారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ తొలి సినిమా ఎంతో ఇంపార్టెంట్ నాకు తెలుసు. వాళ్ల కష్టం తెలుసు. అందుకే ఇక్కడికి వచ్చాను. అన్నారు. నిహారిక కోణిదెల మాట్లాడుతూ నాకు దర్శకుడు వినయ్ మూడు సంవత్సరాల నుంచి తెలుసు. ఈ ఫంక్షన్‌కు వినయ్‌కు సపోర్ట్ చేయడానికి నేను వస్తానని చెప్పి మరీ వచ్చాను. అన్నారు. నిర్మాత చింతా గోపాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'క్రౌడ్ ఫండింగ్‌తో ఈ టీమ్‌ను తిరుగుతుంటే కథ విని ఈ సినిమా




## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్..

# రస్మిక, వంశికకు స్వర్ణం, రజతం

### మిక్స్‌డ్ జోడీ సురుచి-రాణాకు రజతం

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2026, ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో వ్యక్తిగత విభాగాల్లో రస్మిక సెహగల్ స్వర్ణ పతకం సాధించగా, వంశికా చౌదరి రజతాన్ని దక్కించుకుంది. అలాగే భారత్ మిక్స్‌డ్ ద్వయం సురుచి సింగ్, సామ్రాట్ రాణా రజత పతకాన్ని గెలుచుకుంది. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో మహిళల జూనియర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో, భారతదేశం స్వర్ణం మరియు రజతం గెలుచుకుంది, రస్మిక సహగల్ 237.9 స్కోరుతో ఫైనల్‌ను గెలుచుకోగా, వంశికా చౌదరి 236.7 స్కోరుతో రెండవ స్థానంలో నిలిచి రజతాన్ని దక్కించుకుంది. అలాగే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఉజ్బెకిస్తాన్‌ను సురుచి-సామ్రాట్ జోడీ తృటిలో ఓడించింది. 479.6 పాయింట్లతో ముగించారు. ఈ జంటను ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నిగినా సైద్కులోవా-ముఖమ్మద్ కమాలోవ్ ఓడించి, రెండవ అర్ధభాగంలో బలమైన ఆటతీరును కనబరిచి 481.3 పాయింట్లతో స్వర్ణం సాధించారు. చెంగ్ యెన్‌చింగ్ మరియు హ్సీహ్ హ్సియాంగ్‌చెన్ ప్రాతినిధ్యం వహిస్తున్న చైనీస్ తైపీ 412.2 పాయింట్లతో కాంస్యం సాధించింది. తొలి రెండు సిరీస్‌ల తర్వాత భారత్ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది, తద్వారా ఉజ్బెకిస్తాన్‌ను ప్రారంభంలోనే ఒత్తిడిలోకి నెట్టింది. ఉజ్బెక్





ద్వయం మూడవ సిరీస్ నుండి పోటీని మలుపు తిప్పింది. అయితే, భారత్ జంట క్రమంగా 1.7 పాయింట్ల ఆధిక్యంతో ఫైనల్‌ను ముగించింది. అంతకుముందు సురుచి మరియు సామ్రాట్ 583 పాయింట్లతో క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు.

ఆట



## జాగ్రెబ్ ఓపెన్‌లో

# సుజిత్‌కు స్వర్ణం

### అమన్, అభిమన్యుకు రజత, కాంస్యం

**న్యూఢిల్లీ:** జాగ్రెబ్ ఓపెన్‌లో 2026లో భారత వర్ధమాన రెజ్లర్ సుజీత్ కల్కల్ ఈ ఏడాది తన తొలి అంతర్జాతీయ టోర్నమెంట్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. క్రొయేషియాలో జరిగిన పోటీల్లో సుజీత్ ఆధిపత్య ప్రదర్శన కనబరిచి 3 బౌట్లలో ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా పురుషుల 65 కిలోల ఫ్రీస్టైల్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. అలాగే అమన్ సెహ్రావత్ (61 కిలోలు), అభిమన్యు మాండ్వాల్ (70 కిలోలు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. యూరోపియన్ రజత విజేత ఫ్రాన్స్‌కు చెందిన ఖమ్జత్ అర్సమెర్‌జౌవ్‌పై 10-0 తేడాతో ఆధిపత్యంతో సుజీత్ రోజును ప్రారంభించాడు. ఆపై అమెరికన్ రెజ్లర్ జోసెఫ్ మెక్‌కెన్నాను ఓడించి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఫైనల్లో టైటిల్ కోసం ఇరానియన్ రెజ్లర్ పేమాన్ నెమతిపై హోరాహోరీ పోరులో 3-0 తేడాతో సుజీత్ గెలిచాడు. ఇక ఒలింపిక్ పతక విజేత అమన్ సెహ్రావత్ పురుషుల 61 కిలోల విభాగంలో స్వర్ణం కోల్పోయి రజతంతో సరిపెట్టుకున్నాడు. గ్రూప్ దశ రౌండ్ రాబిన్ నార్డిక్ ఫార్మాట్‌లో, అమన్ 4 బౌట్‌లలో 3 విజయాలతో రెండవ స్థానంలో నిలిచాడు. అలాగే అభిమన్యు మాండ్వాల్ మూడవ పతకాన్ని అందించాడు. పురుషుల 70 కిలోల విభాగంలో అమెరికన్ రెజ్లర్ ఇయాన్ మాక్స్వెల్ పార్కర్‌పై 6-3 తేడాతో విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అయితే మరో ఇద్దరు భారత రెజ్లర్లు ముకుల్ దహియా (86 కిలోలు), అతిష్ తోడ్కర్ (57 కిలోలు) ఇరానియన్ రెజ్లర్ల చేతిలో ఓటమిపాలయ్యారు.

## ఆసియా స్నూకర్ ఛాంపియన్‌షిప్..

# పంకజ్‌కు రజతం



**న్యూఢిల్లీ:** 2026 ఆసియా స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి చెందిన పంకజ్ అద్వానీ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఖతార్‌లో జరిగిన ఈ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో 40 ఏళ్ల పంకజ్ ఫైనల్‌లో చైనాకు చెందిన డెంగ్ హావోహుయ్ చేతిలో 1-4 తేడాతో ఓడిపోయి కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచాడు. టైటిల్ పోరులో మొదటి ఫ్రేమ్‌ను గెలిచి 1-0 ఆధిక్యంలోకి వెళ్లడంతో పంకజ్ పోటీకి మంచి ఆరంభం ఇచ్చాడు. కానీ తన ప్రత్యర్థి చైనీస్ క్యూయిస్ట్ తదుపరి మూడు ఫ్రేమ్‌లను గెలుచుకుని తిరిగి పుంజుకున్నాడు. అంతకుముందు, పంకజ్ గ్రూప్ ఎ లో రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో అగ్రస్థానంలో నిలిచి తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు. ఒమన్‌కు చెందిన అహ్మద్ బషీర్ 4-0తో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. ఆపై శ్రీలంకకు చెందిన మొహమ్మద్ తహా ఇర్షాత్‌ను 4-3తో ఓడించాడు. ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన మొహమ్మద్ షెహాబ్‌ను 4-0 తేడాతో ఓడించి, ఇరాన్‌కు చెందిన షాహిన్ సబ్జీని 4-1 తేడాతో ఓడించి టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు. అయితే ఫైనల్లో ఓటమిపాలై రజతంతో సరిపెట్టుకున్నాడు.

# సంతోష్ ట్రోఫీ ఫైనల్‌కు కేరళ

### 4-0 తేడాతో పంజాబ్ ఓటమి



**న్యూఢిల్లీ:** సంతోష్ ట్రోఫీ 2025-26లో కేరళ జట్టు పంజాబ్‌ను 4-0 తేడాతో ఓడించి సర్వీసెస్‌తో ఫైనల్‌కు చేరుకుంది. గురువారం అస్సాంలోని ధకుఖానా ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన సెమీఫైనల్లో ముహమ్మద్ రియాస్ పిటి ప్రతి అర్ధభాగంలో ఒకసారి గోల్ చేయగా, ముహమ్మద్ అజ్సల్, విక్నేష్ ఎం ఒకసారి గోల్ చేశారు. అభిషేక్ పవార్ సర్వీసెస్ తరపున మెరిశాడు, ప్రతి అర్ధభాగంలో ఒకసారి గోల్స్ చేసి తన జట్టును రెండేళ్ల తర్వాత శిఖరాగ్ర పోరులోకి నడిపించాడు. 30 నిమిషాల తర్వాత పవార్ అద్భుతమైన హాఫ్‌వాలీతో గోల్ చేశాడు, ఆపై రెండవ అర్ధభాగంలో గోల్ కీపర్‌ను తప్పుదారి పట్టించాడు, గోల్‌ను గోల్‌గా మార్చాడు. ఈ ఫలితంతో కేరళ దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వరుసగా సంతోష్ ట్రోఫీ ఫైనల్స్‌కు చేరుకుంది. అంతకుముందు రైల్వేస్‌పై 2-0 తేడాతో క్లినికల్ విజయం సాధించిన సర్వీసెస్ 13వ సారి ఫైనల్స్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకుంది. దూకుడుగా ప్రారంభించిన తర్వాత, అభిషేక్ పొవార్ అద్భుతమైన ముగింపుతో అరగంట తర్వాత ఎస్ఎస్‌బి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రైల్వేస్ స్పందించినా, 73వ నిమిషంలో జహీర్ ఖాన్‌పై బాక్స్‌లో ఫౌల్ తర్వాత పెనాల్టీ స్పాట్ నుండి పొవార్ మళ్ళీ గోల్ చేయడంతో సర్వీసెస్ గెలుపొందింది. దీంతో కేరళ, సర్వీసెస్ మధ్య ఫైనల్ పోరు జరగనుంది.



# సైబర్ మోసాల ఎఫెక్ట్

### 39.43 లక్షల మొబైల్ కనెక్షన్లు కట్

### 1.31 లక్షల ఎస్ఎంఎస్ టెంప్లేట్‌లు బ్లాక్

### పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలను అరికట్టే ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం 39.43 లక్షల మొబైల్ కనెక్షన్‌లను డిస్‌కనెక్ట్ చేసింది, 2.27 లక్షల మొబైల్ హ్యాండ్‌సెట్‌లను బ్లాక్‌లిస్ట్ చేసింది. 1.31 లక్షల ఎస్ఎంఎస్ టెంప్లేట్‌లను బ్లాక్ చేసింది, గురువారం పార్లమెంటులో కేంద్రం ప్రకటన చేసింది. సైబర్ నేరాలు, ఆర్థిక మోసం కేసుల్లో టెలికం వనరుల దుర్వినియోగాన్ని నిరోధించడానికి టెలికమ్యూనికేషన్స్ శాఖ (డిఓటి) నేతృత్వంలో ఈ చర్యలు తీసుకున్నట్లు కమ్యూనికేషన్ల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు. సుమారు 7.7 లక్షల పౌరుల ఇన్‌పుట్‌ల ఆధారంగా, అమలు సంస్థలు 39.43 లక్షల మొబైల్ కనెక్షన్‌లను డిస్‌కనెక్ట్ చేశాయి, 2.27 లక్షల హ్యాండ్‌సెట్‌లను బ్లాక్‌లిస్ట్ చేశాయి. మోసం సంబంధిత కార్యకలాపాలకు దోహదపడుతున్నాయని అనుమానించబడిన 1.31 లక్షల ఎస్ఎంఎస్ టెంప్లేట్‌లను బ్లాక్ చేశాయి. ధ్రువీకరణను నివారించడానికి వాటాదారులు డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా వారి సంబంధిత డొమైన్‌లలోని అనుబంధ ఖాతాలు, ప్రొఫైల్‌లను విశ్లేషించడం ద్వారా చర్య తీసుకుంటారని మంత్రి గుర్తించారు. ఇంకా, మోసం ప్రమాద సూచిక (ఎఫ్ఆర్ఐ) వ్యవస్థ కింద ఆర్థిక మోసాల నివారణ చర్యలు రూ. 1,000 కోట్లకు పైగా నష్టాలను నివారించడంలో సహాయపడ్డాయి. తిరస్కరించబడిన లావాదేవీలు, సంభావ్య మోసాలను నివారించడానికి పౌరులకు హెచ్చరికలు లేదా నోటిఫికేషన్‌లు జారీ చేయడం ద్వారా ఈ పొదుపులు సాధించబడ్డాయి. అదనంగా, ప్రభుత్వ సంస్థలు, టెలికం ఆపరేటర్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల మధ్య సమన్వయ చర్యను ప్రతిబింబిస్తూ, షేర్డ్ ఇంటెలిజెన్స్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా ఫ్లాగ్ చేయబడిన మొబైల్ నంబర్‌లకు లింక్ చేయబడిన 28 లక్షల ప్రొఫైల్‌లు లేదా ఖాతాలను వాట్సాప్ నిలిపివేసింది. సైబర్ భద్రతను బలోపేతం చేయడానికి, టెలికం సంబంధిత మోసాల ప్రమాదాలను తగ్గించడానికి, అనుమానాస్పద కమ్యూనికేషన్‌లను నివేదించడం గురించి ప్రజలలో అవగాహనను పెంచడానికి ఈ చర్యలు విస్తృత వ్యూహంలో భాగమని ప్రభుత్వం పేర్కొంది.

# గ్లోబల్ హబ్‌గా భారత్

### చైనా గుత్తాధిపత్యానికి చెక్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 5:** క్రిటికల్ మినరల్స్ రంగంలో దాదాపు 90శాతం చైనా ఆధిపత్యం చెలాయిస్తోంది. దీన్ని దెబ్బకొట్టడానికి భారత్- అమెరికా వ్యూహరచనలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఇటీవల వాషింగ్టన్‌లో నిర్వహించిన క్రిటికల్ మినరల్స్ మినిస్టీరియల్ సమావేశంలో ఇదే అంశంపై కీలక చర్చలు జరిగాయి. భారత్‌తో సహా 54 దేశాలతో కలిసి ఒక కొత్త అంతర్జాతీయ ఖనిజ సమూహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం రెండు ప్రధాన వేదికలు సృష్టించారు. మొదటిది ఎఫ్ఓఆర్‌జిఇ, ఇది మునుపటి




ఖనిజ భద్రతా భాగస్వామ్యాన్ని భర్తీ చేస్తుంది. దీని లక్ష్యం ఖనిజాల ధర, సరఫరాను భద్రపరచడంతోపాటు స్థిరీకరించడం. ప్రస్తుతం, దక్షి ణ కొరియాకు ఈ బాధ్యత అప్పగించారు. రెండవ వేదిక పాక్స్ సిలికా, ఇది సెమీకండక్టర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హైటెక్ పరిశ్రమలకు అవసరమైన ఖనిజాల సరఫరాను చైనా నుండి విశ్వసనీయ దేశాలకు మార్చడానికి పనిచేస్తుంది. ఇందులో భారతదేశం బలమైన మూల స్తంభంగా భావిస్తున్నారు. ఇది భారతదేశానికి ఒక ప్రధాన అవకాశం. భారతదేశం ఇకపై ఖనిజాల కొనుగోలుదారుగా మాత్రమే ఉండదు. కానీ వాటిని శుద్ధి చేయడానికి, ప్రాసెస్ చేయడానికి ప్రపంచ కేంద్రంగా మారుతుంది. చైనా కంటే భారతదేశం వంటి విశ్వసనీయ భాగస్వాములలో ఖనిజ తవ్వకాలు, శుద్ధిలో సుమారు 30 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెడతామని అమెరికా స్పష్టంగా పేర్కొంది. వాషింగ్టన్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి జైశంకర్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్, ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ హాజరయ్యారు. ఈ కొత్త ఖనిజ కూటమిలో భారతదేశం కీలక పాత్ర పోషిస్తుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.



## మెటల్, ఐటీ స్టాక్స్

# పతనం

### నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 503, నిఫ్టీ 113 పాయింట్లు నష్టం

**ముంబై, ఫిబ్రవరి 5:** ప్రపంచ స్థూల ఆర్థిక పరిణామాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహాల ధోరణులపై స్పష్టత కోసం పెట్టుబడిదారులు వేచి చూడటంతో, భారత ఈక్విటీ మార్కెట్లు గురువారం మూడు రోజుల లాభాల పరంపరకు బ్రేక్ వేసి నష్టాలతో ముగిశాయి. ముగింపు సమయానికి, సెన్సెక్స్ 503 పాయింట్లు నష్టపోయి 83,313 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113 పాయింట్లు తగ్గి 25,642 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లు కూడా భారీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.28 శాతం నష్టపోగా, ఎన్ఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 1.29 శాతం పడిపోయింది. చాలా రంగాల సూచీలు నష్టాల్లోనే ట్రేడ్ అయ్యాయి, నిఫ్టీ పిఎస్‌యుబ్యాంక్ మాత్రమే 0.38 శాతం లాభపడింది. మెటల్స్ రంగం అత్యధికంగా 1.02 శాతం నష్టపోయింది. నిఫ్టీ ఐటీ, ఆటో రంగాలు 0.50 శాతానికి పైగా నష్టపోయాయి. ఇటీవల బాగా రాణించిన స్టాక్స్‌లో లాభాల స్వీకరణతో సమతుల్యం కావడంతో, బెంచ్‌మార్క్ పనితీరు మందకొడిగా ఉందని విశ్లేషకులు తెలిపారు. బ్యాంక్ నిఫ్టీ పెరుగుతున్న ట్రెండ్ లైన్ 60,150- 60,180 వద్ద ఉన్న ఇంట్రాడే విడబ్ల్యుఎపి జోన్ కంటే దిగువన ట్రేడ్ అవ్వడం కొనసాగిందని, ఇది బలహీనమైన స్వల్పకాలిక నిర్మాణాన్ని, బుల్లిష్ కొనసాగింపు లేకపోవడాన్ని సూచిస్తోందని మార్కెట్ పరిశీలకులు తెలిపారు. భారత రూపాయి అమెరికన్ డాలర్‌తో పోలిస్తే ఒక పరిధిలో ట్రేడ్ అయింది. గురువారం ఒక డాలర్‌కు 90.32 వద్ద ఉంది, ఇది స్థిరమైన ప్రపంచ సంకేతాల మధ్య సమతుల్య డిమాండ్ సరఫరా డైనమిక్స్‌ను సూచిస్తుంది. యుఎస్-ఇరాన్ చర్చల పురోగతిపై మరింత స్పష్టత కోసం కూడా మార్కెట్ భాగస్వాములు ఎదురుచూస్తున్నారు. నిఫ్టీ 50 కన్సాలిడేషన్‌లోనే కొనసాగింది, ప్రారంభంలో స్వల్పంగా పడిపోయిన తర్వాత, ఇండెక్స్ 25,580-25,600 జోన్‌లో మద్దతును కనుగొంది, ఇది సెషన్ అంతటా స్థిరమైన డిమాండ్ ప్రాంతంగా పనిచేసిందని విశ్లేషకులు తెలిపారు. బలమైన బ్రేకౌట్ లేదా బ్రేక్‌డౌన్ భారీ వాల్యూమ్‌తో వెలువడితే తప్ప, స్వల్పకాలిక ధోరణి పక్కకు లేదా స్వల్పంగా బలహీనంగా ఉంటుందని, ఇండెక్స్ 25,580 మరియు 25,750 మధ్య ఊగిసలాడే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# మారిన పాస్‌పోర్ట్ రూల్స్

### 15 నుంచి అమలులోకి కొత్త నిబంధనలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** పాస్‌పోర్ట్ దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడానికి, భద్రతను బలోపేతం చేయడంలో భాగంగా పాస్‌పోర్ట్ నిబంధనలను భారత విదేశాంగ శాఖ మార్చివేసింది. పాస్‌పోర్ట్ కొత్త నిబంధనలు ఫిబ్రవరి 15 తర్వాత పూర్తిగా అమల్లోకి రానున్నాయి. పాస్‌పోర్ట్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారు కొత్త రూల్స్ ప్రకారం పత్రాలు సమర్పించాలని అధికారులు కోరారు. కొత్త ఫ్రేమ్‌వర్క్ కింద పాస్‌పోర్ట్ కోసం ఏ పత్రాలు అందించాలనే జాబితాను విడుదల చేసింది. పేపర్ వర్క్‌ను పనిని తగ్గించడానికి డిజిటలైజ్ చేశారు. ఆధార్, ప్రభుత్వం జారీ చేసిన ఇతర ఐడిలు వంటి వాటిని తప్పనిసరి చేశారు. దరఖాస్తుదారులు తక్కువ పత్రాలు, పాస్‌పోర్ట్ కార్యాలయాలకు ఎక్కువ సార్లు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ కొత్త రూల్స్‌ను రూపొందించారు. అయితే అసంపూర్ణమైన లేదా తప్పు పత్రాలతో సమర్పించిన దరఖాస్తులను పూర్తిగా రిజక్ట్ అవుతాయని అధికారులు హెచ్చరించారు. దరఖాస్తు ప్రక్రియను కూడా చాలా యూజర్ ఫ్రెండ్లీగా మార్చారు. ప్రభుత్వ పాస్‌పోర్ట్ పోర్టల్‌ను మెరుగైన లక్షణాలతో అప్‌గ్రేడ్ చేశారు, ఇది దరఖాస్తుదారులు మధ్యవర్తుల అవసరం లేకుండా ఫారమ్‌లను పూరించడానికి, పత్రాలను అప్‌లోడ్ చేయడానికి, అపాయింట్‌మెంట్ స్లాట్‌లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. డిజిటల్ సమర్పణ, రియల్‌టైమ్ నోటిఫికేషన్‌లపై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో, దరఖాస్తుదారులు తమ దరఖాస్తు స్థితిని సులభంగా ట్రాక్ చేయవచ్చు. మైనర్లకు సంబంధించిన క్లియరెన్స్‌లో తల్లిదండ్రుల సమ్మతి, డిజిటల్ జనన ధ్రువీకరణ పత్రాలు లేదా పాఠశాల ,దీలు సజావుగా ఆమోదించబడుతున్నాయని నిర్ధారించుకోవడానికి పాస్‌పోర్ట్ నియమాలను కూడా స్పష్టం చేశారు,




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.